


GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం

తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY


సంపుటి : 12 సంచిక : 74 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 శుక్రవారం 23 మే 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్




## పాక్ కాల్పుల విరమణకు సాగిలపడింది

- ఇందులో ట్రంప్ పాత్ర ఏ మాత్రం లేదు
- విదేశీ మీడియాతో జైశంకర్ స్పష్టీకరణ

న్యూఢిల్లీమే22(సమయజ్యోతి):



భారత్-పాక్ అణుయుద్ధాన్ని ఆపానని, కాల్పుల విరమణ ఒప్పందం కుదరడానికి తానే కారణమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే ప్రకటించుకోవడాన్ని విదేశాంగ మంత్రి జైశంకర్ తోసిపుచ్చారు. విదేశీ మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. కాల్పుల విరమణపై తమ రెండు దేశాలు నేరుగా చర్చలు జరిపాయన్నారు. 'రెండు దేశాల ప్రతినిధులు హాట్‌లైన్‌లో మాట్లాడుకునేలా మాకు తగిన వ్యవస్థ ఉంది. మే 10న పాక్ ఆర్మీ నుంచి మాకు ఒక సందేశం వచ్చిందని, ఫైరింగ్ ఆపడానికి తాము సిద్ధంగా ఉన్నామని దాని సారాంశం' అని జైశంకర్ స్పష్టంచేశారు. అయితే ఈ పక్రియలో అమెరికా ఎక్కడ ఉందని అన్నారు. అలాగే ఉద్రిక్తతల సమయంలో చోటుచేసుకున్న పరిణామాలను వెల్లడించారు. 'అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మన ప్రధానితో మాట్లాడారు. ఆ దేశ విదేశాంగ మంత్రి నాకు ఫోన్ చేశారు. వారు పాకిస్థాన్‌తోను మాట్లాడారు. ఒక్క అమెరికానే కాదు మిగతా దేశాలు కూడా మనతో సంప్రదింపులు జరిపాయి. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు ఉన్నప్పుడు.. ఇతర దేశాల నుంచి కాల్స్ రావడం సహజమే. కాల్పుల విరమణ గురించి భారత్-పాక్ నేరుగా మాట్లాడుకున్నాయి. కాల్పులు ఆగాలంటే పాక్ నేరుగా మాతో మాట్లాడాలని అమెరికాతో సహా అన్ని దేశాలకు స్పష్టంచేశాం' అని మంత్రి క్లారిటీ ఇచ్చారు. పాక్ నేతలు, మరీ ముఖ్యంగా ఆ దేశ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ మత ఛాందసవాదంపై జైశంకర్ విమర్శలు చేశారు. 'మతం గురించి అడిగి తెలుసుకున్న తర్వాత కుటుంబసభ్యుల ముందే 26 మందిని దారుణంగా హత్య చేశారు. మతపరమైన విభేదాలు సృష్టించడానికి మతం అనే అంశాన్ని ఉద్దేశపూర్వకంగా ముందుకుతెచ్చారు' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. అలాగే ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని వెల్లడించారు.

## సిందూరం తుడిచిన వాళ్లకు ఆపరేషన్ సిందూర్‌తో జవాబిచ్చాం

- పాకిస్థాన్‌ను మోకాళ్లపై కూర్చోబెట్టాం
- ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడికి 22 నిమిషాల్లో బదులిచ్చాం
- ఉగ్రవాదులను ఉసిగొల్పితే ఇక అంతే సంగతలు
- మరోమారు పాక్‌ను హెచ్చరించిన ప్రధాని మోడీ
- రాజస్థాన్ బికనీర్ వేదికగా పలు స్టేషన్లకు వర్చువల్‌గా ప్రారంభంం

జయపుర,మే22(సమయజ్యోతి):



మన మహిళల సిందూరాన్ని తుడిచిన వాళ్లను మట్టిలో కలిపేశామని ప్రధాని మోడీ అన్నారు. మన భద్రతా బలగాలు పాకిస్థాన్‌ను మోకాళ్లపై కూర్చోబెట్టాయని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడికి 22 నిమిషాల్లో బదులిచ్చాయని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ ను ఉద్దేశించి ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో ఉగ్రవాదుల ఏరివేతకు త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని, ఈ ఆపరేషన్ విజయవంతం కావడంతో దేశ ప్రజలంతా గర్విస్తున్నారని అన్నారు. రాజస్థాన్‌లో పర్యటిస్తున్న సందర్భంగా బికనీర్‌లో ఏర్పాటు చేసిన సభలో పహల్గామ్ గురించి మాట్లాడుతూ.. ఉద్వేగపూరితంగా ప్రసంగం చేశారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులను అంతం చేశామని తెలిపారు. కేంద్రం త్రివిధ దళాలకు పూర్తి స్వచ్ఛ ఇచ్చిందని గుర్తుచేశారు. మన దళాలు చక్ర వ్యూహాలు పన్ని శత్రువులను ఉక్కిరిబిక్కిరి చేశాయని తెలిపారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్ర దాడికి జవాబుగా 22 నిమిషాల్లోనే ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదుల్ని మట్టుబెట్టినట్లు చెప్పారు. భారత్‌లో రక్తపుటేర్లు పారించిన వాళ్లను ముక్కలు.. ముక్కలు చేసినట్లు మోడీ పేర్కొన్నారు. మే 7న చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ద్వారా జైష్-ఎ-మొహమ్మద్, లష్కరే-ఎ-తోయిబా మరియు హిజ్బుల్ ముజాహిదీన్ వంటి ఉగ్రవాద గ్రూపులతో అనుబంధంగా ఉన్న దాదాపు 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారని తెలిపారు.

2 లో



## యువతను స్వయం ఉపాధి రంగాల్లో ప్రోత్సహించాలి

- ప్రభుత్వ పథకాలకు చేయూతనివ్వండి
- రాజీవ్ యువ వికాసానికి రుణాలు అందించాలి
- బ్యాంకర్ల సమావేశంలో
- డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క



02

హైదరాబాద్,మే22(సమయజ్యోతి):

రాజీవ్ యువ వికాసం పథకం కింద జూన్ 2వ తేదీన ఐదు లక్షల మంది యువతకు మంజూరు పత్రాలు పంపిణీచేయనున్న లక్ష్యాన్ని సమయానికి సాధించేందుకు బ్యాంకర్ల సహకారం అవసరమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. హైదరాబాదులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రుణ ప్రణాళిక లక్ష్యాలను చేరుకోవడం ముఖ్యమని అన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థ ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే సమాజం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు.

## బిజెపి చేస్తున్న అభివృద్ధి కళ్లకు కనబడుతోంది

- కరీంనగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధి ఇందుకు నిదర్శనం
- అమృత్ భారత్ పథకం కింద స్టేషన్ ఆధునీకరణ
- ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న బండి సంజయ్



02

కరీంగనర్,మే22(సమయజ్యోతి):

గతంలో బీఆర్ఎస్ సహా కొన్ని పార్టీల నాయకులు రైల్వే అభివృద్ధిపై కేవలం లేఖలు రాసి బాధ్యతను దులుపుకున్నారని, కానీ అలా కాకుండా తాము అభివృద్ధికి కట్టుబడి పనిచేశామని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు.



# సిందూరం తుడిచిన వాళ్లకు ఆపరేషన్ సిందూర్‌తో జవాబిచ్చాం

మొదటి పేజీ తరువాయి

ఉగ్రవాదంపై పోరాటానికి భారతదేశం ఐక్యంగా ఉందని చెప్పారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి 140 కోట్ల మంది భారతీయులను కదిలించిందన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదుల గుండెపై దాడి చేశామన్నారు. సైన్యానికి పూర్తి స్వేచ్ఛ నివ్వడంతోనే ఇదంతా జరిగిందని మోడీ చెప్పుకొచ్చారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో ఉగ్రవాదులు.. అమాయకులను లక్ష్యంగా చేసుకున్నారని.. మతం ఆధారంగా వేరు చేసి.. మహిళల నుదిటిపై ఉన్న సిందూరాన్ని తుడిచేశారని.. దానికి ప్రతీకారంగానే మన దళాలు వాళ్లను మట్టిలో పాతిపెట్టేశారన్నారు. 140 కోట్ల మంది భారతీయుల హృదయాలను గాయపరిచారు.. అందుకే వాళ్లను ముక్కలు.. ముక్కలు చేశామని వెల్లడించారు. కేవలం 22 నిమిషాల్లోనే ఉగ్రవాదుల శిబిరాలు నాశనం అయినట్లు చెప్పారు. త్రివిధ దళాల దెబ్బకు పాకిస్థాన్ వెనక్కి తగ్గిందని తెలిపారు. ఇక అణు బాంబుల భయానికి భారతదేశం వెనుకాడదని మరోసారి మోడీ స్పష్టం చేశారు.'సిందూరం భగ్గుమంటే దాని ఫలితం ఎలా ఉంటుందో అందరూ చూశారు. ఏప్రిల్ 22న ఉగ్రదాడికి ప్రతిగా 22 నిమిషాల్లో ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశాం. ఉగ్రమూకలను మట్టిలో కలిపేశాం. నా సిరల్లో రక్తం కాదు సిందూరం ప్రవహిస్తోంది. పాక్‌లోని రహీమ్ యార్ ఖాన్ ఎయిర్‌బేస్ ఐసీయూలో ఉంది. అణుబెదిరింపులకు భారత్ ఇక ఏమాత్రం భయపడదు. పాక్‌తో ఎలాంటి వాణిజ్యం, చర్చలు ఉండవు. చర్చల మాట అంటూ వస్తే.. అది పాక్ ఆక్రమిత కశ్మీర్ గురించే. ఉగ్రదాడి జరిగితే.. పాక్ ఆర్మీ, ఆర్థికవ్యవస్థ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని మనం స్పష్టంచేశాం. మన దేశానికి న్యాయంగా చెందాల్సిన నీరు ఇక పాక్‌కు ప్రవహించదు. భారత ప్రజల జోలికివస్తే.. గట్టి గుణపాఠం తప్పదు' అని గట్టి హెచ్చరికలు చేశారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు మౌలిక సదుపాయాల కల్పన కోసం భారీ కృషి జరుగుతోంది. ఈ దిశగా గత 11 ఏళ్లుగా అవిశ్రాంతంగా పనిచేశాం. భారత రైలు నెట్‌వర్క్ ఆధునికీకరిస్తున్నాం. వేగం, పురోగతికి వందే భారత్, అమృత్ భారత్, నమో భారత్ రైళ్లు ప్రతీకలు అంటూ కేంద్ర ప్రభుత్వం చేపడుతోన్న అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రస్తావించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద పునర్నిర్మించిన దేశ్‌నోక్ స్టేషన్‌ను ప్రారంభించారు. అలాగే బికనేర్–ముంబయి ఎక్స్‌ప్రెస్ రైలుకు జెండా ఊపారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. అలాగే దేశ్‌నోక్‌లోని కర్ణిమాత ఆలయంలో పూజలు చేశారు. ఇక అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా 18 రాష్ట్రాల్లో అత్యాధునికంగా తీర్చిదిద్దిన 103 అమృత్ భారత్ స్టేషన్లను రాజస్థాన్ నుంచి వర్చువల్‌గా మోడీ ప్రారంభించారు. కొత్త స్టేషన్లను జాతికి అంకితమిచ్చారు. ఇందులో తెలంగాణలోని బేగంపేట, కరీంనగర్, వరంగల్ రైల్వేస్టేషన్లు ఉన్నాయి. ఏపీలోని సూళ్లూరుపేట అమృత్ భారత్ స్టేషన్‌ను కూడా ప్రారంభించారు.యూపీలో 19, గుజరాత్‌లో 18, మహారాష్ట్రలో 15, రాజస్థాన్‌లో 8 అమృత్ భారత్ స్టేషన్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ పాల్గొన్నారు. అంతకుముందు బికనీర్‌లోని కర్ణిమాత ఆలయాన్ని ఆయన సందర్శించారు. అమ్మవారికి ప్రధాని మోదీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మ వారి తీర్థ ప్రసాదాలను ఆలయ పూజారులు.. ప్రధాని మోదీకి అందజేశారు. అనంతరం బికనీర్ ఎయిర్ బేస్‌ను మోదీ సందర్శించారు. మరోవైపు బికనీర్ సమీపంలో పాలనా గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం తొలిసారిగా ప్రధాని మోదీ రాజస్థాన్‌లో పర్యటించారు. పహల్గాం ఉగ్రదాడి జరిగిన సరిగ్గా నెల రోజులకు ప్రధాని మోదీ రాజస్థాన్‌లోని బికనీర్ ఎయిర్ బేస్‌ను సందర్శించడం గమనార్హం.

# బిఆర్ఎస్ ఫ్యామిలీలో భగ్గుమన్న విభేదాలు

## పార్టీలో పనితీరుపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర అసహనం

## బిజెపికి చేరువుతున్న తీరును తప్పు పట్టిన కవిత

## పార్టీలో ఎవరికీ అందనంత దూరంగా కెసిఆర్ తీరు

## పార్టీ రజతోత్సవ సభలో సీనియర్లకు దక్కని ప్రాధాన్యం

## కెసిఆర్‌ను ప్రశ్నిస్తూ..లేఖను సంధించిన తనయ

హైదరాబాద్,మే22(సమయజ్యోతి):

బిఆర్ఎస్ ఫ్యామిలీలో విభేదాలు ఉన్నాయని కాంగ్రెస్ నేతలు పదపదే చేస్తున్న ఆరోపణలు నిజం చేస్తూ కవిత రాసిన లేఖతో బటటబయలు అయ్యింది. దీంతో ఇప్పుడు బిఆర్ఎస్‌లో ఏం జరుగుతోందన్న వాదన జరుగుతోంది. తాజాగా తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యంగా బిఆర్ఎస్ పార్టీలో సంచలన పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ అధినేత, తన తండ్రి కేసీఆర్ తీరుపట్ల ఎమ్మెల్సీ కవిత ధిక్కార స్వరం వినిపించారు. పార్టీ తీరుపై నేరుగా కేసీఆర్‌కే ప్రశ్నలు సంధించారు. తన సందేహాలను వ్యక్తం చేస్తూ గురువారం నాడు కేసీఆర్‌కు సంచలన లేఖ రాశారు. ఈ లేఖలో బీజేపీతో బీఆర్ఎస్ దోస్తీ వ్యవహారాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. ఇంకా ఈ లేఖలో ఆమె కేసీఆర్‌కు ఎలాంటి ప్రశ్నలు సంధించారనే వివరాలను చూస్తే, పార్టీ తీరుపట్ల ఆమె అసమనంగా ఉన్నట్లు తెలుస్తోంది. బిజెపితో అంటకాగేలా వ్యవహారాలు ఉన్నాయని ఆమె భావిస్తున్నారు. అందుకే బీఆర్ఎస్ నిర్ణయాలు, వ్యవహారాల పై సూటిగా ప్రశ్నలు సంధిస్తూ పార్టీ అధినేత కేసీఆర్‌కు ఎమ్మెల్సీ కవిత లేఖ రాశారు. పార్టీ లీడర్స్‌కి యాక్సెస్ ఇవ్వడం లేదంటూ కవిత తన లేఖలో ఆరోపించారు. మై డియర్ డాడీ అంటూ కేసీఆర్‌కు లేఖ రాసిన కవిత.. బీజేపీతో బీఆర్ఎస్ వ్యవహరిస్తున్న తీరుపై తన సందేహాలను వ్యక్తం చేశారు. బీజేపీతో పొత్తు అంశంపై సిల్వర్ జూబ్లీ సభలో కూడా క్లారిటీ ఇవ్వలేదన్నారు. బీజేపీ మీద రెండు నిమిషాలే మాట్లాడారని.. ఆ పార్టీపై ఇంకా బలంగా మాట్లాడాల్సిందని కవిత అభిప్రాయపడ్డారు. బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకుంటారేమో అనే చర్చ మొదలైందన్నారు. తాను సఫర్ అయ్యాను కదా.. బహుశా అందుకని కావొచ్చు అని కవిత తన లేఖలో పేర్కొన్నారు. బీజేపీని ఇంకొంచెం టార్గెట్ చేయాల్సిందని కవిత తన అభిప్రాయాన్ని వ్యక్త పరిచారు. కాంగ్రెస్‌పై గ్రాస్‌రూట్స్‌లో నమ్మకం పోయిందన్న కవిత.. బీజేపీ ఆల్టర్‌నేటివ్ అనే ఆలోచనను మన కేడర్ చెబుతోందన్నారు. 'ఎమ్మెల్సీ ఎన్నికల్లో మనం పోటీ చేయకుండా.. బీజేపీకి హెల్ప్ చేశామనే మెసేజ్ కాంగ్రెస్ బలంగా తీసుకెళ్లింది. కేసీఆర్ యాక్సెస్ దొరకడం లేదని, సెలెక్టివ్ యాక్సెస్ అని జడ్పీటీసీ, జడ్పీ చైర్మన్లు, ఎమ్మెల్యే స్థాయి నేతలు బాధపడుతున్నారు. అందరికి అందుబాటులో ఉండేలా ప్రయత్నించండి అంటూ కూడా సూచనలు చేశారు. వరంగల్ సభలో ఉద్యమ నేతలకు సరైన ప్రాధాన్యం దక్కలేదు. 2001 నుంచి మీతో ఉన్నవారికి మాట్లాడే అవకాశం ఇస్తే బావుండేది. పాత ఇన్‌చార్జ్‌లకే బాధ్యతలు ఇవ్వడం కూడా కేడర్‌కు నచ్చలేదు. స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్నవారికి.. నేరుగా పార్టీ ఆఫీసు నుంచే బీ ఫామ్స్ ఇవ్వాలి. వరంగల్ సభలో ఉర్దూలో మాట్లాడలేదు, వక్ఫ్ బిల్లుపై మాట్లాడలేదు. ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం అంశాన్ని విస్మరించారు.' అని కవిత తన లేఖలో సంచలన అంశాలను ప్రస్తావించారు. వాస్తవానికి కవిత అమెరికాకు వెళ్లడానికి ముందే కేసీఆర్‌కు లేఖ రాసినట్లు కాంగ్రెస్ నేత సామ రామ్ మోహన్ రెడ్డి ఆరోపించారు. ప్రెస్‌మీట్ పెట్టి మరీ ఈ అంశాన్ని హైలెట్ చేశారు. ఇప్పుడు ఆ లేఖ వ్యవహారం నిజమని తేలింది. లేఖలో పేర్కొన్న అంశాలను పరిశీలిస్తే సామ చెప్పినట్లుగా కేసీఆర్ ఫ్యామిలీలో ఏదో నడుస్తోందనే అనుమానం మరింత బలపడుతోంది. అంతా కెటిఆర్ పెత్తనం సాగుతోందని, కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఇకపోతే ఫ్యామిలీలో కెసిఆర్‌ను పక్కన పెట్టారని, కెటిఆర్ అంతా తానై కెసిఆర్‌ను కూడా పట్టించుకోవడం లేదన్న పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ వాదనలకు కూడా బలం చేకూరింది.

# తాను ఎంపిగా ఉన్నప్పుడు స్టేషన్ అభివృద్ధికి పట్టుబట్టా

## నేటికి అది సాకారమయ్యిందన్న మంత్రి పొన్నం

## తిరుపతికి రోజూ రైలు సర్వీస్ నడపాలని వినతి

కరీంనగర్,మే22(సమయజ్యోతి):

తాను కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పుడు ఆనాటి రైల్వే శాఖ మంత్రి మమతా బెనర్జీ ఉన్నప్పుడు కరీంనగర్ ఈ స్టేషన్ ను మార్పు చేయడం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దేశంలో 103 స్టేషన్ లలో తెలంగాణ నుండి కరీంనగర్, వరంగల్, బేగంపేట రైల్వే స్టేషన్ లను పునరాభివృద్ధి చేసి ప్రారంభం చేసుకున్నందుకు అభినందనలు తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా పునరాభివృద్ధి చెందిన కరీంనగర్ రైల్వే స్టేషన్ ను వర్చువల్‌గా ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రయాణికుల సౌకర్యం కోసం అధునాతన సౌకర్యాలతో పునరభివృద్ధి చేసుకొని ప్రారంభం చేసుకున్నామని, 1267, 1268 నంబర్ ట్రైన్ కరీంనగర్ నుంచి తిరుపతి, తిరుపతి నుంచి కరీంనగర్ వెళ్ళే రైలు వారానికి రెండు రోజులు నడుస్తుంది దానిని ప్రతిరోజూ లేదా వారానికి నాలుగు రోజులు నడిచేలా చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ను పొన్నం కోరారు. తిరుపతి రైలుకు ప్రయాణికుల రద్దీ బాగుండడంతో నిత్యం వెళ్లేలా చేస్తే చాలా బాగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రైల్వే స్టేషన్ లో ఫర్టిలైజర్ లోడింగ్, అన్ లోడింగ్ హమాలీ సమస్యలను తొలగించామన్నారు. కరీంనగర్ నుంచి ముంబయి, షిర్డీలకు రైలు ప్రారంభిస్తే అందరికీ ఉపయోగపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్కా కొమురయ్య పాల్గొన్నారు. కరీంనగర్ నుండి తిరుపతి వెళ్ళే వీక్లీ ఎక్స్ ప్రెస్ రైలును ప్రతిరోజు నడిచేలా మార్చాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కు మంత్రి పొన్నం ప్రభాకర్ వినతిపత్రం సమర్పించారు.

మొదటి పేజీ తరువాయి

# యువతను స్వయం ఉపాధి రంగాల్లో ప్రోత్సహించాలి

ఐదు లక్షల యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రూ.6,250 కోట్లు సబ్సిడీతో ఈ పథకం అమలు చేస్తున్నట్టు తెలిపారు. యువతను ఉత్పత్తి రంగంలోకి తీసుకువచ్చి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు తోడ్పడేలా పథకం రూపొందించామని తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకం సజావుగా అమలవడానికి రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక నోడల్ అధికారి నియమించి సమన్వయం చేయాలని, పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇచ్చి, ప్రత్యేకంగా ఉద్యానవన పంటలకు ప్రోత్సాహకాలు అందిస్తోందని, ఆయిల్ ఫామ్ సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నట్టు పేర్కొన్నారు. రైతు రుణమాఫీకి రూ.21 వేల కోట్లను బ్యాంకుల్లో జమ చేసి రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నట్టు తెలిపారు. అలాగే రైతు బీమా ప్రీమియం డబ్బులు ప్రభుత్వం కట్టుతుందని తెలిపారు. అదివి బిడ్డల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు ఇన్‌దిరా సౌర గిరి జల వికాస పథకం రూపకల్పన చేసి, రూ.12,600 కోట్లు ఖర్చు పెట్టి ఆరు లక్షల 70 వేల ఎకరాలలో సౌర విద్యుత్తును సాగులో ఉపయోగించాలని ప్రణాళిక చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రాబోయే ఐదేళ్లలో మహిళా సంఘాలకు లక్షల కోట్లు వడ్డీ రహిత రుణాలుగా ఇస్తూ మానవ వనరుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. విద్యార్థులకు ఫీజు రీయంబర్స్మెంట్, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటు చేస్తున్నామని, పరిశ్రమల కోసం ట్రైనింగ్ అందిస్తున్నామని తెలిపారు. మూసీ నదిని పునర్జీవం చేయడానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు, ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ మధ్య పారిశ్రామిక అభివృద్ధి కోసం వివిధ క్లస్టర్ల ఏర్పాట్లపై ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# బిజెపి చేస్తున్న అభివృద్ధి కళ్లకు కనబడుతోంది

ఇప్పుడు అభివృద్ధి కనిపిస్తున్న తరవాత కూడా ఇదంతా తమ వల్లే జరిగిందని ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. మాటలకే పరిమితమవ్వకుండా వాస్తవిక ఫలితాలు చూపాలన్నది ప్రధాన విషయం. బుల్లెట్ దిగిందా? లేదా? అనేది ప్రజలే తేల్చాలని బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు.అమృత్ భారత్ పథకం కింద ఆధునీకరించిన కరీంనగర్ రైల్వే స్టేషన్ ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో ఎవరి పాలనలో అభివృద్ధి జరిగిందో కరీంనగర్ స్టేషన్ మార్పే నిదర్శనమన్నారు. అలాగే, జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను కూడా అమృత్ భారత్ పథకంలో చేర్చేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.61 కిలోమీటర్ల మేర ఈ లైన్ నిర్మాణానికి సర్వే పూర్తయ్యిందని, డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ కూడా సిద్ధమైందని చెప్పారు. దీని కోసం రూ.1480 కోట్ల వ్యయం అంచనా వేసినట్టు వివరించారు. త్వరలో కేంద్రం దీనిపై నిర్ణయం తీసుకుంటుందన్నారు. కరీంనగర్ నుంచి తిరుపతికి నిత్య రైలు నడిపేందుకు తనతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా లేఖలు రాశారని చెప్పారు. అయితే, రద్దీ , సాంకేతిక కారణాల వల్ల అది సాధ్యపడ లేదని, ప్రస్తుతం వారానికి రెండుసార్లు నడుస్తున్న ఈ రైలును నాలుగు సార్లు నడిపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా రూ.25 వేల కోట్ల వ్యయంతో 1350 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని, వాటిలో భాగంగా రూ.2 వేల కోట్లతో ఆధునీకరించిన 103 స్టేషన్లను ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారని అన్నారు. కరీంనగర్ స్టేషన్ కూడా వాటిలో ఒకటి. రూ.27 కోట్ల వ్యయంతో జరిగిన ఆధునీకరణ పనుల తరువాత కరీంనగర్ రైల్వే స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని తెలిపారు. ఎయిర్‌పోర్టు స్థాయిలో సదుపాయాలు కలిగిన ఈ స్టేషన్‌లో లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఎసీ/నాన్‌ఎసీ వెయిటింగ్ హాల్స్, ఫుడ్ కోర్టులు, టాయిలెట్లు, సోలార్ ఎ÷–లాంట్ వంటి అనేక సదుపాయాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రజలు సెల్ఫీలు తీసుకునే స్థాయికి ఇది చేరిందని ఆయన తెలిపారు. గత 11 ఏళ్లలో రాష్ట్రంలో 20కి పైగా ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామని, మొత్తం 2,298 కిలోమీటర్ల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఒక్క తెలంగాణకే రూ.42,119 కోట్ల విలువైన పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మాత్రమే రూ.5,337 కోట్ల బడ్జెట్ కేటాయించామన్నారు. జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను త్వరలో అమృత్ భారత్ పథకంలో చేర్చుతామని, ఉప్పల్ ఆర్వోబీ నిర్మాణంలో కూడా ఒక లైన్‌ను త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. హసన్‌పర్తి–కరీంనగర్ నూతన రైల్వే మార్గానికి సంబంధించిన అన్ని చర్యలు వేగంగా పూర్తవుతాయని తెలిపారు.

# రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

పెద్ద అడిశర్లపల్లి మే:22 సమయజ్యోతి

పి.ఏ.పల్లి మండలంలోని పెద్దగుమ్మడం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్. ఆయన మాట్లాడుతూ.. మెరుగైన రోడ్డు సదుపాయాలు కల్పించడం కోసం అభివృద్ధి చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఎమ్మెల్యే అన్నారు.అనంతరం మండలంలో పలు శుభకార్యాలలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,మండల పార్టీ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, వర్కింగ్ ప్రెసిడెంట్, కోశాధికారి,వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు,మాజీ కో ఆప్షన్ సభ్యులు, కార్యకర్తలు, NSUI నాయకులు,పాల్గొన్నారు.



# తెలంగాణలో వేగంగా అభివృద్ధి పనులు

## ప్రభుత్వం సహకరిస్తే..మరింత త్వరగా పూర్తి

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

## బేగంపేట అంతర్జాతీయ విమానాశ్రయంగా ఉందన్న కోమటిరెడ్డి

హైదరాబాద్,మే22(సమయజ్యోతి):

తెలంగాణలో రైల్వేల అభివృద్ధిని వేగంగా ముందుకు తీసుకెళ్తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. బేగంపేట, కరీంనగర్, వరంగల్‌లో అత్యాధునికంగా తీర్చిదిద్దిన అమృత్ భారత్ స్టేషన్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బేగంపేట రైల్వే స్టేషన్‌లో మహిళలే పని చేయబోతున్నారని తెలిపారు. దేశంలో 1,300 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ప్రమాదాలు జరగకుండా కవచ్ టెక్నాలజీని తీసుకొచ్చినట్లు తెలిపారు.'తెలంగాణలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. రూ.80 వేల కోట్ల పనులకు సంబంధించి ప్రణాళికలు చేస్తున్నాం. దసరా రోజు కొమురవెల్లి రైల్వేస్టేషన్‌ను ప్రారంభిస్తాం. ఎంఎంటీఎస్ రెండో ఫేజ్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. యాదగిరిగుట్టకు కూడా ఎంఎంటీఎస్ పనులు ప్రారంభిస్తాం' అని కిషన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని కిషన్ రెడ్డి తెలిపారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి ప్రధాని నరేంద్రమోడీ శంకుస్థాపన చేస్తే, మాజీ సిఎం కెసిఆర్ కనీసం రాలేదని విమర్శించారు. విప్లవాత్మకమైన అభివృద్ధి పనులు చేసి చూపిస్తామని అన్నారు. ఇప్పటికే చర్లపల్లి రైల్వేస్టేషన్ ను ప్రారంభించుకున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అప్రోచ్ రోడ్ కు భూసేకరణ పూర్తి చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ఎంత వేగంగా సహకరిస్తే, అంతకంటే వేగంగా కేంద్రం నిధులు మంజూరు చేస్తుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. అమృత్ భారత్' పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా ఆధునికీకరించిన 103 రైల్వే స్టేషన్లను భారత ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ జాబితాలో బేగంపేట, కరీంనగర్, వరంగల్ స్టేషన్లు, ఆంధ్రప్రదేశ్‌కి చెందిన సూళ్లూరు పేట స్టేషన్‌లు ఉన్నాయి. బేగంపేట రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రముఖులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచి చూస్తున్న బేగంపేట స్టేషన్ ఇప్పుడు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తలపించేలా మారిందని ఆనందం వ్యక్తం చేశారు. అలాగే, భవిష్యత్‌లో మరిన్ని రైల్వే స్టేషన్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో కలిసికట్టుగా పనిచేస్తుందని హామీ ఇచ్చారు. గట్కేసర్ నుండి యాదాద్రి వరకు భక్తుల కోసం ఎంఎంటీఎస్ సర్వీస్‌ను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నల్గొండ రైల్వే మార్గాన్ని వేగంగా అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరినట్లు చెప్పారు. ఘట్ కేసర్ ? యాదాద్రి మార్గాన్ని ఆరు నెలల్లో పూర్తిచేయాలన్న దిశగా ప్రయత్నిస్తున్నామని, దీనిపై సీఎం తో చర్చించి త్వరిత క్లియరెన్స్‌కి సహకరిస్తానని తెలిపారు.



# లీగల్ మెట్రాలజీ చట్టాలపై ప్రజలకు అవగాహన అవసరం రాజుల రామనాథం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

వినియోగదారులు లీగల్ మెట్రాలజీ శాఖ చట్టాలను, నిబంధనలపై ప్రజలకు అవగాహనా పెంచాలని, వాటి గురించి తెలుసుకోవాలని అఖిల భారత వినియోగదారుల వెల్ఫేర్ కౌన్సిల్ మ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజుల రామనాథం అన్నారు. గురువారం అంతర్జాతీయ లీగల్ మెట్రాలజీ ఉత్సవాలను పురస్కరించుకొని నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలంలోని పాండురంగ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బాంక్ ఆవరణలో కరపత్రాలను ఆవిష్కరించి, ప్రజలకు అవగాహన కల్పించారు. వస్తువులపై ముద్రించే ఎక్స్పైరీ డేట్ చూసి వినియోగించాలని అలాగే వస్తూ నాణ్యత పరిమాణాల పట్ల కనీస అవగాహన ఉండాలని లీగల్ మెట్రాలజీ రూల్స్ 2011లో బ్రీత్ అనాలైజర్, ఎలక్ట్రిక్ మీటర్లు, విధి విధానాల గురించి ఇప్పటికే సవరణలో చేర్చిన టాక్సీ మీటరు గ్లూకోస్ మీటర్లు, మైశ్చరైసర్ మీటర్ల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ అండ్ గ్యాస్ సేల్స్ ఆఫీసర్ వి మహేష్, ఐఓసీ డీలర్ ప్రసాద్, శంకర్,యూసుఫ్, వెంకటేష్ ,నర్సింగ్ రావు,పాల్గొన్నారు.



# జొన్న కొనుగోళ్లను పరిశీలించిన మార్క్ ఫెడ్ డిఎం ప్రవీణ్ రెడ్డి

**సమయజ్యోతి న్యూస్ మే 22 బజార్ హత్నూర్ బోథ్**

బోథ్ మండల కేంద్రము లో మార్కెట్ యార్డ్ లో జొన్న కొనుగోళ్లను మార్క్ ఫెడ్ డిఎం ప్రవీణ్ రెడ్డి బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి తో కలిసి పరిశీలించారు.ప్రస్తుతవాతావరణ పరిస్థితుల దృష్ట్యా జొన్న కొనుగోళ్లను వేగవంతం చేయాలనీ సొసైటి సిబ్బంది కి సూచించారు.ఈ నెల చివరి వరకు కొనుగోళ్లు జరుగుతాయాని రైతులు పండించిన పంటను ఈ నెల చివరి వరకు మార్కెట్ కి తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని తెలిపారు.ఈ సందర్బంగా మార్కెట్ కు పంటను అమ్ముకోవడానికి వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారి ఆకలి తీరుస్తున్న మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గొర్ల రాజు యాదవ్ ను అభినందించారు.ఈ కార్యక్రమం లో సొసైటీ సిబ్బంది, రైతులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



# జహీరాబాద్ లో తిరంగాయాత్ర

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

ఆపరేషన్ సింధూర్ లో భారత త్రివిధ దళాల విజయం సాధించినందున జహీరాబాద్ పట్టణం లో తిరంగా యాత్ర నిర్వహించినట్లు బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు మన జవాన్ ల విజయం యావత్ భారతావనికి ఒక వరం అని ఆమె అన్నారు సైనికులకు ఈ దేశం జేజేలు పలుకుతున్నదని సైనికుల సేవలను ఆమె కొనియాడారు కులమతాలకు పార్టీలకు అతీతంగా మన వీర సైనికులకు సంపూర్ణ మద్దతు అభినందనలు తెలుపుతూ జహీరాబాద్ పట్టణంలో శివాజీ మహారాజ్ స్టాచ్ నుండి ఐబి గెస్ట్ హౌస్ వరకు తిరంగా యాత్ర నిర్వహించినట్లు ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు బిబి పటేల్ సంగారెడ్డి బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గోదావరి అంజి రెడ్డి రాజశేఖర్ రెడ్డి గొల్ల భాస్కర్ సుభాష్ రెడ్డి టౌన్ అధ్యక్షులు పూల సంతోష్ వివిధ మండలాల అధ్యక్షులు జిల్లా రాష్ట్ర నాయకులు ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు




# ప్రణాళికాబద్ధంగా ఆలయ విస్తరణ పనులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

వేములవాడ రాజన్న ఆలయాన్ని ప్రణాళికా బద్ధంగా విస్తరణ పనులు చేపడుతున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన, కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తో కలిసి ఎంపిడివో కార్యాలయంలో రెండో విడత క్రింద 484 ఇందిరమ్మ ఇండ్ల మంజూరి ఉత్తర్వు ప్రతులను పంపిణీ చేశారు. ఇండ్లు లేని నిరు పేదలకు మొదటి విడతలో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని అన్నారు. రాబోయే 4 సంవత్సరాల పాటు ఏటేటా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 చోప్పున ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక వేములవాడ ప్రాంతంలో వేయి కోట్ల అభివృద్ధి పనులకు సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. వర్షాకాలం ముగిసిన తర్వాత 3వ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి పూర్తి చేస్తామని అన్నారు. గుడి చెరువులో మురుగు నీరు కల్వకుండా 9 కోట్ల ఖర్చు చేసి నివారణ చర్యలు చేపట్టామని, మూల వాగు శుభ్రం చేస్తున్నామని అన్నారు. వేములవాడ ఆలయ విస్తరణకు పకడ్బందీగా చర్యలు చేపట్టామని, ఆలయం మూసివేస్తామని అపోహలు సృష్టిస్తున్నారని, భక్తులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి నిత్యం స్వామివారికి ఎప్పటిలాగే నిత్య పూజలు జరుగుతాయని అన్నారు. గత ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక విధ్వంసాన్ని సరిచేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, తాజాగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం వంటి అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల చేపట్టామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద లబ్ధిదారులకు 5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామని, 400 అడుగుల నుంచి 600 అడుగుల లోపు ఇంటి నిర్మాణం జరిగితే 4 దశలో గ్రీన్ చానల్ ద్వారా 5 లక్షల సహాయం అందుతుందని, బేస్మెంట్ దశలో 1లక్ష రూపాయల, గోడల దశలో 1లక్ష వేలు, స్లాబ్ దశలో 2లక్షలు ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష ఆర్థిక సహాయం అందుతుందని అన్నారు. ఇంటి జాగా లేని నిరు పేదలకు కూడా రెండవ దశలో ఇండ్లు తప్పకుండా ఇస్తామని, ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదని, గతంలో పేదలకు అసైన్మెంట్ భూముల పంపిణీ చేసింది తమ హయంలో మాత్రమేనని, గత 10 సంవత్సరాల కాలంలో అసైన్మెంట్ కమిటీలు లేవని, నేడు మరోసారి భూ భారతిలో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో అసైన్మెంట్ కమిటీలు ఏర్పాటు చేసి నిరుపేదలకు ఇంటి స్థలాలు అందిస్తామని అన్నారు. రాజీవ్ యువ వికాసం క్రింద 4 వేల మంది యువతకు త్వరలో స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు సబ్సిడీ విడుదల చేస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి స్థాయి సహకారం



అందిస్తామని, ప్రభుత్వం తరపున ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని తెలిపారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ భూమి లేని నిరు పేదలకు అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పూర్తి చేసి అందించేందుకు స్థానిక ఎమ్మెల్యే తో కలిసి ప్రణాళికలు తయారు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం రాబోయే రోజుల్లో భూమి లేని నిరు పేదలకు ఇంటి పట్టాల పంపిణీ చర్యలు తీసుకుంటుందని అన్నారు. వేములవాడ పట్టణ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు ఇంటి నిర్మాణ పనులు 30 రోజుల లోగా ప్రారంభించాలని అన్నారు. ఇంటి నిర్మాణంలో పేదలకు పూర్తి సహకారం అందిస్తామని, పెట్టుబడి లేని పేదలకు లక్ష రూపాయలు స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా రుణం అందిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో పిడి హౌసింగ్ శంకర్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, వైస్ చైర్మన్ రాకేష్, సెస్ డైరెక్టర్ ఉమా, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఘాతం రైతు మృతి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిది ఆదిలాబాద్**

డివిజన్ జైనథ్ మండలం సంగ్వి కే గ్రామం కు చెందిన బోయేర్ దామోదర్ వయస్సు 50 సమత్సరంలు తమ వ్యవసాయ భూమిలో పనిచేస్తున్నప్పుడు అకస్మతుగా సంభవించిన గాలి దుమారం బీభత్సానికి విద్యుత్ స్తంభం నుంచి ఇంకో విద్యుత్ స్తంభం వరకు విద్యుత్ సరఫరా చేసే మెయిన్ ఫేస్ తీగ తెగిపడటం వలన, అప్పుడే అటుగా వెళ్తున్న బోయేర్ దామోదర్ ఆది గమనించకుండా దాని మీద కాలు వేయడం వలన విద్యుత్ ఘాతం సంభవించి అక్కడి కక్కడే ప్రాణం కోల్పోయి నాడు, మృతినికి ముగ్గురు కుమార్తెలు ఉండగా పెద్ద కుమార్తె కు మాత్రమే వివాహం జరిగింది, సంగ్వి కే గ్రామంలో విషాద ఛాయలు ఏర్పడ్డాయి,సంఘటనపై విచారణ చేయాలనీ ఎవరిది ఐన నిర్లక్షం ఉంటే కటినంగా శిక్షించాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు



# గిడ్డంగులను సందర్శించిన కలెక్టర్

## - బియ్యం నిల్వలను వేగంగా తరలించాలని ఆదేశం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్ బ్యూరో**

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో గల మార్కెట్ కమిటీ గిడ్డంగులతో పాటు గుండారం శివారులోని స్టేట్ వేర్ హౌజ్ కార్పొరేషన్ కు చెందిన గిడ్డంగులను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం సందర్శించారు. గోడౌన్లలో బియ్యం నిల్వలు, ధాన్యం బస్తాలను భద్రపరుస్తున్న తీరును గమనించారు. ఎన్ని రైస్ మిల్లుల నుండి ఎంత పరిమాణంలో మిల్లింగ్ జరిగిన బియ్యం నిల్వలు గోడౌన్లకు చేరాయి, ఇంకా ఎన్ని నిల్వలు రావాల్సి ఉంది, వాటి నాణ్యత పరిశీలన, లాటింగ్ ప్రక్రియలను ఎలా నిర్వహిస్తున్నారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తూ, బియ్యం, ధాన్యం నిల్వలను గిడ్డంగులకు వేగవంతంగా తరలించాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు కురుస్తున్నందున మిల్లుల వద్ద, కొనుగోలు కేంద్రాలలో బియ్యం, ధాన్యం బస్తాలు తడిసిపోకుండా యుద్ధప్రాతిపదికన వాటిని గోడౌన్లకు తరలించేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గోడౌన్లలో లీకేజీలు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లోడింగ్, అన్లోడింగ్ ప్రక్రియలో జాప్యానికి తావులేకుండా సరిపడా సంఖ్యలో హమాలీలను అందుబాటులో ఉంచాలని, లారీల కొరత నెలకొనకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అన్నారు. ఆయా గిడ్డంగులలో అందుబాటులో ఉన్న స్థలం పూర్తి స్థాయిలో సద్వినియోగం అయ్యేలా చూడాలని, బియ్యం, ధాన్యం బస్తాల తరలింపు సమయంలో వర్షాల వల్ల తడిసిపోకుండా టార్పాలిన్లు తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. కాగా, గిడ్డంగుల వద్ద బియ్యం నిల్వలను అన్లోడింగ్ చేయించడంలో కాంట్రాక్టర్ అలసత్వ వైఖరిని గమనించిన కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు కాంట్రాక్టరుపై నిబంధనలకు అనుగుణంగా చర్యలకు సిఫార్సు చేయాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఎస్ఓ అరవింద్ రెడ్డి, సివిల్ సప్లయిస్ డీ.ఎం శ్రీకాంత్ రెడ్డి, నిజామాబాద్ మార్కెట్ కమిటీ సెక్రెటరీ అపర్ణ, గోడౌన్ మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.



# ఆటపాటల ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యాబోధన చేయండి.

## - హిందీ భాషా సేవా సమితి జిల్లా అధ్యక్షులు సుకుమార్ పెట్కులే

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిది ఆదిలాబాద్**

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆటపాటల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు జాతీయ భాష హిందీ పరిజ్ఞానాన్ని అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి హిందీ భాషా పండితులు కృషి చేయాలని హిందీ భాషా సేవా సమితి జిల్లా అధ్యక్షులు సుకుమార్ పెట్కులే అన్నారు. అదిలాబాద్ జిల్లా కేంద్రంలోని తిరుపెల్లి లో గల హిందీ హైస్కూల్లో హిందీ ఉపాధ్యాయుల కోసం ఏర్పాటుచేసిన ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మూడవరోజు శిక్షణార్థిగా పాల్గొన్న హిందీ భాషా సేవా సమితి జిల్లా అధ్యక్షులు సుకుమార్ పెట్కులే మాట్లాడుతూ ఆటపాటల తో నేర్పడం ద్వారా విద్యార్థులు చాలా ఆకర్షితులై సునాయాసంగా భాషా పరిజ్ఞానాన్ని నేర్చుకోగలుగుతారని దానికి హిందీ ఉపాధ్యాయులుగా మనమంతా మనలో ఉన్న నైపుణ్యాలను ప్రదర్శిస్తూ నూతన పరిజ్ఞానాన్ని వాడుకుంటూ బోధనోపకరణాల ద్వారా జాతీయ భాష హిందీ ని బోధిస్తే చక్కటి ఫలితాలు రాబట్టవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్పీలు ఎం.డి జాకీర్ హుస్సేన్, గోమంత్ రెడ్డి, జావేద్ అలీ లు హైదరాబాదులో ప్రశిక్షణ పొంది హిందీ ఉపాధ్యాయులకు విద్యాబోధనలో పాటించాల్సిన మెలకువల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పది మండలాల హిందీ స్కూల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. కాగా సర్వ శిక్ష అభియాన్ వారు నిర్వహించే ఈ ఉపాధ్యయ శిక్షణ కార్యక్రమానికి పర్యవేక్షకులుగా డి.ఈ.ఓ శ్రీనివాసరెడ్డి, ఏ.ఎస్.ఓ. శ్రీకాంత్ గౌడ్ స్ డైరెక్టర్గా లచ్చిరాం లు వ్యవహరిస్తున్నారు.



# సరస్వతీ పుష్కరాలలో ఓ సి సంఘాల జాతీయ అధ్యక్షులు

**సమయజ్యోతి ప్రతినిధి భూపాల్ పల్లి**

కాళేశ్వరం లో జరుగు తున్న సరస్వతీ పుష్కరాలలో ఓ సి సంఘాల జాతీయ అధ్యక్షులు జి కరుణాకర్ రెడ్డి దంపతులు పుష్కర స్నానం ఆచరించారుఅనంతరం జ్ఞాన సరస్వతీ దేవి కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ని దర్శించు కున్నారు వేద పండితులు ఆశీర్వచనం చేసారు ఉభయ తెలుగు రాష్ట్రములు సుభిక్షము గా ఉండాలని పాడి పంటలు తో పాటు వర్షాలు సమృద్ధిగా కురవాలని అన్ని రంగాలలో రెండు రాష్ట్రాలు ముందుండి అభివృద్ధి పథం లో పయనించాలని కోరుకున్నారు పుష్కర స్నానం కొత్త అనుభూతిని ఇచ్చిందని మొదటి సారి ఇక్కడికి రావడం జరిగిందని ప్రభుత్వం భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించింది అని అన్నారు ప్రతీ ఒక్కరు సరస్వతీ పుష్కరాలకు తరలి వచ్చి పుష్కర స్నానం చేయాలని కోరారు తమ వెంట కుటుంబ సభ్యులు ఉన్నారు



సమయజ్యోతి
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# ప్రకృతి విధ్వంసంతో అత్యంత ప్రమాదం !

ధర్మో రక్షతి రక్షితః..ఇది భారతీయ సనాతన ధర్మం చెబుతోంది. ధర్మాన్ని మనం కాపాడితే అది మనలను రక్షిస్తుంది. అలాగే ప్రకృతిని మనం కాపాడుకుంటేనే మనకు మనుగడ ఉంటుంది. భారతీయ సనాతన ధర్మం అంతా ప్రకృతిని పూజించడం, జీవ వైవిధ్యం గురించి వివరించడం జరిగింది. గాలి,నీరు, భూమి, ఆకాశం, అగ్ని అని పంచభూతాలను పూజించాలన్నది అందుకే. అంటే ఇవి మనిషి మనుగడకు తోడ్పడుతాయి కనుక వాటిపట్ల మనం కృతజ్ఞతగా ఉండాలని భారతీయ సంస్కృతి చెబుతోంది. అంటే పూజించడమనే కాదు.. రక్షించడం..కాపాడుకోవడం అన్న పరమార్థం ఉంది. చెట్టును, పుట్టను పూజించడం వెనక ఉన్న మర్మం కూడా ఇదే. జీవవైవిధ్యం అనగా భూమిపైగల వివిధ రకాల జీవజాతులను రక్షించుకోవడం. జీవవైవిధ్యం కానాడుకుంటేనే భవిష్యత్ తరాలకు అపారమైన విలువ కలిగిన ఆస్తిని కాపాడిన వారం అవుతాం. అందుకు ప్రధానంగా పంచభూతాలను రక్షించడం అలవాటు చేసుకోవాలి. ప్రకృతి విధ్వంసం మొదలైన తరవాతనే మానవాళికి ముప్పు ఏర్పడిందని గుర్తించాలి. కరోనాలాంటి వైరస్‌లు వచ్చినా తట్టుకునే స్థితిలో మనం లేమంటే..అందుకు మనం ప్రకృతిని నాశనం చేయడమేని తెలుసుకోవాలి. మానవ తప్పిదాల కారణంగా లేదా విధ్వంసం కారణంగా జీవజాతుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయి జీవవైవిధ్యం నశించిపోతోంది. జీవవైవిధ్యం ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, జీవవైవిధ్యంపై ప్రజలలో అవగాహనను పెంచటానికి ఐక్యరాజ్యసమితి ప్రతి ఏటా మే22 న 'అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని' జరుపు కోవాలని నిర్ణయించింది. మనం పూజా పునస్కారాలతో మన ప్రకృతిని కాపాడుకునే ప్రయత్నం చేశాం. దీనిని తరవాతి తరం వారు ఈ పూజలేంటని విస్మరిస్తూ వచ్చారు. అంటే మనకు జీవనాధారంగా ఉన్న ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతూ వస్తున్నాం. భారతీయ సంస్కృతిలో జీవవైవిధ్యాన్ని పూజించటం, దైవస్వరూపంగా భావించటం గొప్పవిషయం. అందులో భాగంగానే చెట్లు,చేమ, పశుపక్ష్యాదులను పూజించటం జరుగుతోంది. జీవవైవిధ్యంలోని జీవజాతులు వివిధ రకాల సేవలను, ప్రయోజనాలను మానవ జాతికి, పర్యావరణానికి అందిస్తాయి. ఉదాహరణకు మానవులు, ఇతర జీవజాతుల జీవనక్రియలో భూమిపై విడుదల అయ్యే వ్యర్ధ పదార్థాలను భూమిలోని సూక్ష్మజీవులు కృశింపచేసి భూమిని సారవంతం చేయుటలో కీలకపాత్ర పోషిస్తాయి. ఈ పర్యావరణ సేవలను కేవలం సూక్ష్మజీవులు మాత్రమే నిర్వహించ గలవు. జామకాయ, ఆపిల్, ఉసిరి, కూరగాయలు వంటివి ఆహారంగా పనికి వస్తాయి. అదేవిధంగా వేప, తులసి మొదలగువాటిని ఔషధాలుగా ఉపయోగపడుతున్నాయి. వివిధ జీవజాతులు ఒక నిర్దిష్టమైన పనికి లేదా పర్యావరణ సేవలకు ఉపయోగపడతాయి. అదేవిధంగా కొన్ని నిర్దిష్టమైన జంతువులు మాత్రమే మానవులు ఆహారంగా తినటానికి అనువైనవి. ఉదాహరణకు కోడిమాంసం, గొర్రె, పొట్టేలు మాంసం, జలచరాలు అయిన చేపలు మొదలగునవి తినటానికి అనువైనవి. ఇవి ఆరోగ్యానికి మంచిది. మానవ ఆహారం 80 శాతానికి పైగా మొక్కల ద్వారా అందుతోంది. ఆవు పాల ఉత్పత్తులు మానవ ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. ఆయుర్వేద వైద్య విధానంలో ఆవుపాల ఉత్పత్తులకు విశిష్ట స్థానం కలదు. ముఖ్యంగా చిన్న పిల్లలకి ఆవుపాలు ఎంతో మేలుచేస్తాయి. ఆవు నెయ్యి మెరుగైన జీర్ణక్రియ, రోగనిరోధక శక్తిని పెంచటమే కాక ముఖ్యమైన విటమిన్లను కలిగి ఉంటుంది. ఆవు పాల ఉత్పత్తుల ను హిందూమత పూజా కార్యక్రమాలలో, శుభ కార్యక్రమాలలో విరివిగా వాడడానికి కారణం ఇదే. భారతీయ సంస్కృతిలో ఆవు ఒక భాగం. ఆవు జీవవైవిధ్యంలో అత్యంత ప్రయోజనకరమైన జంతువు. ఆవు పాలే కాదు దాని పేడ, మూత్రం కూడా ప్రకృతి పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తుంది. జీవవైవిధ్యంలో ప్రముఖ పాత్ర వహిస్తున్న ఆవును చంపి మాంసాహారంగా తీసుకోవడం వల్ల మన ప్రకృతిని మనమే ధ్వంసం చేస్తున్నాం. ఆవును పూజించాలన్న ఓ బృహత్తర కార్యక్రమం వెనక కేవలం జీవవైవిధ్య పాత్ర ఉందని చెప్పాలి. ఈ క్రమంలో పశుమాంసానికి అలావాటు పడడం వల్ల వాటి ఉత్పత్తి తగ్గిపోతోంది. పాలు ఇచ్చే సాధు జంతువులు అయిన గేదె,ఆవులు సంఖ్య తగ్గిపోవటం వలన డిమాండ్‌కు తగినవిధంగా పాల ఉత్పత్తి ఉండటం లేదు. జీవవైవిధ్యం నశిస్తే మానవ జాతి కూడా నశిస్తుంది. పర్యావరణ సేవలు, ఆరోగ్య ప్రయోజనాలు, గ్రామీణ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్న పశువులను మాంసంగా వినియోగించరాదన్న డిమాండ్ వెనక ఉన్న పరామర్ధాన్ని గుర్తించాలి. గోవును పూజించాలన్న పూర్వీకుల ఆచారం వెనక ఎంతటి పరిశోధన ఉందో గమరనించాలి. మాంసాహారం తప్పు కాదు. కానీ సమాజానికి అత్యంత అవసరమైన జంతువులను తినడం సరైనది కాదు. ప్రజలు జీవవైవిధ్యానికి ఏది ముఖ్యమో, ఆహారానికి ఏది అవసరమో శాస్త్రీయంగా ఆలోచించాలి. జీవవైవిధ్యం మనుగడ సాగించగలదు. తద్వారా మానవాళి భూమిపై ఆనందంగా జీవనం కొనసాగించగలదు. జీవవైవిధ్య విధ్వంసం వల్లనే కరోనా వైరస్, సార్స్, ఎబోలా వంటి వ్యాధులు జంతువుల నుంచి మానవులకు సంక్రమిస్తున్నాయి. జీవవైవిధ్యం కోల్పోతే లేదా విధ్వంసానికి గురయితే మానవులు ఆరోగ్యంతో సహా అన్నింటినీ కోల్పోతారు. కాబట్టి, జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాలి. ప్రకృతి వనరులను కేవలం పారిశ్రామిక అవసరాలు తీర్చే వ్యాపార వస్తువులుగా చూడరాదు. మానవుని అనాలోచిత చర్యల వల్ల వాతావరణంలో కలుగుతున్న మార్పులు తోడయి, భూమ్మీద నివశిస్తున్న కోట్లాది జీవరాశుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ప్రకృతి వనరులను విచ్చలవిడిగా వినియోగించుకుంటూ, కలుషితాలను తిరిగి ప్రకృతిలోకి విడుదలచేయటం జరుగుతున్నది. నిత్యం పెద్దయెత్తున్న వెదజల్లబడుతున్న కలుషితాలు, విడుదలవుతున్న కర్బన ఉద్గారాల వల్ల భూవాతావరణం గతంలో ఎన్నడూ లేనంతగా వేడెక్కుతుంది. పెరుగుతున్న భూతాపం, భూమ్మీద నివశిస్తున్న సకల జీవరాశుల మనుగడను తీవ్ర సంక్షోభానికి గురి చేస్తుంది. అందుకే మానవ మనుగడలో అత్యంత కీలకమైన పాత్రను పోషించిన జీవరాశలను రక్షించు కోవాల్సిన భాధ్యత సమస్త మానవాళిపైన ఉంది. అభివృద్ధి పేరుతో మానవుడు సాగిస్తున్న పర్యావరణ వినాశకర కార్యక్రమాల వల్ల జీవవైవిధ్యం అత్యంత వేగంగా విధ్వంసానికి గురవుతున్నది. దీనికి మనమే రక్షకులుగా నిలవాలి. పర్యావరణాన్ని కాపాడాలి. ప్రకృతిని రక్షించుకోవాలి. అప్పుడే మానవమనుగడ సాగుతుంది.

# జూరాల ప్రాజెక్టునుండి కొడంగల్ కు సాగు నీరు తరలిస్తే అడ్డుకుంటాం

## - మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

జూరాల ప్రాజెక్టు నుండి సాగునీరు మక్తల్, నారాయణ పేట నియోజకవర్గ రైతుల భూములకు సాగు నీరు ఇవ్వకుండా కొడంగల్ నియోజకవర్గానికి సాగునీరు తరలిస్తే అడ్డుకుంటామని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా గురువారం బి. ఆర్. ఎస్ పార్టీ నాయకుడు రాజేంద్ర శ్రీనివాసరావు ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి 63 వేల ఎకరాల సాగునీరు ఇచ్చే పాలమూరు రంగారెడ్డి పథకం కావాలా? లేక కేవలం 13 వేల ఎకరాల ఆయకట్టు ఇచ్చే కోడంగల్ ఎత్తిపోతల పథకం కావాలో ఎమ్మెల్యే తెలుసుకోవాలని తెలంగాణ రాష్ట్ర తొలి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి సవాల్ చేశారు. ప్రణాళిక లేని ప్రాజెక్టుల నిర్మాణంతో కోట్ల రూపాయలను కొల్లగొడుతూ రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా దగా చేస్తుందని విమర్శించారు. ప్రాజెక్టుల నిర్మాణం ప్రాజెక్టుల నిర్వహణపై ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఏమాత్రం అవగాహన లేదని ఆయన విమర్శించారు. కొడంగల్ ఎత్తిపోతల పథకానికి టెండర్లను పిలిచి పనులు ప్రారంభం కాకముందే, కేవలం మెటీరియల్ ఏసి 100 కోట్ల బిల్లులు పెట్టడం వెనక అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. పాలమూరు రైతాంగ కష్టాలు తెలిసిన తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ అప్పట్లోనే 63 వేల ఎకరాల ఆయకట్టు ఇచ్చే విధంగా పాలమూరు రంగారెడ్డి పథకాన్ని రూపొందించాలని ఆయన అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రాకముందే 90% పనులు పూర్తయిన ఆ పథకాన్ని కాదని కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని తీసుకురావడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఒక్క టీఎంసీ నీటి నిల్వ ఉంచే భూత్పూర్ రిజర్వాయర్ ద్వారా 90 కిలోమీటర్ల మేర పైప్లైన్ ద్వారా కొడంగల్ కు నీరు ఎలా తీసుకుపోతారని అన్నారు. భూత్పూర్ రిజర్వాయర్ నుంచి నర్వ, అమరచింత, ఆత్మకూర్ చెరువులను నింపడంతో పాటు వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. పైప్ లైన్ ల ద్వారా కొడంగల్ నియోజకవర్గం నికి నీరు తీసుకెళ్లి ఈ ప్రాంత రైతాంగాన్ని దాగా చేయాలని



చూస్తే పైప్ లైన్లను పగలగొట్టి అయినా రైతులకు న్యాయం చేసే విధంగా ఉద్యమిస్తామని అన్నారు. కొడంగల్ ఎత్తిపోతల పథకం కోసం ఉన్నతాధికారులు బలవంతంగా రైతుల నుంచి పొలాలను లాక్కోవాలని చూడడం సరికాదని అని అన్నారు. ఈ సమావేశంలో బి ఆర్ఎస్ నాయకులు మాజీ జడ్పీటీసీ రాజేందర్ సింగ్,బి. ఆర్. ఎస్ పార్టీ అమరచింత మండల అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, ఆత్మకూరు మండల అధ్యక్షుడు రవి కుమార్ యాదవ్, మంగమ్మ,నాగభూషణం గౌడ్, మాజీ మార్కెట్ చైర్మన్ ఎస్.ఏ. రాజు,నాగభూషణం గౌడ్, రియాజ్ అలీ, అంజి, జింక రవి, పట్టణ ప్రధాన కార్యదర్శి చిన్నబాలరాజ్, షంషీర్, శంకర్ నాయక్, మసూమ్, తదితరులు పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

## - కాంగ్రెస్ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

తడిసిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు అసత్య ప్రచారాలతో రైతులను ఆందోళనకు గురి చేయవద్దని సూచించారు. తడిసిన ధాన్యం అంశంపై కలెక్టర్ దృష్టికి తీసుకుపోగా ఆయన దీనిపై స్పందించారని రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని చెప్పారని తెలిపారు.



# హిందూ ఏక్తా యాత్ర ముఖ్యఅతిథిగా

## - బండి సంజయ్ కుమార్

### - భారీ ఎత్తున తరలివచ్చిన ప్రజలు

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

కరీంనగర్ జిల్లా కేంద్రంలో గురువారము సాయంత్రము హిందూ ఏక్తా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు. కరీంనగర్ పట్టణ పురవీధుల్లో నిర్వహించిన ర్యాలీలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# శ్రీ భాగ్యరెడ్డి వర్మ 137 వ జయంతి

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

శ్రీ భాగ్యరెడ్డి వర్మ 137 వ జయంతిని పురస్కరించుకొని గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన వేడుకలలో జిల్లా పాలనాధికారి సందీప్ కుమార్ ఝ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన గావించి భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజా మనోహర్ తో పాటు జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం

## ప్రభాకర్ రావు ఇంటికి సిట్ టీమ్ నోటీసులు

**హైదరాబాద్,మే22(సమయజ్యోతి):** ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు ఇంటికి సిట్ టీమ్ చేరుకుని నోటీసులు అంటించారు. ప్రభాకర్ రావును ప్రొక్లయిమ్డ్ అఫెండర్‌గా ప్రకటించాలని నాంపల్లి కోర్టును పోలీసులు కోరారు. దీనికి సంబంధించి జనవరిలో పోలీసులు పిటిషన్ వేశారు. దీనిపై విచారించిన న్యాయస్థానం రెండు రోజుల క్రితం కీలకమైన ఆదేశాలు ఇచ్చింది. ప్రభాకర్ రావు గడువులోపు న్యాయస్థానం ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. కోర్ట్ ఇచ్చిన గడువులోపు హాజరుకాకుంటే ప్రకటిత నేరస్తుడిగా ప్రకటిస్తామని కోర్టు తెలియజేసింది. ప్రభాకర్‌రావు ప్రకటిత నేరస్తుడిగా ప్రకటిస్తే ఆయన స్థిర, చర ఆస్తులను జప్తు చేసే అవకాశం ఉంది. జూన్ 20 లోపు వ్యక్తిగతంగా న్యాయస్థానం ముందు హాజరుకావాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో గురువారం తారామతిలోని ప్రభాకర్ రావు ఇంటికి పోలీసులు చేరుకున్నారు. అయితే ఇంట్లో ఎవరూ లేకపోవడంతో వ్యక్తిగతంగా హాజరుకావాలంటూ ఇంటికి పోలీసులు నోటీసులు అంటించారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్నారు. అందులో భాగంగా పోలీసుల విచారణలో కీలకమైన అంశాలు వెలుగు చూశాయి. ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదు అయిన తర్వాత ప్రభాకర్ రావు అమెరికాలో తలదాచుకున్నాడు. దీంతో సీబీఐకి తెలంగాణ సీఐడీ లేఖ రాసింది. దీనిపై స్పందించిన సీబీఐ.. ఇంటర్‌పోల్ సాయంతో రెడ్ కార్నర్ నోటీసును జారీ చేసింది. అయినప్పటికీ ప్రభాకర్ రావు అమెరికా నుంచి ఇండియాకు రాలేదు. దీంతో ఆయన పాస్‌పోర్టును కూడా సస్పెండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసుకు సంబంధించి ఇప్పటి వరకు ప్రభాకర్ రావు విచారణకు రాకుండా డుమ్మాకొడుతూ వచ్చారు.మరోవైపు నాంపల్లి కోర్టు గతంలో ప్రభాకర్ రావుకు నాన్ బెయిలబుల్ వారెంట్ ఇచ్చింది. దాన్ని తెలంగాణ హైకోర్టులో ప్రభాకర్ రావు సవాల్ చేయగా... అక్కడ కూడా అతడికి వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. కొద్దిరోజుల క్రితమే ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ తెలంగాణ హైకోర్టులో ప్రభాకర్ రావు పిటిషన్ దాఖలు చేశారు. తెలంగాణ హైకోర్టు కూడా ప్రభాకర్ రావుకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావు దారులన్నీ మూసుకు పోయాయని చెప్పుకోవచ్చు. దీంతో కచ్చితంగా పోలీసుల విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావాల్సి ఉంది. ఒకవేళ కోర్టు ఇచ్చిన గడువులోపు విచారణకు ప్రభాకర్ రావు హాజరుకాకపోతే తదుపరి చర్యలు తీసుకునే అవకాశాలు కన్పిస్తున్నాయి.

# మాదకద్రవ్యాలు నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝు

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

జిల్లాలో మాదకద్రవ్యాలు (డ్రగ్స్) నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం వారం ఆయన, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లో జిల్లా స్థాయి నార్కో సమన్వయ సమావేశాన్ని ఎస్పీ మహేష్ బి గీతే, ఇతర అధికారులతో కలిసి నిర్వహించారు. జిల్లాలో నమోదవుతున్న ఎన్.డి.పి.ఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాధక ద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారం వంటి పలు అంశాలను సుదీర్ఘంగా చర్చించారు. పాఠశాలలో పరిసరాల్లో ఉన్న పాన్ షాప్ వంటి వాటి పై నిఘా పెట్టాలని అన్నారు. పాఠశాలలు మరియు కళాశాలలు పునఃప్రారంభం జరిగిన తర్వాత డ్రగ్స్ నియంత్రణ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఎక్కడా కూడా ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా చూడాలని అన్నారు. ప్రతి మండలంలో తహసిల్దార్, ఎంపిడిఓ, పోలీస్, మండల వ్యవసాయ అధికారి వైద్య అధికారులు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి డ్రగ్స్ నియంత్రణ చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి సాగు జరుగుతుందో పరిశీలించి దాని నివారణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ఉన్న బార్, వైన్ షాప్ ప్రభుత్వ నిర్దేశిత సమయపాలన పాటించేలా చూడాలని అన్నారు. జిల్లాలో ఉన్న సినిమా థియేటర్ల పరిసరాలను రాత్రి సమయంలో ఆకస్మికంగా తనిఖీలు చేయాలని, జిల్లాలో ఉన్న రైస్ మిల్లులు, ఇటుక బట్టీల వద్ద అసిస్టెంట్ లేబర్ అధికారి ఆధ్వర్యంలో డ్రగ్స్ నియంత్రణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వీటిలో డ్రగ్స్, గంజాయి వల్ల కలిగే నష్టాలు వివరించే వీడియోలు, పోస్టర్లు ప్రదర్శించాలని,డ్రగ్స్ పరీక్షల నిర్వహణకు అవసరమైన యూరిన్



కిట్లను పోలీసు, ఎక్సైస్ శాఖ అధికారుల వద్ద అవసరమైన మేర అందుబాటులో ఉంచాలని కలెక్టర్ వైద్యారోగశాఖ అధికారికి సూచించారు. కళాశాలలో సడన్ గా వింతగా ప్రవర్తించే విద్యార్థులను గుర్తించాలని, ఎవరైనా డ్రగ్స్ గంజాయి తీసుకుంటున్నట్లు తెలిస్తే వారికి అవసరమైన కౌన్సిలింగ్ అందజేయాలని అన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామాల పై అవగాహన వివరిస్తూనే సమాంతరంగా వాటి నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామ స్థాయి నుంచి డ్రగ్స్, గంజాయి అలవాటు ఉన్నట్లు ఏదైనా అనుమానం కలిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ సెక్షన్ సూపరిండెంట్ ప్రవీణ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జలీ బేగం, అసిస్టెంట్ లేబర్ అధికారి నాజర్ అహ్మద్, డ్రగ్ ఇన్స్పెక్టర్ భవాని, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఫుడ్ సేఫ్టీ అధికారి అనూష, ఎక్సైజ్ విద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లకు మార్కౌట్ భూమి పూజ

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ పట్టణంలో గురువారము ఈవో రజనీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి మార్కౌట్ వేసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరవింద్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందని. అలాగే పేదలకు ఇండ్ల నిర్మాణం సకారమైందని అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇమ్రాన్ ఖాన్, మైనార్టీ అధ్యక్షుడు జావిద్, మొహమ్మద్ యునుస్, కుందార శ్రీనివాస్, సయ్యద్ మజార్ సయ్యద్ రియాజ్ అలీ, విద్యాసాగర్, తేజ బిట్టు, విక్కీ, మేక సతీష్, సన్నీత్ యాదవ్ ,నవీన్ పద్మారావు, గోపు ఉషన్న, సాయన్న, సయ్యద్ రియాజ్ ఉద్దీన్, హరికృష్ణ ,వీడిసి సభ్యులు పాల్గొన్నారు.






# గ్రామ పాలన అధికారి పరీక్షను సజావుగా నిర్వహించాలి

## - కలెక్టర్ సందీప్ కుమార్ ఝు

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

గ్రామ పాలన అధికారి పరీక్షలను సజావుగా నిర్వహించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝు తెలిపారు. గురువారం ఆయన, రాజన్న సిరిసిల్ల జిల్ల కలెక్టరేట్ లో గ్రామ పాలన అధికారి పరీక్షల నిర్వహణ పై ఎస్పీ మహేష్ బి గీతే తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. మే 25 ఆదివారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు జరిగే గ్రామ పాలన అధికారి పరీక్షలకు సిరిసిల్ల జిల్లాలో 65 మంది అభ్యర్థులు హాజరవుతారని, గీత నగర్ లోని ప్రభుత్వ పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ డివిజన్ అధికారి నోడల్ అధికారిగా ఈ పరీక్షలు జరుగుతాయని అన్నారు. పరీక్ష కేంద్రాలకు ఉదయం 8 గంటల వరకు ప్రశ్నాపత్రాలు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని, పరీక్షా కేంద్రాలకు సెల్ ఫోన్, చేతి గడియారాలు అనుమతి లేదని అన్నారు. పరీక్షల ముగిసిన తర్వాత అభ్యర్థుల జవాబు పత్రాలను సీజ్ చేసి ఎస్కార్ట్ తో కన్వీనర్ జేఎన్టీయూ హైద్రాబాద్ కు పంపాలని కలెక్టర్ తెలిపారు. పరీక్ష కేంద్రంలో ప్రతి బెంచ్ కు ఒక అభ్యర్థి ఉండేలా చూడాలని అన్నారు. పరీక్ష కేంద్రాల గేటు ఉదయం 10 గంటలకు మూసివేయడం జరుగుతుందని గేటు మూసివేసిన తర్వాత అభ్యర్థులను లోనికి అనుమతించవద్దని పరీక్షా సమయంలో నిరంతరాయంగా విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఏవో రామ్ రెడ్డి, జిల్లా ఆడిట్ అధికారి శ్రీనివాస్ ప్రిన్సిపల్ శారద ఎం.డి.సెస్ శ్రీనివాస్ రెడ్డి, డిపిఆర్ఓ శ్రీధర్ పాల్గొన్నారు.



# ఎడిటర్ల సంఘానికి నూతన జిల్లా అధ్యక్షునిగా ఎనికైన ఫిరోజ్ ఖాన్

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**



ఆదిలాబాద్ జిల్లా ఎడిటర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు గురువారం జిల్లా కేంద్రంలో గల సాక్షర దినపత్రిక కార్యాలయంలో విజయవంతంగా నిర్వహించారు.ఇందులో సంఘం సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా అధ్యక్షులుగా ఫిరోజ్ ఖాన్,ఉపాధ్యక్షుడు అమృత్, ప్రధాన కార్యదర్శి నరేష్ కుమార్ కోశాధి కారి సత్యనారాయణ, సభ్యులు శ్రీనివాస్ రెడ్డి,బి. సందేశ్, సయ్యద్ కరీం, డివిఆర్ ఆంజనేయులు, సయ్యద్ ఖమర్,రాజు రాథోడ్ లను ఎన్నుకున్నారు.ఎడిటర్ల లక్ష్యాలైన పత్రికా స్వేచ్ఛ, ఎడిటోరియల్ నాణ్యత,సభ్యుల సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి కట్టుబడి ఉంటుందన్నారు.ఎన్నిక ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించబడిందని సంఘం నిర్వాహకులు,గౌరవ అధ్యక్షులు ఎలుగు లింగాన తెలిపారు.కార్యవర్గం సంఘం యొక్క లక్ష్యాలను మరింత బలోపేతం చేయడానికి,పత్రికా రంగంలో నూతన ఒరవడిని సృష్టించడానికి కృషి చేస్తుందని నూతన అధ్యక్షులు ఫిరోజ్ ఖాన్ అన్నారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి ఎన్నికలు నిర్వహించాలి

## - కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి ఎన్నికలు నిర్వహించాలని జిల్లా రెడ్ క్రాస్ కమిటీ చైర్మన్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలు, ఎన్నికల నిర్వహణ, సభ్యత్వాల నమోదు తదితర అంశాలపై రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించగా, కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అందించిన సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు ఇతర అంశాలపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉత్తమ సేవలు సొసైటీ సభ్యులను అభినందించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కమిటీ గడువు 8.5.2025 నాటికి ముగిసిన నేపథ్యంలో నూతన కమిటీ కోసం ఎన్నికలు నిర్వహించాలని తెలిపారు. వేములవాడ లోని ఏరియా హాస్పిటల్ ఆవరణలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు కోసం స్థలం కేటాయించామని తెలిపారు. భవన నిర్మాణానికి నిధులు దాతల నుంచి సేకరించాలని, ఐఆర్సీఎస్ రాష్ట్ర చైర్మన్ గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. అలాగే నూతన సభ్యత్వాలు చేయించాలని పేర్కొన్నారు.సమావేశంలో జిల్లా రెడ్ క్రాస్ సభ్యులు, ఉపాధ్యక్షులు రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రాయకరరావు వేణు కుమార్, ప్రధాన కార్యదర్శి తాటిపాముల శివప్రసాద్. కోశాధికారి బుడిమె శివప్రసాద్, కమిటీ సభ్యులు సంగీతం శ్రీనివాస్, యెల్ల లక్ష్మీనారాయణ, దేవులపల్లి రాజమల్లు, చిదుర నాగ శంకర్, కమటాల రాఘవేందర్ పాల్గొన్నారు.



# భారీ వర్షాలూ శిథిలావస్థ ఇళ్లకు ప్రమాదం సమాచారం ఇవ్వాలి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు శిథిలావస్థలో ఉన్న ఇండ్లకు ప్రమాదం పొంచి ఉందని, వారందరూ అప్రమత్తంగా ఉండి సమాచారం అందించాలని బాల్కొండ మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం పంచాయత్ కార్యదర్శి రజనీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాదము పొంచి ఉన్న ఇండ్ల బాధితులకు పురావాస చర్యలు గైకొంటామని వివరించారు.

# ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్ బ్యూరో**

దళిత మహిళలు, విద్యార్థుల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన ఎం.భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని ప్రధాన సమావేశ మందిరంలో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి అదనపు కలెక్టర్ అంకిత్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేసి జయంతి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, దళితుల అభ్యున్నతికి దళిత మహిళల విద్యార్జన కోసం భాగ్యరెడ్డి వర్మ ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. భాగ్యరెడ్డి వర్మ 1906-1933 మధ్య హైదరాబాదు సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశారని ఆయన సేవలను కొనియాడారు. భాగ్యరెడ్డి వర్మ జయంతిని అధికారికంగా నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. మహనీయులను గౌరవించుకోవడంతో పాటు వారి స్ఫూర్తితో సమాజ హితం కోసం ముందుకు సాగేందుకు ఈ వేడుకలు దోహదపడతాయని అన్నారు. భాగ్యరెడ్డి వర్మ అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారిణి నిర్మల, వివిధ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు, ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

## - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్

**సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో మే 22.**

నిన్న కురిసిన భారీ వర్షం కారణంగా ఖానాపూర్ మార్కెట్‌యార్డ్‌లో తడిసిన ధాన్యాన్ని గురువారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్‌లతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరి రైతులు నష్టపోకుండా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. వర్షంతో ధాన్యం తడవడంతో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని కోరారు. ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధిక తూకం తో కొనుగోళు జరిపితే సంబంధిత నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ధాన్యం శుభ్రపరిచి, ఎండబెట్టే ఏర్పాట్లు చేయాలని, కొనుగోళ్లను వేగవంతం చేసి వెంటవెంటనే మిల్లులకు తరలించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఎంఎల్ఏ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, వర్షాలతో ధాన్యం తడవడం బాధకరమని, కొనుగోళ్లను వేగవంతం చేయాలనీ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం పూర్తిగా రైతుల పక్షాన నిలుస్తుందని తెలిపారు. అధిక తూకాలు వేయడం, తక్కువ ధరలకు కొనుగోలు చేయడం వంటి పరిస్థితులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్కెట్‌యార్డ్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి, తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నాకళ్యాణి, సివిల్ సప్లై డి ఎం సుధాకర్, తహసీల్దార్ సుజాత, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



# కలెక్టరేట్ లో ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు

**సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో మే 22.**

దళిత మహిళలు, విద్యార్థుల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన మహనీయుడు ఎం.భాగ్యరెడ్డి వర్మ 137వ జయంతి వేడుకలను గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం, వర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, దళితుల అభ్యున్నతికి, ముఖ్యంగా దళిత మహిళల విద్యాభివృద్ధికి భాగ్యరెడ్డి వర్మ చేసిన కృషి అపూర్వమన్నారు. ఆయన స్థాపించిన బాలికల పాఠశాలలు, విద్యాసంస్థలు దళితులకు వెలుగుల పతాకంగా నిలిచాయని కొనియాడారు. మహనీయుల జయంతులను అధికారికంగా నిర్వహించడం గర్వకారణమని, వారి ఆశయాల సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. వీటి ద్వారా యువతలో సమాజ సేవా స్ఫూర్తి పెంపొందుతుందని అభిప్రాయపడ్డారు. వర్మ ఆశయాలను నెరవేర్చే దిశగా చొరవ చూపాల అదనపు కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అభివృద్ధి శాఖల అధికారులు రాజేశ్వర్ గౌడ్, శ్రీనివాస్, శంకర్, మోహన్ సింగ్, నరసింహ రెడ్డి, దళిత సంఘాల నాయకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# జూన్ 14,15,వ తెలంగాణ ఉద్యమకారుల మహా చెండి యాగం విజయవంతం చేయండి.!

**తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి.**

**tuf, కళాకారుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు యెల్ల పోశెట్టి.**

**మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు పోతు జ్యోతి రెడ్డి.**

**ఉత్తర తెలంగాణ మహిళా అధ్యక్షురాలు అయిల ప్రసన్న.**

**సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్, వెంగల శ్రీనివాస్.**

**వేములవాడ సమయజ్యోతి**

వేములవాడ నియోజకవర్గ కేంద్రంలో రాష్ట్ర కళాకారుల విభాగం అధ్యక్షులు పోశెట్టి గారి ఆధ్వర్యంలో, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దర్శనం అనంతరం ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా దేవాలయం ప్రాంగణ కేంద్రంలో మహా చండీయాగం పత్రిక వాల్పోస్టర్ విడుదల కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ ఉమ్మడి జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి గారు, మరియు మహిళా అధ్యక్షురాలు పోతు జ్యోతి రెడ్డి, ఉత్తర తెలంగాణ మహిళ, అధ్యక్షురాలు, అయిల ప్రసన్న, హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి మాట్లడుతూ, యెల్ల పోశెట్టి, జ్యోతి రెడ్డి, అయిల ప్రసన్న మాట్లాడుతూ

జూన్ 14,15,వ రోజున తెలంగాణ ఉద్యమకారుల మహా చండియాగం నిర్వహించడం జరుగుతుంది. ఉద్యమకారుల లక్ష్యం సిద్ధించాలని ఉద్యమకారుల కుటుంబాలు ఆయురారోగ్యాలతో, సిరి సంపదలతో విరజిల్లాలని ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు కావాలని ఈ యాగం నిర్వహించడం జరుగుతుంది.మరియు అమ్మ వారి ఆశీస్సులతో ఈ కార్యక్రమం విజయవంతం కావాలని, శ్రీ రాజారాజేశ్వర స్వామి ఆశీర్వాదంతో ఈ కార్యక్రమం మొదలుపెట్టడం జరుగుతుందని, 33 జిల్లాల తెలంగాణ ఉద్యమకారులు అనేక సంఘాల, కుల సంఘాల, ప్రజాసంఘాల నాయకులు ఈ



కార్యక్రమంలో పాల్గొంటారని, తెలంగాణ ప్రజలకు ఉద్యమకారులకు మంచి జరగాలనే ఉద్దేశంతో ఈ బృహత్తరమైన కార్యక్రమానికి మానకొండూరు నియోజకవర్గం, తిమ్మాపూర్ మండలం తపాల నరసింహస్వామి దేవస్థానం వేదిక కావడం మా అదృష్టమని, కనీవినీ ఎరుగని రీతిలో మహా చండీయాగం నిర్వహించడం జరుగుతుంది. ఈ యొక్క కార్యక్రమంలో తెలంగాణ ప్రజలు, ఉద్యమకారులు భాగం కాబోతున్నారని, కావున ఈ యొక్క కార్యక్రమం విజయవంతం కావాలని దేవి దేవతలను మనస్ఫూర్తిగా కోరుకోవడం జరుగుతుంది అని, జూన్ 14, 15వ తేదీల్లో ఈ యొక్క కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుకోవడం జరిగింది.

ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బొజ్జ కనకయ్య, జిల్లా న్యాయ సలహాదారులు నేరెళ్ల తిరుమల గౌడ్,ఉత్తర తెలంగాణ ఉద్యమ కళాకారుల కోఆర్డినేటర్ బొడ్డు రాములు, ఉద్యమ కళాకారుల జిల్లా ఉపాధ్యక్షులు కనపర్తి హనుమయ్య, ప్రధాన కార్యదర్శి మనువాడ లక్ష్మీనారాయణ, జిల్లా సాహితీ సమితి ప్రధాన కార్యదర్శి వెంగళ లక్ష్మణ్ ,నాయకులు దేవునూరి అ%శీ%కుష్, తాటి పెల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సృజనాత్మకత కోసం విద్యార్థులకు కథల పోటీలు

**గంపలగూడెం సమయజ్యోతి**

గంపలగూడెం మండలం పెనుగొలను శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులలో భాగంగా ఈ రోజు విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను వారికి తెలియచేయటం కోసం విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించడమైనది.

గ్రంథాలయం లో ప్రతి రోజు చదువుచున్న కథల పుస్తకాల నుండి వారికి నచ్చిన కథలను చాట్ ల పై రాసి వారి యొక్క ప్రతిభ ను కనపరిచారు. పోటీలలో ప్రథమ బహుమతి కె రీతిక ద్వితీయ బహుమతి డి ఉష కీర్తి తృతీయ బహుమతి కె హేమంత్, డి ఆర్య వర్ధన్ లకు విశ్రాంత ప్రొఫెసర్ శ్రీ రామాల నాగేశ్వరావు చేత విద్యార్థులకు అందచేయూటమైనది. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అందరు క్రమ శిక్షణ తో చదువు కుంటే మంచి ఫలితాలు వస్తాయని ప్రసంగించారు.పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు స్థానిక సాయిబాబా కమిటీ సభ్యులు బహుమతులు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మరియు పాఠకులు గ్రంథాలయ నిర్వాహకురాలు జె. శ్రీలత, శ్రీ వి. వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రంలో 12 ఇంటర్మీడియట్ గురుకులాలు ఏత్తివేయాలనే నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

**ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్**

**కరీంనగర్ సమయజ్యోతి**



ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్ మాట్లాడుతూ రాష్ట్రంలో సాంఘీక సంక్షేమ శాఖ పరిధిలో 12 గురుకుల ఇంటర్మీడియట్ కళాశాలలలు ఏత్తివేయాలనే నిర్ణయం తక్షణమే వెనక్కి తీసుకొవాలని ఆయన డిమాండ్ చేసారు.అదే విధంగా కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి ఎస్సీ బాలికల గురుకుల కూడా తీసేసి జాబితాలో పొందుపరిచారి దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం.పేద మధ్య తరగతి విద్యార్థులుకి చదువులకు దూరం అవుతారు,కరీంనగర్ జిల్లాను విద్య కేంద్రంగా ఉన్నదాన్ని చెడగొట్టే ప్రయత్నం చేయకూడదు.

రాష్ట్రంలో గురుకులాలు ద్వారా పేద వర్గాలకు ప్రధానంగా అణాగారిన విద్యార్థులకు ఇంటర్ విద్య అందుతోంది. నేడు కార్పోరేట్ కళాశాలలు లక్షల రూపాయల ఫీజులు వసూళ్లు చేస్తున్న నేపథ్యంలో ఈ గురుకులాలలో చదువుతున్న విద్యార్థులకు ఆసరాగా ఉన్నాయి. వాటిని ఇప్పుడు ఏత్తివేయడం ద్వారా పేద విద్యార్థులకు చదువు దూరం అవుతుంది.ఈ నిర్ణయం ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోని ఈ గురుకులాలను కోనసాగించాలి. పేద విద్యార్థులకు ఆసరాగా ఉన్న విద్యాసంస్థలను అభివృద్ధి చేసి మరింత మందికి అడ్మిషన్లు ఇచ్చి చదువు అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తోంది. తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని తెలిపారు.

# ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించిన రాష్ట్ర పరిశీలకులు

**సుల్తానాబాద్ పెద్దపల్లి జిల్లా మే-22సమయజ్యోతి**

గర్రెపల్లి జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో జరుగుతున్న జీవశాస్త్రం ఉపాధ్యాయుల ఐదు రోజుల శిక్షణ కార్యక్రమానికి రాష్ట్ర పరిశీలకులు దుర్గాప్రసాద్, జిల్లా సెక్టోరల్ అధికారి కవిత సందర్శించడం జరిగింది.ఈ సందర్భంగా రాష్ట్ర పరిశీలకులు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్నటువంటి అంశాలను విద్యార్థులకు అందజేయాలని విద్యార్థిని విద్యార్థులందరి సామర్థ్యాలను వెలికి తీయాలని ముఖ అభివృద్ధికి ఉపాధ్యాయులందరు కృషి చేయాలని, పాఠశాలలో విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ వి. కవిత, రిసోర్స్ పర్సన్స్ నరేష్, కుమార్, సాధన, ప్రత్యక్ష, తదితరులు పాల్గొన్నారు..



# కొండగట్టు లో పెద్దపెల్లి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

**సుల్తానాబాద్ పెద్దపల్లి జిల్లా మే-22సమయజ్యోతి**

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని జగిత్యాల జిల్లా మల్యాల కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన పెద్దపెల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యే విజయరమణా రావు వేదమంత్రాలతో ఆశీర్వాదించారు.ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, దుగ్యాల సంతోష్ రావు, సుల్తానాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిలుక సతీష్, పోల్సని సునీల్ రావు పెద్దపల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యాల నరేష్ ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..



# పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి మే 22(సమయజ్యోతి ):**

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని మండల విద్యాధికారి శేషగాని శ్రీనివాస్ గౌడ్, గ్రీన్ క్లబ్ ట్రస్ట్ అధ్యక్షులు ముప్పారపు నరేందర్ తెలిపారు. గురువారం అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా గ్రీన్ క్లబ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల నెంబర్ నే0.2 లో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమం లో వారు పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరు సింగల్ యూస్ ప్లాస్టిక్ నివారణ కొరకు కృషి చేయాలన్నారు. స్వచ్ఛమైన గాలి, తినే ఆహారం మానవునికి అతి ముఖ్యమైనవని వాటిని అందించే పర్యావరణానికి మనమందరం వివిధ రకాల వ్యర్థాలతో కాలుష్య పరుస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఇంటి నుండి చేతి సంచి తో బయలుదేరడం, ప్లాస్టిక్ కవర్లను తిరస్కరించడం, మొక్కలను నాటడం తో పాటు వాటి స 0రక్షించడం, నీటిని పొదుపుగా ఉపయోగించడం వంటివి చేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కలిగించుటకు సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంపై డోర్ స్టిక్కర్స్ ను ఆవిష్కరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సింగిల్ ప్లాస్టిక్ లేకుండా ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజనం ఏర్పాట్లు పై గ్రీన్ క్లబ్ ట్రస్ట్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి తోట కిరణ్ సభ్యులు తల్లాడ రామచంద్రయ్య, డాక్టర్ లు శిరీష, అలేఖ్య, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు..





# నూతన వధూవరులను ఆశీర్వదించిన పెద్దమారూర్ గ్రామ మాజీ సర్పంచ్ గోవిందు శ్రీధర్ రెడ్డి

**చిన్నంబావి మండలం సమయజ్యోతి**

చిన్నంబావి మండల పరిధిలోని పెద్ద మారూర్ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ సింగరాజుల బీసన్న అంజలమ్మ ఆహ్వానం మేరకు వారి కుమార్తె సుప్రియ (సౌజన్య) ప్రవీణ్ కుమార్ గారి వివాహ వేడుకలకు వరుడు స్వగృహము నందు ఉండవెల్లి గ్రామం జోగులంబ గద్వాల జిల్లా లో పాల్గొని నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ సర్పంచ్ గోవిందు శ్రీధర్ రెడ్డి గారితో పాటు కొప్పునూరు మాజీ ఉప సర్పంచ్ ఆనంద్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డ బసాపురం సుధాకర్ రెడ్డి, జగ్గారి భగవంతు రెడ్డి, పెద్ద మారుర్ బొల్లెద్దుల నాగశేషులు, కేతపాగ శివ, పగిడాల రామకృష్ణ, మొలకలపల్లి ఎల్లయ్య, మహేశ్వర్ రెడ్డి, తదితరులు బంధుమిత్రులు గ్రామ ప్రజలు నూతన వధువవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించడం జరిగింది.



# సూర్యాపేట వైద్యమాఫియా పై చర్చా వేదిక

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి మే 22(సమయజ్యోతి ):**

సూర్యాపేట పట్టణ కేంద్రంలో వైద్య రంగంలో జీవన చోటు చేసుకున్న పరిణామాలు జరుగుతున్న రచ్చ, వైద్య మాఫియా ఆగడాలు అధికారుల అలసత్వం నేపథ్యంలో జయశంకర్ మానవ వనరుల అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో నేడు సూర్యాపేట పట్టణం లోని తిరుమల గ్రాండ్ కాన్ఫరెన్స్ హాల్లో 'సూర్యాపేట వైద్య రంగానికి ఏం రోగం వచ్చింది' అనే పేరుతో చర్చావేదిక నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలియజేశారు . వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు,ప్రజాసంఘాల, ప్రజాస్వామిక శక్తులు పాల్గొని ఈ అనారోగ్యకరమైన పరిస్థితి నుంచి సూర్యాపేట ను బయటపడేసి ప్రభుత్వ రంగంలో ప్రజా వైద్యం సాధన కొరకు పాటుపడాలని వారు కోరారు. ఈ చర్చ వేదికకు ధర్మార్జున్ సమన్వయకర్తగా వ్యవహరిస్తారని వారు తెలిపారు.

# కాలేశ్వరం పుష్కరాలకు వెళుతూ ఘోర రోడ్డు ప్రమాదం

**- కారు ఆటో ఢీకొని ఇద్దరు మృతి**

**8 మందికి గాయాలు**

**చిట్యాల మే 22 సమయజ్యోతి న్యూస్**

కాలేశ్వరంలో జరుగుతున్న సరస్వతి పుష్కరాలకు వెళుతూ ఆటో కారు ఢీకొని ఇద్దరు మృతిచెందగా 8 మందికి గాయాలయ్యాయి వివరాల్లోకెళ్తే చిట్యాల మండలం కుమ్మరి పల్లె గ్రామానికి చెందిన గుంటుకు సమ్మయ్య కుటుంబానికి చెందిన పదిమంది కుటుంబ సభ్యులు ఆటోలో కాలేశ్వరం వెళ్తుండగా కమలపూర్ క్రాస్ రోడ్ వద్ద హైదరాబాద్ మేడ్చల్ కు చెందిన వారు కాలేశ్వరం వెల్లి వాస్తున్న కారు ఆటోను ఢీకొనగా పాల్వంచ కి చెందిన పాల రజిత, కుమ్మరి పల్లి కి చెందిన శ్రీరాముల విష్ణు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా రజిత కుమారులు పాల విశ్రుత్, మొక్ష గుంటుకు నరసింహరాములు, భార్య సంధ్య, కూతురు షన్విత, శ్రీరాముల శోభ, శ్రీరాముల వివన్, గుంటుకు మన్నెమ్మ, ఎనిమిది మందికి గాయాలయ్యాయి క్షతగాత్రులను భూపాలపల్లి 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం 108 లో తరలించారు అందులో గుంటుకు నరసింహారాములు పాల విశ్రు త్ లను మెరుగైన వైద్యం కోసం హన్మకొండలోని గార్డెన్ ఆస్పత్రికి తరలించారు సంఘటనపై కాటరం సిఐ నాగార్జున రావు అధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని పంచనామా నిర్వహించి శవాలకు పోస్టుమార్టం నిర్వహించి శవాలను బంధువులకు అప్పగించారు



## మానవ మనుగడకు సవాల్‌గా

# పర్యావరణ విధ్వంసం

### కర్బన ఉద్గారాలతో దెబ్బతింటున్న ప్రకృతి-పరిస్థితి ఇలాగే సాగితే మనావ జాతికి ముప్పు

**న్యూఢిల్లీ,మే22(సమయజ్యోతి):** వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల వల్ల భూమ్మీద నివసిస్తున్న కోట్లాది జీవుల మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. పెరుగుతున్న కాలుష్యం, జనాభా పెరుగుదల, రెట్టింపవుతున్న భూతాపం, సహజ వనరుల క్షీణత, వేగంగా విస్తరిస్తున్న ఎడారీకరణ, విచ్ఛిన్నమవుతున్న ఓజోన్ పొర వంటి పర్యావరణ విపత్తుల వల్ల కోట్లాది జీవులు తమ మనుగడను కోల్పోయే దుస్థితిని ఎదుర్కొంటున్నాయి. 1972లో స్టాక్‌హోంలో జరిగిన అంతర్జాతీయ పర్యావరణ సదస్సు 'వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల వల్ల భూమ్మీద నివసిస్తున్న కోట్లాది జీవుల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని, ఆందోళన వ్యక్తం చేసింది. పారిశ్రామిక యుగం ప్రారంభమైన అనంతరం వాతావరణంలోకి విడుదలవుతున్న కర్బన ఉద్గారాల వల్ల భూతాపం పెరగటం వల్ల విలువైన జీవవైవిధ్యం ధ్వంసమైపోతుందని తెలిపింది. ఈ విధ్వంసాన్ని అరికట్టకపోతే రానున్న రోజుల్లో మానవాళి కూడా అనేక విపరిణామాను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆ సదస్సు హెచ్చరించింది. ఐక్యరాజ్యసమితి ఒత్తిడి మేరకు 1997లో జపాన్‌లోని క్యోటోలో జరిగిన వాతావరణ సదస్సులో జీవరాశి మనుగడకు ప్రమాదంగా మారిన భూతాపానికి కారణమైన కర్బన్ ఉద్గారాలను కట్టడి చేయాలని, తద్వారా 1990 నాటి ఉష్ణోగ్రతల కన్నా 2 శాతం మించకుండా అన్ని ప్రపంచ దేశాలు చర్యలు తీసుకోవాలని తీర్మానించింది. ప్రపంచవ్యాప్తంగా ఏటా పెరుగుతున్న భూఉష్ణోగ్రతల వల్ల కోట్లాది జీవుల మనుగడ ప్రమాదంలో పడింది. పెరుగుతున్న భూతాపం వల్ల ప్రతి సంవత్సరం 27వేలకు పైగా జీవజాతులు అంతరించిపోతున్నాయి. ఇదే పరిస్థితులు ఇలాగే కొనసాగితే రానున్న 30 సంవత్సరాలలో 20 శాతం జీవజాతులు పూర్తిగా అంతరించిపోతాయని జీవవైవిధ్య పితామహుడుగా పేరుగాంచిన ప్రఖ్యాత జీవశాస్త్రవేత్త, ఎడ్వర్డ్.ఒ.విల్సన్ హెచ్చరించారు. అధికమవుతున్న భూతాపం ప్రభావం వల్ల ప్రపంచ వ్యాప్తంగా 24 శాతం క్షీరద జాతులు, 12 శాతం పక్షిజాతులు అంతరిచిపోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. ఇప్పటికే 75 శాతం జన్యుపంటలు అంతరించిపోయాయి. రానున్న 20 సంవత్సరాలలో భూమ్మీద నివసిస్తున్న 620 రకాల వానర జాతులలో 120పైగా వానర జాతులు అంతరించిపోతాయంటున్న జీవశాస్త్రవేత్తలు, ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభమయ్యిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉష్ణోగ్రతలతోపాటు వేగంగా తరిగిపోతున్న అటవీ వనరులు కూడా జీవరాశి మనుగడపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తుంది. భూమండలం మీద 90 శాతం జీవవైవిధ్యానికి ఆవాసాలుగా అలరారుతున్న సమశీతోష్ణ మండలాలలోని సతత హరితారణ్యాలు పెద్దయెత్తున నరికివేతకు గురికావటం వల్ల ఏటా 27 వేల జీవజాతులు తమ ఉనికిని కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. ఈ అడవులు ఏటా 2 బిలియన్ టన్నుల కర్బన్ డై యాక్సైడ్‌ను శోషించుకుని భూతాపాన్ని తగ్గించడంలో తమ వంతు పాత్రను పోషిస్తున్నాయి. గడిచిన ఒక్క దశాబ్దంలోనే సుమారు 12 లక్షల హెక్టార్ల అడవులు నరికివేతకు గురయ్యాయని అంచనా. ఇప్పటికే సృష్టిలోనే అత్యంత అరుదైన జీవజాతులకు రక్షణ కేంద్రాలైన పగడపు దిబ్బలు 75 శాతం పైగా ధ్వంసమైపోయాయి. ఉష్ణోగ్రతలు ఇదే స్థాయిలో పెరుగుతూపోతే అతి తక్కువ కాలంలోనే పగడపు దీవులు భూమ్మీద నుండి శాశ్వతంగా అదృశ్యమైపోయే అవకాశముంది.ప్రపంచ జీవవైవిధ్యంలో 8? వాటాను కలిగిన భారతదేశం అత్యంత జీవవైవిధ్యం కలిగిన దేశాల జాబితాలో 7వ స్థానంలో ఉంది. ప్రపంచంలోనే అరుదైన జీవవైవిధ్యాన్ని కలిగిన ఆస్ట్రేలియా మొదటిస్థానంలో ఉంటే, బ్రెజిల్ రెండవ స్థానంలో ఉంది. ప్రపంచ దేశాలు అవలంబిస్తున్న పర్యావరణ వ్యతిరేక విధానాల వల్ల భూమ్మీద సమస్త జీవరాశుల మనుగడ సంక్షోభంలో చిక్కుకుంది. పరిమితమైన వనరులను వినియోగించుకుని, అపరిమితమైన ఆర్థికవృద్ధిని సాధించే దిశగా పారిశ్రామిన దేశాల ఆలోచన చేయాల్సిన సమయమిది. అప్పుడు మాత్రమే సహజవనరులపై ఒత్తిడి తగ్గి తిరిగి అవి పునర్జీవించే అవకాశముంటుంది. పెద్దయెత్తున కోల్పోయిన జీవావరణాన్ని తిరిగి పునరుద్ధరించగలిగితేనే కోల్పోయిన జీవవైవిధ్యాన్ని కూడా తిరిగి రక్షించుకోగలుగుతాం. దురదృష్టకరమైన అంశమేమిటంటే, ఇంతటి పర్యావరణ సంక్షోభంలో కూడా పారిశ్రామిక దేశాలు తమ వైఖరికి మార్చుకోకపోగా, మరింత అహంకారపూరితంగా వ్యవహరిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణం ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి వల్ల కలుగుతున్న అనర్థాలు కళ్ల ముందు కనబడుతున్న ఈ దశలో వాటికి పరిష్కార మార్గాలను అన్వేషించి పర్యావరణ రక్షణకు సిద్ధం కాకపోతే కోట్లాది జీవులకు అమ్మగా భావించే భూమాత మరుభూమిగా మారిపోతుందనటంలో ఎటువంటి సందేహం లేదు. అదే జరిగితే మనిషి తన మరణ శాసనం తాను రాసుకున్నట్టే. గోవు ద్వారా అనేక పర్యావరణ సేవలు, ఆరోగ్య ప్రయోజనాలు పొందటమేకాక గ్రామీణ ప్రజల ఆర్థికవృద్ధికి కూడా ఆవు ఎంతో తోడ్పడుతోంది. ఆవు పేడను ముఖ్యంగా పొడి రూపంలో చల్లితే ఖర్జూర పంట దిగుబడిని గణనీయంగా పెంచుతుందని పరిశోధనల ద్వారా తెలియవచ్చింది. అందుకనే గల్ఫ్ దేశాలు.. సౌదీ అరేబియాతోపాటు, కువైట్, యూఏఈ మొదలైన దేశాలు భారతీయ ఆవు పేడను ప్రధానంగా దిగుమతి చేసుకుంటున్నాయి. ఉదాహరణకు 2023?-24 ఆర్థిక సంవత్సరంలో భారతదేశం దాదాపు రూ. 400 కోట్ల విలువైన ఆవు పేడ, సంబంధిత ఉత్పత్తులను ఎగుమతి చేసింది. రూ.125 కోట్ల విలువైన ఆవుపేడ, రూ.173.57 కోట్ల విలువైన ఎరువులను, రూ.88.02 కోట్ల విలువైన కంపోస్ట్ ఎరువులను భారత్? ఎగుమతి చేసింది. ఈ ఎగుమతుల పెరుగుదల భారతదేశ వ్యవసాయ ఎగుమతులను బలోపేతం చేయడమే కాకుండా కొత్త ఆదాయ మార్గాలను సృష్టిస్తున్నాయి. సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేస్తున్నాయి.

# ధాన్యం రైతుల దైన్యం

### రోజులతరబడి పడిగాపులతో నష్టం - అకాల వర్షంతో తడిసి ముద్దవుతున్న ధాన్యం రాసులు

### సకాలంలో కొనుగోలు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం

**నిజామాబాద్,మే22(సమయజ్యోతి):** జిల్లాల్లో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కొనుగోలు కేంద్రాలకు వడ్లు తీసుకువచ్చి రోజులు, వారాల తరబడిగా పడిగాపులుగాస్తున్నా హమాలీలు లేక తూకం వేయడం లేదు. కొన్నిచోట్ల తూకం వేసినా లారీలు రాక వడ్లు రైస్ మిల్లులకు తరలించలేకపోతున్నారు. ఉత్తర తెలంగాణలోని ఆదాలాబాద్, కరీంనగర్, నిజామాబాద్‌లతో పాటు మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఈ తరుణంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో వడ్లు తడిసి మొలకలు వస్తున్నాయి. పలుచోట్ల రోడ్లమీద ఆరబోసిన వడ్లు వరదకు కొట్టుకుపోయి రైతులకు నష్టం వాటిళుతోంది. యాసంగిలో రైతుల నుంచి మొత్తం ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు పీఏసీఎస్, ఐకేపీ, మార్కెటింగ్, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఆధ్వర్యంలోకొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.కాగా అనేక చోట్ల ధాన్యం కొనుగోలులో జాప్యం జరుగుతోంది. వరిసాగు చేసిన రైతులందరూ హార్వెస్టర్లతో పంట కోసి వడ్లను కేంద్రాల వద్దకు తీసుకువస్తున్నారు. కానీ హమాలీల కొరత వల్ల వడ్లు తూకం వేయలేక పోతున్నారు. స్థానిక కూలీలు ముందుకు రాకపోతుండగా బీహార్ కూలీలు వస్తేగాని వడ్లు కాంటా పెట్టలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు సరిపడినన్ని లారీలు రాకపోవడంతో కాంటా పెట్టిన వడ్ల సంచులను రైస్ మిల్లులకు తరలించడంలో జాప్యం జరుగుతోంది. ఈ క్రమంలో తరచు వర్షాలు కురుస్తుండడంతో కొనుగోలు కేంద్రాలు జలమయమవుతున్నాయి. వడ్లు తడిసి ముద్దవుతున్నాయి. కాంటాపెట్టి బస్తాల్లో నింపి రైస్? మిల్లులకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు నానిపోతున్నాయి. కొన్నిచోట్ల మూడు, నాలుగు రోజులుగా వర్షం కురుస్తుండడంతో వడ్లు ఎండక మొలకలు వచ్చాయి. బుధవారం కురిసిన వర్షానికి పలు ప్రాంతఆల్లో రోడ్లమీద ఆరబోసిన వడ్లు వరదలో కొట్టుకుపోయాయి. ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ ఉమ్మడి మెదక్ జిల్లాలో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేశారు. కేంద్రాల నిర్వాహకులు, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రాలకు వడ్లు తీసుకువచ్చి చాలా రోజులవుతున్నా కాంటా పెట్టడం లేదని, అకాల వర్షాలకు వడ్లు తడిసి మొలకలు వస్తున్నా పట్టనట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అకాల వర్షం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతన్నను అతలాకుతలం చేసింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం దంచికొట్టింది. ఫలితంగా ధాన్యం కొనుగోలు సెంటర్ల వద్ద ఆరబెట్టిన, బస్తాల్లో నింపిన వడ్లు తడిసి ముద్దయ్యాయి. నిర్మల్ జిల్లా కేంద్రంతోపాటు కుంటాల, ఖానాపూర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. తడిసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతో పాటు బేల, జైనథ్, తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల్లో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. బేల మండల కేంద్రంలోని మార్కెట్? యార్డులో ఉన్న జొన్నలు తడిసిపోయాయి. దండేపల్లి మండలంలో భారీ వర్షం కురిసింది. బుధవారం సాయంత్రం ఐదు గంటల తర్వాత భారీ వర్షం కురిసింది. దీంతో కల్లాల్లో ఉన్న వరి కుప్పల్లోకి నీరు చేరింది. కుప్పలపై ప్లాస్టిక్ కవర్స్ కప్పినా వరద కుప్పల్లోకి చేరింది. ధాన్యం కొనుగోళ్లు ఆలస్యమవడంతోనే సెంటర్ల వద్ద ఉన్న వడ్లు తడిసిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సరైన ఏర్పాట్లు చేయయకపోవడంతో అకాల వర్షానికి వరి ధాన్యం తడిసి ముద్దయిందని ఆరోపిస్తున్నారు. లారీల కొరత కారణంగా తూకం వేసిన బస్తాలను రైస్ మిల్లులకు చేర్చకుండా కేంద్రాల్లోనే ఉంచడంతో అవి తడిసిపోయాయి. ఈదురు గాలులకు జన్నారం మండలంలో మండలంలోని తపాలపూర్ లో పలువురి ఇండ్ల రేకులు లేచిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోయి కరెంట్ సరఫరలో అంతరాయం ఏర్పాడింది. సిర్పూర్ టీ లోని సీడం రుకుంబాయి అనే మహిళ ఇంట్లోకి వరద చేసి వస్తువులు తడిసిపోయాయి. దహెగాం మండలంలో గాలివానకు కల్లాల్లోని వడ్లకుప్పలపై కప్పిన కవర్లు కొట్టుకుపోయి వడ్లు తడిసిపోయాయి. వనపర్తి జిల్లాలో రైతులు అరిగోస పడుతున్నారు. దాదాపు 15 రోజులుగా సెంటర్లకు తీసుకొచ్చిన వడ్లను కాంటా చేయకపోవడంతో రైతులు ఆందోళనకు దిగుతున్నారు. ప్రధానంగా లారీల ఏజెన్సీలు సరిపడా వాహనాలను సమకూర్చకపోవడం, హమాలీల సమస్య తీవ్రంగా ఉండటంతో కొనుగోళ్లు ఆలస్యమవుతున్నాయి. దాదాపు 15 రోజులుగా జిల్లాలోని గోపాల్‌పేట, రేవల్లి, పాన్‌గల్, వీపనగండ్ల, మదనాపురం మండలాల్లోని కొన్ని సెంటర్ల వద్ద కొనుగోళ్లు లేట్?అవుతున్నాయి. వడ్ల లోడ్?తో వెళ్తున్న లారీలు రోజులు తరబడి తిరిగి రాకపోవడంతో సెంటర్ల నిర్వాహకులు కాంటాలు వేయడం లేదు. నాలుగు రోజులుగా ఆయా సెంటర్ల పరిధిలో రైతులు వడ్లను కొనుగోలు చేయాలని ధర్నాలకు దిగారు. విషయం తెలుసుకున్న అడిషనల్ కలెక్టర్ ఆయా ప్రాంతాల్లోని సెంటర్లను పరిశీలించారు. కొనుగోళ్ల అంశంపై ఇటీవల మంత్రి జూపల్లి కృష్ణారావుఅధికారులతో సమీక్ష నిర్వహించారు. వడ్ల కొనుగోళ్లు ఆలస్యంపై సమీక్షలో ఆరా తీశారు. సెంటర్ల వద్దకు లారీలు ఎందుకు టైంకు రావడం లేదని ప్రశ్నించారు. వెంటనే లారీల ఏజెన్సీలతో మాట్లాడాలని, కలెక్టరేట్?కు లారీలను తీసుకొచ్చి ప్రదర్శించాలని ఆదేశాలు జారీ చేశారు.

## కాళేశ్వరం కమిషన్ వ్యవహారం

### మరోమారు కెసిఆర్‌తో

### హరీష్ మంతనాలు

**గజ్వేల్,మే22(సమయజ్యోతి):** కాళేశ్వరం కమిషన్ నోటీసులపై మామ-అల్లుడు సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. కెసిఆర్‌తో ఫామ్‌హౌజ్‌లో భేటీ అయిన హరీష్ రావు సుదీర్ఘ చర్చలు జరిపారు. నోటీసులకు ఎలా స్పందించాలన్న అంశంపై ఇరువురు మంతనాలు జరిపారని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే, కమిషన్ ముందు కేసీఆర్, హరీష్‌రావులు విచారణకు హాజరవుతారా? లేదా ఆరోగ్యం సరిగా లేదు.. రాలేమని తప్పించుకుంటారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కమిషన్ ముందు హాజరు కావాలని, నిజాయితీ నిరూపించుకోవాలని మంత్రులు , కాంగ్రెస్ నేతలు డిమాండ చేస్తున్నారు. జూన్ 5న కెసిఆర్ హాజరు కావాల్సి ఉంది. కాళేశ్వరం నిర్మాణం వ్యవహారంలో నిజాలను నిగ్గు తేల్చాలని కాంగ్రెస్ ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ అధ్యక్షతన కమిషన్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. విచారణలో భాగంగా బ్యారేజీ నిర్మాణంలో పనిచేసిన రాష్ట్ర స్థాయి అధికారులందరినీ కమిషన్ విచారించింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కాళేశ్వరం అవినీతి వ్యవహారంలో కమిషన్ నోటీసులు పంపింది. జూన్ 5వ తేది లోపు కమిషన్ ఎదుట హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొంది. కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రులు హరీష్ రావు, ఈటల రాజేందర్‌కు కూడా కాళేశ్వరం కమిషన్ నోటీసులు పంపింది. ఈ నేపథ్యంలోనే కేసీఆర్‌తో ఎర్రవల్లి ఫాం హౌస్‌లో హరీష్‌రావు భేటీ అయ్యారని అంటున్నారు.

## పాక్ నిఘా కార్యకర్తలతో సంభాషణ

### ఉగ్రవాదులతో లింక్ మాత్రం లేదు

### యూట్యూబర్ జ్యోతి కేసులో పోలీసుల విశ్లేషణ

**న్యూఢిల్లీ,మే22(సమయజ్యోతి):** యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాకు ఉపశమనం లభిస్తోంది. పాకిస్తాన్ నిఘా కార్యకర్తలతో జ్యోతి సంప్రదింపులు జరిపిందని, అయితే, ఉగ్రవాదంతో ఆమెకు ఎటువంటి సంబంధాలు లేవని పోలీసులు తేల్చారు. జ్యోతి మల్హోత్రా పాకిస్తాన్ నిఘా కార్యకర్తలతో తెలిసి సంభాషించినప్పటికీ, ఆమెకు ఉగ్రవాద కార్యకలాపాలు లేదా గ్రూపులతో సంబంధం ఉందని ఎటువంటి ఆధారాలు లేవని పోలీసులు స్పష్టం చేశారు. అంతేకాకుండా, సాయుధ దళాల గురించి లేదా వారి ప్రణాళికల గురించి మల్హోత్రాకు ఎటువంటి అవగాహన లేదని హిసార్ పోలీసు సూపరింటెండెంట్ తెలిపారు. ఆమె కాంటాక్ట్‌లలో కొందరు పాకిస్తానీ నిఘా కార్యకర్తలని తెలిసినప్పటికీ, ఆమె వారితో టచ్‌లో ఉందని ఆయన అన్నారు.'ఇప్పటివరకు, ఆమె ఏదైనా ఉగ్రవాద కార్యకలాపాలలో పాల్గొన్నట్లు లేదా ఏదైనా ఉగ్రవాద సంస్థతో ఆమె అనుబంధానికి సంబంధించిన ఆధారాలు మాకు దొరకలేదు. ఆమె ఏదైనా ఖఎక్షలను వివాహం చేసుకోవా లనుకుంటున్నట్లు లేదా మతం మార్చుకోవాలనుకుంటున్నట్లు చిత్రీకరించే ఏ పత్రాన్ని మేము కనుగొనలేదు' అని ఎస్పీ చెప్పారు. మల్హోత్రాకి చెందిన మూడు మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లు, వీటితోపాటు, మే 18న అరెస్టయిన వీసా ఏజెంట్ హర్కిరత్ సింగ్‌కు చెందిన రెండు మొబైల్ ఫోన్‌లను విశ్లేషణ కోసం ల్యాబ్స్‌కు పంపినట్లు ఎస్పీ వెల్లడించారు. 'జ్యోతి మల్హోత్రా ఐదురోజుల రిమాండ్‌లో ఆమెను కొన్ని కేంద్ర సంస్థలు విచారించాయి, కానీ ఆమె కస్టడీని మరే ఇతర ఏజెన్సీకి ఇవ్వలేదు. పబ్లిక్ డొమైన్‌లో వస్తున్నట్టు ఆమె 'డైరీ'లోని పేజీలు మా దగ్గర లేవు. తమ దగ్గర ఎటువంటి డైరీ లేదు,' అని ఎస్పీ స్పష్టం చేశారు. ఇలా ఉండగా, 33 ఏళ్ల ట్రావెల్ బ్లాగర్ అయిన జ్యోతి మల్హోత్రాను మే 16న పాకిస్తాన్ కార్యకర్తలతో సున్నితమైన సమాచారాన్ని పంచుకున్నారనే ఆరోపణలతో అరెస్టు చేశారు. ఆమెపై అధికారిక రహస్యాల చట్టం, 1923లోని సెక్షన్లు 3,5 ఇంకా భారతీయ న్యాయ సంహిత చట్టంలోని సెక్షన్ 152 కింద కేసు నమోదు చేశారు. రిమాండ్ కాలంలో ఆమెను, జాతీయ దర్యాప్తు సంస్థ ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులు ప్రశ్నించారు.

## ఆపరేషన్ సిందూర్ వేళ పాకు దుస్సాహసం

### ఉగ్రమూకలను భారత్‌లోకి జొప్పించే యత్నం

### తిప్పికొట్టిన సరిహద్దు బద్రతా దళం

**న్యూఢిల్లీ,మే22(సమయజ్యోతి):** ఆపరేషన్ సిందూర్ జోరుగా జరుగుతున్న వేళ పెద్ద సంఖ్యలో ఉగ్రమూకను భారత్‌లోకి పంపేందుకు పాక్ యత్నించింది. సరిహద్దు వెంబడి భారత్‌లోకి జొప్పించే ప్రయత్నం చేయగా భద్రతా బలగాలు తిప్పికొట్టాయి. దీంతో ఉగ్రమూకలు భారత్‌లోకి రాకుండా అడ్డుకట్ట పడింది. ఈ విషయాన్ని బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ ధ్రువీకరించింది. మే 8వ తేదీన 45-50 మంది ఉగ్రవాదులను సరిహద్దులు దాటించి భారత్‌లోకి పంపించేందుకు పాక్ దళాలు తీవ్రంగా యత్నించాయి. ఇందుకోసం భారీగా షెల్లింగ్ కూడా చేపట్టినట్లు పేర్కొన్నాయి. బీఎస్ఎఫ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎస్ఎస్ మండ్ ఓ ఆంగ్ల వార్తా సంస్థతో మాట్లాడుతూ.. 'మా జవాన్లు వారికి తీవ్ర స్థాయిలో నష్టం కలిగించారు. పెద్ద ఎత్తున ఉగ్రవాదులు సరిహద్దులు దాటేందుకు వస్తున్నట్లు మా వద్ద ముందే సమాచారం ఉంది. వారి కోసం కాచుకు కూర్చొని.. గుర్తించగానే దాడులు నిర్వహించాము. ఆ గ్రూపులో దాదాపు 45-50 మంది వరకు ఉన్నారు. వారు మా వైపునకు వచ్చారు. దీంతో అదును చూసి వారిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాము. మేము ఊహించినట్లే తమ పోస్టుల నుంచి వారు భారీ స్థాయిలో కాల్పులు మొదలుపెట్టారు. ఈ క్రమంలో మేము అత్యంత కచ్చితత్వంతో కాల్పులు జరిపాము. దీంతో వారు తమ పోస్టులను వదిలేసి పలాయనం చిత్తగించారు. దాదాపు గంటన్నరలోనే వారికి మేము బుద్ధి చెప్పాము. వారి బంకర్లు, ఆయుధాలను ధ్వంసం చేశాము. వారు మరోసారి వస్తే పదింతల శక్తితో తిప్పికొట్టేందుకు మా జవాన్లు సిద్ధంగా ఉన్నారు. ఇందుకు సంబంధించి బీఎస్ఎఫ్‌కు స్పష్టమైన ఆదేశాలున్నాయి. బీఎస్ఎఫ్‌లోని మహిళా జవాన్లు కూడా పురుషులతో సమానంగా శత్రువులపై పోరాడే బాధ్యతలను నిర్వహించారు. వారిని చూస్తే మాకు గర్వంగా ఉంది' అని డీఐజీ వెల్లడించారు. బుధవారం పూంచ్‌లోని బ్రిగేడ్ హెడ్‌క్వార్టర్‌ను జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్మీ, బీఎస్ఎఫ్ సిబ్బందితో ఆయన భేటీ అయ్యారు. ఆపరేషన్ సిందూర్ వేళ జమ్మూకశ్మీర్‌లోని సాంబ జిల్లాలో సరిహద్దు దాటి చొరబడేందుకు పాక్ ఉగ్రవాదులు చేసిన ప్రయత్నాలను బీఎస్ఎఫ్ తిప్పికొట్టింది. మే 8వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో సాంబ జిల్లాలోని అంతర్జాతీయ సరిహద్దుల వద్ద ఈ పరిణామాలు చోటుచేసుకొన్నట్లు బీఎస్ఎఫ్ ఎక్స్ పోస్టులో వెల్లడించింది. కనీసం ఏడుగురు ఉగ్రవాదులు మృతి చెందినట్లు బీఎస్ఎఫ్ వర్గాలు వెల్లడించాయి.

## పుష్కరాలకు వెళుతుండగా ప్రమాదం

### కారు ఆటో ఢీకొని ఇద్దరు మృతి

**కాళేశ్వరం,మ022(సమయజ్యోతి):** జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సరస్వతి పుష్కరాలకు కాళేశ్వరం వెళ్తుండగా కాటారం టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారిపై కారు, ఆటో ఢీకొన్నాయి. గురువారం జరిగిన ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటనలో మరో ఆరుగురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. అయితే, గాయపడిన వారిలో వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో మరణించిన వారిని చిట్యాల మండలంలోని నైన్‌పాక వాసులుగా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు చెప్పారు.

## కొండగట్టుకు పోటెత్తిన భక్తులు

**జగిత్యాల,మే22(సమయజ్యోతి):** హనుమాన్ జయంతి సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు కు భక్తులు భారీగా తరలివచ్చారు. అంజన్నను దర్శించుకునేందుకు వర్షంలోనూ కాలినడకన చేరుకున్నారు. ఆంజనేయస్వామి మాలధారులు దీక్షా విరమణ చేపట్టారు. స్వామి వారిని దర్శించుకునేందుకు క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. తెల్లవారుజామున కొండగట్టులో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ పరిశీలించారు. క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. క్యూలైన్లను కలెక్టర్ పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు.

## అభివృద్ధిలో భాగమే రైల్వేల ఆధునీకరణ

### వరంగల్ స్టేషన్ ప్రారంభోత్సవంలో

### డికె అరుణ

**వరంగల్,మే22(సమయజ్యోతి):** అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా గురువారం వరంగల్ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేంద్రమంత్రి భూపతి శ్రీనివాస వర్మ, ఎంపీ డీకే అరుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద అభివృద్ధి చేసిన 103 రైల్వే స్టేషన్లలో వరంగల్, బేగంపేట్, కరీంనగర్ స్టేషన్లను ప్రారంభించడం గర్వకారణమ్నారు. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన అభివృద్ధి శ్రేణిలో భాగమే అని ఆమె తెలిపారు. రైల్వే స్టేషన్లను అత్యాధునిక సదుపాయాలతో పునఃనిర్మాణం చేసి, సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్న ప్రధాని నరేంద్ర మోడీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 2014 నుంచి వరంగల్ ప్రాంతంలో అనేక అభివృద్ధి పనులను చేపట్టి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, ఇదంతా మోడీ నిష్పక్షపాత పరిపాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. విద్య, వైద్యం, రోడ్లు, రైల్వే రంగాల్లో కేంద్రం నిధులు కేటాయిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నదని, ఇది మతపరమైన లేదా ప్రాంతీయ వివక్ష లేకుండా దేశంలోని ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్న ప్రధాని దృఢ సంకల్పానికి నిదర్శనమని ఆమె అన్నారు.

## ఫెమా నిబంధనలకు విరుద్ధంగా భూమి కొనుగోలు

**ఎమ్మెల్యే యశస్విని అత్త ఝాన్సీరెడ్డికి హైకోర్టు నోటీసులు**

హైదరాబాద్,మే22(సమయజ్యోతి):

పాలకుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అత్త ఝాన్సీ రెడ్డికి హైకోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఝాన్సీరెడ్డితో పాటు ఆమె భర్త రాజేందర్ రెడ్డికి కూడా నోటీసులు జారీ చేసింది. ఝాన్సీ రెడ్డి 2017లో తొర్రూరు మండలం గుర్తూరు గ్రామంలో 75 ఎకరాల భూమిని కొన్నారు. ఫెమా నిబంధనలను ఉల్లంఘించి భూమి కొనుగోలు చేసిందని దామోదర్ రెడ్డి అనే వ్యక్తి కోర్టును ఆశ్రయించాడు. నిబంధనలకు విరుద్ధంగా ఝాన్సీ రెడ్డికి పాస్ బుక్ మంజూరు చేశారని రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రటరీ, సీసీఎల్ఏ కమిషనర్, జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహశీల్దార్లకు సైతం హైకోర్టు నోటీసులు జారీ చేసింది. భూమి విషయంలో విచారణ పూర్తి చేసి నివేదికను అందించాలని ఈడీ జాయింట్ డైరెక్టర్ కు నోటీసులు జారీ చేసింది హైకోర్టు. ప్రస్తుతం ఆమె పాలకుర్తి కాంగ్రెస్ ఇంఛార్జ్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తి నుంచి పోటీ చేయాలని ఝాన్సీ రెడ్డి భావించారు. అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును ఓడించేందుకు కాంగ్రెస్ ఝాన్సీ రెడ్డిని రంగంలోకి దించేందుకు ప్లాన్ చేసింది. అయితే చివరి నిమిషంలో ఝాన్సీ భారత పౌరసత్వంపై వివాదం చెలరేగింది. ఆమె ఎన్ఆర్ఐ పౌరసత్వం కారణంగా సమస్యలు వస్తాయని భావించి కోడలు యశస్వినీ రెడ్డిని బరిలోకి దింపారు. ఎర్రబెల్లిపై ఆమె విజయం సాధించారు. ఇక చాలా ఏళ్ల క్రితమే అమెరికా వెళ్లిన ఝాన్సీ రెడ్డి అక్కడ ఉమెన్ ఎంపవర్‌మెంట్ తెలుగు అసోసియేషన్ (వేటా) ఫౌండర్, ఫౌండర్ ప్రెసిడెంట్, అడ్వయిజరీ చైర్‌గా వ్యవహరించారు. ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారాలతో పాటు పలు బిజినెస్‌లు చేశారు. అనంతరం తెలంగాణ పాలిటిక్స్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. ఎన్నికలకు చాలా కాలం క్రితమే స్వస్థలం పాలకుర్తికి వచ్చిన ఆమె.. పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

# తడిసిన ధాన్యంతో రైతుల ఆందోళన

## సకాలంలో కొనుగోలు చేయకపోవడం ఆగ్రహం

## ఆర్మూర్‌లో మొలకెత్తిన ధాన్యంతో రోడ్డుపై ధర్నా

నిజామాబాద్,మే22(సమయజ్యోతి):

తడిసిన ధాన్యంతో పాటు, కాంటాలకు తీసుకుని వచ్చిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణ కేంద్రంలో గల కెనాల్ బ్రిడ్జి వద్ద మండల రైతులు గురువారం మహాధర్నా నిర్వహించారు. అకాల వర్షం వల్ల వరి ధాన్యంలో మొలకలు మొలిచిన ధాన్యాన్ని తీసుకువచ్చి రోడ్డుపై బైఠాయించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన వరి పంటను కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో ధీమాగా ఉన్నామని అన్నారు. అయితే రైతులు పంటను అరబెట్టి కల్లాల వద్ద రాత్రింబవళ్లు కావలి ఉండి ధాన్యాన్ని సంచుల్లో నింపి ఎదురు చూస్తున్నామని అన్నారు. సంచులు హమాలీలా కొరత వల్ల కుప్పలు పోసి లారీల కొరకు ఎదురు చూస్తున్న వేళ అకాల వర్షంతో రైతులను ఆగమాగం చేశాయని అన్నారు. ప్రభుత్వం సొసైటీ మెప్మా మహిళా సంఘం, మార్కెటింగ్ ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద వర్షాల వల్ల తడిసిన వరి ధాన్యం వెంటనే కొనాలని అన్నారు. మొలకలు మొలిచిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఆర్మూర్ పట్టణ కేంద్రంలో గల కెనాల్ బ్రిడ్జి వద్ద మండల రైతులు గురువారం మహాధర్నా నిర్వహించారు. అకాల వర్షం వల్ల వరి ధాన్యంలో మొలకలు మొలిచిన ధాన్యాన్ని తీసుకువచ్చి రోడ్డుపై బైఠాయించారు. కలెక్టర్ మార్కెట్ కమిటీ అధికారులు వచ్చే వరకు రోడ్డుపై ధర్నా చేస్తామని రైతులు భీష్మించుకొని కూర్చున్నారు. వందలాది వాహనాలు ఎక్కడికంటే నిలిచి రవాణా సౌకర్యానికి ఇబ్బందిగా మారాయి. జిల్లా అధికారులకు అకాల వర్షాలు ఉన్నాయన్న సమాచారం ఉన్న వరి ధాన్యం కేంద్రాల వద్ద ఎందుకు నిర్లక్షం చేశారని రైతులు ప్రశ్నించారు. సకాలంలో వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి సంచులు నింపి ఆయా



రైస్‌మిల్లులకు గోదాములకు పంపితే రైతులకు ఈ కష్టం వచ్చేది కాదని అన్నారు. ఇదంతా ప్రభుత్వ నిర్లక్షమేనని రైతులు వాపోయారు. మొలచిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయకపోతే ధర్నాను ఉధృతంగా ఉద్యమంలో చేపడతామని రైతులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఘటనా స్థలానికి ఏసిపి వెంకటేశ్వరరెడ్డి, పోలీసు బలగాలతో చేరుకొని, జిల్లా వ్యవసాయ కమిటీ అధికారులు, ఆర్డిఓ రాజాగౌడ్ ఫోన్ ద్వారా మాట్లాడి రైతులు చేసిన ధర్నాను విషయాన్ని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి రెండు రోజుల్లో ధాన్యాన్ని మొత్తం బస్తాలలో నింపి ఆయా రైస్ మిల్ పంపిస్తానని పూర్తిగా హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.4

# రూ. 2200 కోట్ల కిరు జల విద్యుత్ ప్రాజెక్టు అవినీతి

## కాశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్‌కు సిబిఐ నోటీసులు

న్యూఢిల్లీ,మే22(సమయజ్యోతి):

సుమారు రూ. 2200 కోట్ల విలువైన కిరు జల విద్యుత్ ప్రాజెక్టు సివిల్ వర్క్స్ కాంట్రాక్టుల మంజూరుకు సంబంధించి అవినీతి కేసులో జమ్మూ కాశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్‌కి ఉచ్చు బిగిస్తోంది. సీబీఐ ఆయనపై గురువారం ఛార్జిషీట్ దాఖలు చేసింది. కిష్త్వార్‌లో కిరు జల విద్యుత్ ప్రాజెక్టు టెంటర్ల పక్రియకలో జరిగిన అనుమానిత అక్రమాలకు సంబంధించిన కేసులో ఆయన ప్రమేయం ఉన్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి. జమ్మూ కాశ్మీర్ గవర్నర్‌గా ఆగస్టు 23, 2018 నుండి అక్టోబర్ 30, 2019 వరకు పనిచేసిన మాలిక్, రెండ్కు ÷ళ్లైను క్లియర్ చేయడానికి తనకు రూ. 300 కోట్ల లంచం ఆఫర్ చేశారని గతంలో ఆరోపించారు, ఇందులో కిరు విద్యుత్ ప్రాజెక్టుకు చెందినది కూడా ఉంది. ఈ కేసులో ఫిబ్రవరి 2024లో సీబీఐ దర్యాప్తులో భాగంగా ఢిల్లీ, జమ్మూ కాశ్మీర్ లోని మాలిక్ నివాసాలతో పాటు 30కి పైగా ప్రదేశాల్లో సోదాలు నిర్వహించింది. మాలిక్‌తో పాటు ఆయన సహచరులు, కిరు జలవిద్యుత్ ప్రాజెక్టు అమలు చేస్తున్న చీనాబ్ వ్యాలీ పవర్ ప్రాజెక్ట్ లిమిటెడ్(అ÷ఎఖఖఖఒ)తో సంబంధం ఉన్న అధికారులపై కూడా దాడులు జరిగాయి. అ÷ఎఖఖఖఒ మాజీ చైర్మన్ నవీన్ కుమార్ చౌదరి, మాజీ అధికారులు ఎంఎస్ బాబు, ఎంకే మిట్టల్, అరుణ్ కుమార్ మిశ్రా, వీరితో పాటు పటేల్ ఇంజనీరింగ్ లిమిటెడ్ వంటి అనేక మంది వ్యక్తులు సీబీఐ రాడార్‌లోకి వచ్చారు. సీబీఐ చెబుతున్న దాని ప్రకారం, బోర్డు 47వ సమావేశంలో రివర్స్ వేలం ద్వారా ఈ -టెండరింగ్ ద్వారా ప్రాజెక్టును తిరిగి టెండర్ చేయాలని నిర్ణయం తీసుకున్నప్పటికీ, దీనిని అమలు చేయలేదు, కాంట్రాక్టును చివరకు పటేల్ ఇంజనీరింగ్ లిమిటెడ్‌కి ఇచ్చారు. అయితే, తాను ఎలాంటి తప్పు చేయలేదని, ఈ దాడులు తనను బెదిరించే ప్రయత్నం అని సత్యపాల్ మాలిక్ అన్నారు. సీబీఐ చార్జిషీట్ తర్వాత, సత్యపాల్ మాలిక ఎక్స్ వేదిక ట్వీట్ చేశారు. 'నేను గత మూడు నుండి నాలుగు రోజులుగా అనారోగ్యంతో ఉన్నాను మరియు ఆసుపత్రిలో చేరాను. అయినప్పటికీ, ప్రభుత్వ సంస్థల ద్వారా నియంత నా ఇంటిపై దాడి చేస్తున్నాడు. నా డ్రైవర్ మరియు నా సహాయకుడిని కూడా అనవసరంగా దాడి చేసి వేధిస్తున్నారు. నేను రైతు కొడుకుని, ఈ దాడులకు నేను భయపడను. నేను రైతులతో ఉన్నాను.' అని అందులో పేర్కొన్నారు. లంచం ఆఫర్‌కి సంబంధించి సత్యపాల్ మాలిక్ బహిరంగ ఆరోపణల నేపథ్యంలో 2022లో సీబీఐ కేసు నమోదు చేసింది. ఆ తర్వాత దర్యాప్తులో భాగంగా కాంట్రాక్టు మంజూరులో అవకతవకలు జరిగాయనే ఆధారాలు బయటపడ్డాయి.

# పాక్ ఉగ్రవాద చర్యలకు మద్దతు ఇవ్వొద్దు

## టర్కీకి ఘాటుగా హెచ్చరించిన భారత్

న్యూఢిల్లీ,మే22(సమయజ్యోతి):

పాకిస్తాన్‌కి ఇటీవల కాలంలో టర్కీ మద్దతు ఇవ్వడంపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. టర్కీకి బలమైన సందేశాన్ని పంపింది. పాకిస్తాన్ నుంచి వస్తున్న సీమాంతర ఉగ్రవాదాన్ని పరిష్కరించడానికి టర్కీ పనిచేయాలని భారత్ ఆశిస్తున్నట్లు ప్రభుత్వం గురువారం తెలిపింది. ఉగ్రవాదాన్ని దేశ విధానంగా ఉపయోగించుకోకుండా పాకిస్తాన్‌ని నిరోధించడానికి, దశాబ్దాలుగా ఆశ్రయం ఇస్తున్న ఉగ్రవాద ఎకో సిస్టమ్‌పై విశ్వసనీయమైన, ధ్రువీకరించదగిన చర్యలు తీసుకోవాలని న్యూఢిల్లీ టర్కీని కోరింది. 'పాకిస్తాన్ సీమాంతర ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడం మానేయాలని మరియు దశాబ్దాలుగా అది పెంచి పోషిస్తున్న ఉగ్రవాద పర్యావరణ వ్యవస్థపై విశ్వసనీయమైన,ధృవీకరించదగిన చర్యలు తీసుకోవాలని టర్కీ గట్టిగా కోరుతుందని మేము ఆశిస్తున్నాము. సంబంధాలు ఒకరి ఆందోళనలకు మరొకరి సున్నితత్వంపై ఆధారపడి ఉన్నాయి' అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మీడియా సమావేశంలో అన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత టర్కీ, పాకిస్తాన్‌కి మద్దతు ఇచ్చింది. భారత్ పై దాడి చేయడానికి పాకిస్తాన్ టర్కీ తయారీ డ్రోన్లను ఉపయోగించింది. ఇదే కాకుండా, వీటిని ఆపరేట్ చేయడానికి ఇద్దరు టర్కిష్ వ్యక్తుల్ని నియమించింది. అయితే, భారత్ జరిపిన దాడుల్లో టర్కీ డ్రోన్లు ధ్వంసం కావడంతో పాటు ఇద్దరు వ్యక్తులు కూడా మరణించారు. ఈ నేపథ్యంలోనే భారత్, టర్కీ మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. టర్కీ నుంచి భారత్‌కి దిగుమతి అయ్యే ఆపిల్స్‌ని భారత వ్యాపారులు కొనడం లేదు. దీంతో పాటు టర్కీకి వెళ్లే టూరిస్టుల సంఖ్య చాలా తగ్గింది. ఇదే కాకుండా, ఎయిర్ పోర్టు గ్రౌండింగ్ సేవలు అందించే, టర్కీకి చెందిన సంస్థ సెలిబి అనుమతిని రద్దు చేసింది.

# ఈ-డ్రైవ్ పథకంకింద 11వేల బస్సుల పంపిణీ

న్యూఢిల్లీ,మే22(సమయజ్యోతి):

ప్రధాన మంత్రి ఈ-డ్రైవ్ పథకంకింద ఆయా రాష్ట్రాలకు ఎలక్ట్రిక్ బస్సులు కేటాయింపు జరుగనుంది. వివిధ రాష్ట్రాలకు 11వేల బస్సులను కేంద్రం అందచేయనుంది. ఈ మేరకు ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపుపై కేంద్రమంత్రి కుమారస్వామి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌కు 2వేల ఎలక్ట్రిక్ బస్సులు కేటాయిస్తామని కేంద్ర మంత్రి తెలిపారు. రాష్ట్రాలకు పీఎం ఈ-డ్రైవ్ కింద 11వేల ఈ- బస్సులు మంజూరు చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. సుమారు 11వేల ఈ-బస్సులను 5 నగరాలకు కేటాయిస్తామన్నారు. వీటిలో బెంగళూరుకు 4,500, ఢిల్లీకి 2,800, అహ్మదాబాద్‌కు 1000, సూరత్‌కు 600 బస్సులు కేటాయిస్తామని పేర్కొన్నారు. మొత్తం 14,028 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించారు. పీఎం ఈ-డ్రైవ్ కింద ఎలక్ట్రిక్ బస్సుల కోసం కేంద్రం రూ.10,900 కోట్లు కేటాయించినట్టు తెలిపారు.

# పేలుళ్ల కుట్ర కేసులో నిందితులకు పోలీస్ కస్టడీ

విజయనగరం,మే22(సమయజ్యోతి):

విజయనగరం పేలుళ్ల కుట్ర కేసులో నిందితులను వారం పాటు పోలీసు కస్టడీకి అప్పగిస్తూ విజయనగరం జిల్లా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. పేలుళ్ల కుట్ర కేసులో నిందితులు సిరాజ్, సమీర్‌ను అరెస్టు చేసిన పోలీసులు లోతైన విచారణకు నిందితులను 10 రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై వాదప్రతివాదనలు విన్న విజయనగరం జిల్లా ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ గురువారం తీర్పు వెలువరించారు. ప్రస్తుతం విశాఖ కేంద్ర కారాగారంలో ఉన్న నిందితులు సిరాజ్, సమీర్‌ను వారం రోజుల పాటు కస్టడీకి తీసుకొని విచారించనున్నారు.

# తారాస్థాయికి బిఆర్ఎస్ లుకలుకలు

## బిజెపితో పొత్తుకు కెసిఆర్ తహతహ

## కవిత విమర్శలపై కెటిఆర్ సమాధానం చెప్పాలి

## ఎమ్మెలెయే ఆది శ్రీనివాస్ డిమాండ్

హైదరాబాద్,మే22(సమయజ్యోతి):

బీఆర్ఎస్‌లో ముసలం తారాస్థాయికి చేరిందని ఎమ్మెల్సీ కవిత లేఖపై తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ షాకింగ్ కామెంట్స్ చేశారు. కవిత రాసిన లేఖతో లుకలుకలు బయటపడ్డాయని చెప్పారు. బీజేపీతో బీఆర్ఎస్ కలిసి పనిచేస్తోందని తాము చాలాకాలంగా చెబుతున్న మాటలను కవిత సమర్థించారని అన్నారు. బీజేపీతో పొత్తు పెట్టుకోవడానికి కేసీఆర్ సిద్ధమవుతున్నారని కవిత చెప్పకనే చెప్పిందన్నారు. గురువారం గాంధీభవన్‌లో మీడియాతో ఆది శ్రీనివాస్ మాట్లాడారు. బీజేపీపైన పల్లెతు మాట మాట్లాడకుండా కేసీఆర్ వ్యవహారించిన తీరును కవిత కడిగి పారేసిందని అన్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్, బీజేపీ పొత్తు పెట్టుకోబోతున్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ బలహీనపడటం వల్లనే బీజేపీతో పొత్తుకు ప్రయత్నిస్తున్నట్లు కవిత అంగీకరించారని ఆది శ్రీనివాస్ చెప్పారు. 'కవిత పచ్చి నిజాలు చెప్పారని.. మేం చాలా కాలంగా చెబుతున్నాం. బీఆర్ఎస్‌లో కేసీఆర్ నియంతృ త్వ వైఖరీని కూడా కవిత నిలదీశారు. పార్టీ రజతోత్సవ వేడుకల్లో కేసీఆర్ ఒక్కరే ప్రసంగించడాన్ని ఆమె ప్రశ్నించారు. కేసీఆర్ వైఖరీని ఆయన కూతురే తప్పుపడుతోంది. ఇక ప్రజలకు వాళ్లేమి సమాధానం చెబుతారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని కవిత తేల్చి చెప్పింది. పార్టీ నాయకులను కలవకుండా ఏకపక్ష పోకడలకు పోతున్నారని ఆమె చెప్పారు. కవిత లేఖపైన బీఆర్ఎస్ నాయకత్వం స్పందించి ప్రజలకు సమాధానం చెప్పాలి. మా సీఎం రేవంత్ రెడ్డి మీద ఒంటి కాలిపైన లేస్తున్న కేటీఆర్ ముందు తన చెల్లికి సమాధానం చెప్పాలి' అని ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు.. 'కవితకు సమాధానం చెప్పకుండా ఇతర పార్టీలను విమర్శించే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదు. కల్వకుంట్ల కుటుంబంలో లుకలుకలు ఉన్నాయి. మాజీమంత్రి హరీశ్‌రావు అలగడంతో ఇంటికి వెళ్లి కేటీఆర్ బతిమాలాడు. కవిత లేఖతో బీఆర్ఎస్ ఇద్దరికి మాత్రమే పరిమితం అయిందని తేలింది. గత పదేళ్లలో కేసీఆర్ హయాంలో జరిగిన దోపిడి గురించి కూడా కవిత ప్రశ్నిస్తే బాగుంటుంది. పంపకాలు, పదవుల్లో తేడా వచ్చి కేసీఆర్ కుటుంబంలో లేఖలు రాసుకుంటున్నారు. బీఆర్ఎస్ పని ఇక అయిపోయింది. కేటీఆర్.. ముందు నీ ఇళ్లు సరిదిద్దుకో. అధికారంలో ఉన్నప్పుడు ఫామ్ హౌస్‌లోనే, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యాడు. కేసీఆర్ తీరును ఆయన కూతురే తప్పుపడుతోంది. ప్రజలకు ఆయన సమాధానం చెప్పాలి' అని ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

# కృష్ణా నుంచి ఎపి, తెలంగాణ అవసరాలకు నీరు

## ఆదేశాలు ఇచ్చిన కృష్ణాయాజమాన్య బోర్డు

హైదరాబాద్,మే22(సమయజ్యోతి):

వేసవి నీటి అవసరాల దృష్ట్యా శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి ఏపీకి 4 టీఎంసీలు, తెలంగాణకు 10.26 టీఎంసీలు విడుదల చేయనున్నారు. ఈ మేరకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీశైలంలో 800 అడుగులు, సాగర్‌లో 505 అడుగుల వరకు నీటిని వినియోగించుకోవచ్చని పేర్కొంది. ఏపీ అవసరాల కోసం సాగర్ కుడి కాల్వ నుంచి రోజుకు 5,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని నిర్ణయించింది. శ్రీశైలంలో జులై నెలాఖరు వరకు 800 అడుగుల కనీస మట్టం కొనసాగించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

# గ్రూప్-2 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

## షెడ్యూల్ విడుదల చేసిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్

హైదరాబాద్,మే22(సమయజ్యోతి):

గ్రూప్-2 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ షెడ్యూల్‌ను ఖరారు చేసింది. ఈ నెల 29 నుంచి జూన్ 10 వరకు ధ్రువపత్రాలను పరిశీలించనున్నట్లు వెల్లడించింది. షెడ్యూల్ ప్రకారం ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు; అలాగే.. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్స్‌లో సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు యూనివర్సిటీ లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టనున్నట్లు పేర్కొంది. ఎంపికైన అభ్యర్థుల హాల్‌టికెట్ నంబర్లతో పాటు వెరిఫికేషన్ కొరకు ఏయే సర్టిఫికెట్లు తీసుకొని వెళ్లాలో ప్రత్యేక జాబితాను విడుదల చేసింది. ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో ందుబాటులో ఉంచినట్టు టీజీపీఎస్సీ తెలిపింది. ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఒక సెట్ స్వయంగా సంతకం చేసిన ఫొటో కాపీలు తీసుకురావాలని సూచించింది. హాజరు కాలేని అభ్యర్థులు, వెబ్ ఆప్షన్స్ సరిగా నమోదు చేయని వారిని అనర్హులుగా ప్రకటించి.. ఖాళీలు మిగిలిన సందర్భంలో అవసరమైతే అదనంగా ఇతర అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు పిలుస్తామని టీజీపీఎస్సీ పేర్కొంది.

# ఇంటిగుట్టు బయటపడకుండా హరీష్‌తో మంతనాలు

**కాళేశ్వరం అద్భుతమైతే ఎందుకు కూలింది**

**కెటిఆర్ అపరిచితుడులో రెమో లాగా వ్యవహరిస్తున్నారు**

**భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శలు**

న్యూఢిల్లీ,మే22(సమయజ్యోతి):

మాజీమంత్రి కేటీఆర్‌పై కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో పదేళ్లు సరిగా పాలన చేయలేదని కేటీఆర్ చెల్లెలు కవిత చెప్పిందని అన్నారు. ఇంటి గుట్టు బయటకు రాకుండా కేటీఆర్ తన బావ హరీష్‌రావు ఇంటికెళ్లారని తెలిపారు. కాళేశ్వరం బ్రహ్మాండమైన ప్రాజెక్ట్ అని, మాజీ సీఎం కేసీఆర్ అంత పెద్ద ఇంజనీర్ దేశంలో లేరని కేటీఆర్ అనడం చాలా విడ్డూరంగా ఉందని విమర్శించారు. భూగోళంలో ఇలాంటి ప్రాజెక్ట్ లేదని కేటీఆర్ గొప్పలు చెబుతున్నారని అన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై నాగం జనార్ధన్ రెడ్డి వేసిన కేసులో ఇచ్చిన తీర్పును కాళేశ్వరం ప్రాజెక్టుకు కేటీఆర్ ముడిపెడుతున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి చెప్పారు. కేటీఆర్ అపరిచితుడు సినిమాలో రెమోలాగా వ్యవహరిస్తున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సెటైర్లు గుప్పించారు. మిస్ వరల్డ్ పోటీలను తమ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని .. కానీ ఆ పోటీలను చూసి కేటీఆర్ అసూయ పడుతున్నారని విమర్శించారు. అందాల పోటీలు కేటీఆర్ ఊసు లేకుండా జరుగుతున్నాయని బాధపడుతున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో అవినీతి జరిగిందని సీబీఐ విచారణ చేయాలని నాగం జనార్ధన్ రెడ్డి గతంలో అడిగారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. ఇప్పుడు నాగం జనార్ధన్‌రెడ్డి బీఆర్ఎస్‌లోనే ఉన్నారని చెప్పుకొచ్చారు. నిజాం నవాబు చార్మినార్ కడితే, కేసీఆర్ కాళేశ్వరం కట్టారని కేటీఆర్ చెబుతున్నారని అన్నారు. నాగం జనార్ధన్ రెడ్డి కేసు ఎందుకు వేశారో ఆయన్ని అడిగితే తెలుస్తోందని చెప్పారు. కేసీఆర్‌కి మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను ఇచ్చామని గుర్తుచేశారు. కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీ కట్టేందుకు తమ ప్రభుత్వం కొత్త అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. కేసీఆర్ బ్రహ్మండగా పాలన చేశారని తెలంగాణ ప్రజలు చెప్పాలి కానీ బీఆర్ఎస్ నేతలే చెబితే ఎలా అని ప్రశ్నించారు. ప్రత్యేక విమానాలు వేసుకొని ఇతర దేశాలకు కూడా కేసీఆర్ వెళ్లారని గుర్తుచేశారు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ గతంలో కాళేశ్వరం ప్రాజెక్ట్ చూస్తానని అంటే కేసీఆర్ ప్రభుత్వం చూడనివ్వలేదని..10 కిలో మీటర్ల వరకు పోలీసులను పెట్టారని గుర్తుచేశారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

- తలకొండపల్లి మండలానికి 606 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు
- అర్హులైన బీద ప్రజలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తాం
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**తలకొండపల్లి మే22 (సమయజ్యోతి):**

ప్రజా ప్రభుత్వంలో ఇల్లు లేని బీద ప్రజలందరికీ ఇండ్లు ఇవ్వాలనే ధృడ సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు.తలకొండపల్లి మండలానికి 606ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడంతో మండలంలోని జంగారెడ్డిపల్లి గ్రామంలో 18మందికి మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి గురువారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శంకుస్థాపన చేసారు.అంతకుముందు గ్రామంలో జై బాపు..జైభీమ్..జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలి నిర్వహించి కాంగ్రెస్ నాయకులతో కలిసి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్,ఇందిరాగాంధీ విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళు లర్పించారు.అనంతరం గ్రామంలో లబ్ధిదారుల ఇందిరమ్మ గృహాల నిర్మాణంకై శంకుస్థాపన చేసి మహిళలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రోసిడింగ్ పత్రాలు అందజేయడం జరిగింది.అనంతరం గ్రామస్థులు ఎర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ...కల్వకుర్తి నియోజకవర్గంలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే తెలిపారు.ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయినా లబ్ధిదారులు వెంటనే ఇళ్ళు నిర్మాణం చేయాలని వారికి డబ్బులు ఇప్పించే బాధ్యత నాదీ అనీ ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.రాష్ట్రంలో ఎక్కడ రాని నిధులు కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి 600కోట్ల రూపాయలు కాంగ్రెస్ ప్రభుత్వం



బిటి.సిసి.రోడ్లకై మంజూరు చేసిన విషయాన్ని ఎమ్మెల్యే తెలిపారు.గత 30,40ఎండ్లలో కల్వకుర్తిలో ఉన్న ఎమ్మెల్యేలు అభివృద్ధి చేయలేకనే ఈ రోజు వందలాది కోట్ల రూపాయలు కల్వకుర్తి అభివృద్ధికి అవసరం పడుతుందని గత ఎమ్మెల్యేలపై ఆయన ధ్వజమెత్తారు.పేదలెవ్వరు అధైర్య పడవద్దని అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామనీ హామీ ఇచ్చారు.రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డు ఉన్న పేదలందరికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీతా నరసింహా,తహసీల్దారు నాగార్జున,ఎంపిడీఓ శ్రీకాంత్,తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకురి ప్రభాకర్ రెడ్డి,మాజీ ఎంపిపి లక్ష్మీదేవి రఘురాములు,గ్రామ మాజీ సర్పంచ్ వరలక్ష్మి రాజేందర్ రెడ్డి,ఏఎంసీ డైరెక్టర్లు అంజయ్య గుప్త,అజీమ్,వెంకట్ రెడ్డి,శ్యామ్ సుందర్ రెడ్డి,గ్రామ ప్రత్యేక అధికారి నాగరత్నమ్మ,ఎంపిఓ లక్పతి,సెక్రటరీ రాము నాయకులు డేవిడ్,దాసరి యాదయ్య,రమేష్ యాదవ్,జంగయ్య,రేణురెడ్డి,రాములు,ప్రదీఫ్ రెడ్డి,అజీజ్, రాజేందర్,

# ఘనంగా పంచముఖ ఆంజనేయ స్వామి ఏడవ వార్షికోత్సవ వేడుకలు

**రామాయంపేట సమయజ్యోతి**

పురపాలక సంఘం రామాయంపేటఐదవ వార్డు రెడ్డి కాలనీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయంలో పంచముఖ ఆంజనేయ స్వామి ఏడవ వార్షికోత్సవ వేడుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చంద్రపు కొండల్ రెడ్డి,అధ్యక్షతన వేడుకలను ఘనంగా నిర్వహించారు.అర్చకులు చౌడి రవితేజ బృందం చేత స్వామి వారికి పంచమృతలతో అభిషేకం, చేయించి స్వామి వారిని పట్టు వస్త్రాలతో అలంకరించి ఘనంగా పూజలు నిర్వహించారు..ఆలయ ప్రాంగణంలో కాలనీ వాసులు భారీ సంఖ్యలో పాల్గొని పంచముఖ ఆంజనేయ స్వామిని దర్శించుకుని సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు..వచ్చిన భక్తులకు రెడ్డి కాలనీ వాసులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బోనాల శ్రీనివాస్ అమరేందర్ రెడ్డి, కొండల్ రెడ్డి, మహేందర్ రెడ్డి, సార్గు లక్ష్మణ్, లక్ష్మణ్ యాదవ్,ఇమ్మడి శ్రీనివాస్ గోవర్ధన్ రెడ్డి,కుమార స్వామి,నక్క బిక్షపతి,రెడ్డి కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.







# రామాయంపేటలో ఉచిత మెగా వైద్య శిబిరం

**రామాయంపేట సమయజ్యోతి**

మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలోని రాజేంద్రనగర్ కాలనీలో గురువారం నాడు అర్వియం హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో పేద ప్రజల కోసం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు.ఈ వైద్య శిబిరానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సుప్రభాత రావు హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా పోచమ్మల అశ్విని శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ ఎముకలు, స్త్రీల వైద్యం,పిల్లల వైద్యం కంటి వైద్యం,దంత వైద్యం,చాతి గుండె వైద్యం క్యాన్సర్ తదితర రోగులకు పరీక్షలు చేసి ఈ శిభిరంలో డాక్టర్ల సలహా మేరకు 300 రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులను పంపిణి చేశారు 50మంది రోగులను గుర్తించి హాస్పిటలకు బస్సులో తీసుకుని వెళ్ళడం జరిగింది తెలిపారు.ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకొని విజయవంతం చేసినందుకు అభినందనలు తెలియపరచారు.ఈ కార్యక్రమంలో ఆర్వియం ఆసుపత్రి డాక్టర్లు,శ్రావ్య. లోహిత.అజయ్ కుమార్.శివాని మార్కెటింగ్ మేనేజర్ మంచినీళ్ళ లక్ష్మణ్ నర్సులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు దోమకొండ యాదగిరి, అల్లాడి వెంకట్, చింతల స్వామి, వినయ సాగర్, బిజెపి పట్టణ అధ్యక్షుడు అవినాష్ రెడ్డి, వెలుముల రమేష్ నాయకులు మరియు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.









# పలుశుభకార్యాల్లో పాల్గొన్న నల్లగొండ జిల్లా BRS పార్టీ అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

**సమయజ్యోతి పెద్ద అడిశర్లపల్లి మే:22**

అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద వైష్ణవి కన్వెన్షన్ హాల్లో రమావత్ దశ్రునాయక్ కుమార్తె వివాహ రిసెప్షన్ లో మరియు మణికంఠ ఫంక్షన్ హాల్ లో తిరుమలగిరి గ్రామానికి చెందిన కదిర యాదయ్య ధనమ్మ కుమారుడు కుమార్తె లా నూతన పట్టు వస్త్రాలంకారంలో పాల్గొని ఆశీర్వదించారు. అనంతరం విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పీఏ పల్లి Brs పార్టీ మండల అధ్యక్షులు వెలుగూరి వల్లపరెడ్డి గారు, అర్వపల్లి నరసింహ ఎర్ర యాదగిరి, రాయనబోయిన శీను, వంగాల కృష్ణారెడ్డి, సుధాకర్ గౌడ్ , బొడ్డుపల్లి మహేందర్ గోలిగిరి, దామోదర్, బాషిపక రవి, రామావత్ కిషన్, బొగాది కృష్ణారెడ్డి, నారాయణదాసు వెంకన్న,భాస్కర్,సీత ఆంజనేయులు, లక్ష్మయ్య, జానీ పాషా,మారుపాక ప్రదీప్, బెల్లి బాలరాజు,తదితరులు పాల్గొన్నారు.





# తడిసిన ధాన్యం రైస్ మిల్లులకు తరలిస్తాం

## రైతులు ఆందోళన చెందవద్దు

## మండల తహసిల్దార్ రజనీకుమారి

**రామాయంపేట సమయజ్యోతి**

పండించిన ధాన్యం పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామని అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెంద వద్దని రామాయంపేట మండల తహసిల్దార్ రజనీకుమారి అన్నారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామాయంపేట మండల వ్యాప్తంగా బుధవారం రాత్రి కురిసిన భారీ అకాల వర్షానికి మండలంలోని పలు గ్రామాలలో తడిసిపోయిన ధాన్యాన్ని రెవిన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి వివరాలను సేకరిస్తున్నారని ఆమె అన్నారు,తడిసిన ధాన్యం,మొత్తం రైస్ మిల్లులకు తరలించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తామని రైతులు ఆందోళన చెందవద్దని ఆమె సూచించారు.ఇప్పటివరకు రెండు లక్షల బస్తాల ధాన్యం కొనుగోలు చేశామని,మరో 30 లారీల వరకు ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని రైతులు అందరూ సహకరించి ధాన్యం తడిసిపోకుండా టార్పాలిన్ కవర్లు ఏర్పాటు చేసి రక్షణ చేసుకోవాలని ఆమె కోరారు మండల వ్యాప్తంగా 16 సెంటర్లు ఉన్నాయని వాటిలో నుండి 9 సెంటర్లు మూసివేసామని, మరో ఏడు సెంటర్ లలో పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని రైతులు ఆందోళన చెందవద్దని ఆమె రైతులకు సూచించారు.









# హనుమాన్ జయంతి సందర్భంగా హిందూ ఏక్తా యాత్ర ర్యాలీకి పటిష్ట బందోబస్తు కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ఆలం

**కరీంనగర్ సమయజ్యోతి**



హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గురువారంనాడు కరీంనగర్ నగరంలో నిర్వహించనున్న హిందూ ఏక్తా యాత్ర ర్యాలీ కోసం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. ఈ సందర్భంగా ర్యాలీ విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులకు ఆయన బ్రీఫింగ్ నిర్వహించారు. సుమారు 400 మంది పోలీసు అధికారులు బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారని ఆయన పేర్కొన్నారు.

సున్నితమైన ప్రాంతాల్లో స్టాటిక్ ఫోర్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, రూఫ్‌టాప్ నిఘా, మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు వంటి పలు రకాల విధులను కేటాయించినట్లు కమిషనర్ తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన అన్ని చోట్ల దారి మళ్లింపు చర్యలు చేపట్టినట్లు వివరించారు. హిందూ ఏక్తా యాత్ర శోభాయాత్రకు సంబంధించి పోలీసు శాఖ తరపున అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపట్టినట్లు కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం స్పష్టం చేశారు.



# ఫ్యాక్స్ లావాదేవీల సమాచారం కోరుతూ జిల్లా అధికారికి దరఖాస్తు

## ఫ్యాక్స్ సీఈఓ స్పందించకపోవడంతో జిల్లా సహకార సంఘాల అధికారికి దరఖాస్తు...

**ఎండపల్లి మే22(సమయజ్యోతి)**

జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లి.. ( ఫ్యాక్స్ ) లోని 2018 జనవరి 01 నుండి 2025 మే 07 వరకు సంఘం నిర్వాహణ, ఆదాయ, వ్యయాల వివరాలతో పాటు సంఘంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను ఏ ప్రాతిపాదికన నియమించుకున్నారని, సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల పూర్తి వివరాల సమాచారాన్ని కోరుతూ, వివరాలతో సహా నకలు పత్రాలు తనకు అందజేయాలని, నకలు పత్రాల ఖరీదు తాను చెల్లిస్తానని సహకార సంఘం సభ్యుడు ఎలుక రాజు సమాచార హక్కు చట్టం-2005 ద్వారా ఎండపల్లి ఫ్యాక్స్ సీఈఓ కు 2025 మే 07 రోజున దరఖాస్తు సమర్పించారు. కాగా తాను దరఖాస్తు సమర్పించే సమయంలోనే సీఈవో అసహనం వ్యక్తం చేస్తూ, అయిష్టంగానే తన దరఖాస్తు స్వీకరించాడని, తన దరఖాస్తుపై ఇంతవరకు ఎలాంటి స్పందన లేదని ఎలుక రాజు ఆరోపించారు. ఈ విషయమై మే 22 గురువారం జగిత్యాల జిల్లా సహకార సంఘాల అధికారి మనోజ్ కుమార్ ను కలిసి ఇదే విషయంపై దరఖాస్తు సమర్పించినట్లు ఎలుక రాజు పేర్కొన్నారు.



# శ్రీ సంతోషిమాత దేవాలయంలో హనుమజ్జయంతి వేడుకలు

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి మే 22సమయజ్యోతి**

జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషిమాత దేవాలయంలో వేంచేసియున్న క్షేత్రపాలక శ్రీ ఆంజనేయ స్వామి వారికి గురువారం హనుమజయంతి వేడుకలు సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు బట్టారం వంశీకృష్ణ శర్మ తెల్లవారుజామున క్షేత్రపాలక ఆంజనేయ స్వామి వారికి పంచామృతములతో అభిషేకం నిర్వహించారు. పట్టు వస్త్రములు అలంకరింపజేసి సింధూర సేవ, వడమాల సేవ తో పాటు 1008 తమలపాకులతో అర్చనలు నిర్వహించారు. భక్తులు సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణను పటించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సంతోషిమాత దేవాలయ అధ్యక్ష కార్యదర్శులు నూకా వెంకటేశం గుప్త, బ్రాహ్మ0డ్లపల్లి పల్లి మురళీధర్, కోశాధికారి పాలవరపు రామమూర్తి, ఉపాధ్యక్షులు బెలిదేఅశోక్ ,అన్నదాన నిర్వాహకులు దేవర్శెట్టి సోమయ్య , కొల్లూరి రత్నమాల, బెలిదేలక్ష్మి, కంచర్ల లీల, ఓరుగంటి జగదీశ్వరి, శైలజ, కమలమ్మ, బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



# ఎపికి కుంకీ ఏనుగుల రాక

## పవన్ కళ్యాణ్‌కు లోకేశ్ అభినందనలు

**అమరావతి,మే22(సమయజ్యోతి):**

కర్ణాటక నుంచి ఏపీకి కుంకీ ఏనుగులు రప్పించిన నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కు మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఆయన పోస్టు చేశారు. 'ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రైతు సోదరుల కష్టాలకు చెక్ పెట్టేందుకు కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను రప్పించిన డిప్యూటీ సీఎం పవనన్నకు నా శుభాభినందనలు. యువగళం పాదయాత్ర సందర్భంగా ఏనుగుల విధ్వంసంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని పలమనేరు ప్రాంత రైతన్నలు నా దృష్టికి తెచ్చారు. అన్నదాతల ఇక్కట్లను తొలగించేందుకు పవనన్న ప్రత్యేకంగా చొరవ చూపి కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి ఒప్పించారు. ఏపీ అవసరాలకు మరిన్ని కుంకీ ఏనుగులు ఇస్తామని హామీ ఇచ్చిన కర్ణాటక ప్రభుత్వానికి కూడా నా కృతజ్ఞతలని లోకేశ్ పేర్కొన్నారు.

# ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న ముఠా

## 150మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

**అనకాపల్లి,మే22(సమయజ్యోతి):**

ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న అంతర్జాతీయ ముఠా గుట్టును అనకాపల్లి పోలీసులు రట్టు చేశారు. అందుకు సంబంధించి 150 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు.. 30 మందిపై కేసులు నమోదు చేశారు. సైబర్, ఆన్ లైన్ మోసాలపై మంగళవారం రాత్రి జిల్లా పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఈ మోసాలకు పాల్పడుతున్న ముఠాలపై జిల్లా పోలీసులు గత రెండు రోజులుగా పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టారు. ఆ క్రమంలో అచ్యుతాపురం శివారులోని పలు అపార్ట్‌మెంట్లపై దాడి చేసి.. ఈ మోసాలకు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ అపార్ట్‌మెంట్లను ఈ ముఠా అద్దెకు తీసుకుని ఈ ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తమ దర్యాప్తులో గుర్తించారు. హార్డ్ డిస్కులు, కంప్యూటర్లు, బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన కీలక డేటాను పోలీసులు సేకరించారు. విదేశీయుల ఖాతాలను లక్ష్యంగా చేసుకుని ఈ సైబర్ మోసాలకు ఈ ముఠా పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ అపార్ట్‌మెంట్లకు నెలకు రూ. 18 లక్షలు అ÷-దదెగా చెల్లిస్తున్నట్లు పోలీసులు విచారణలో బహిర్గతమైంది. అయితే ఈ అరెస్టయిన వారంతా యువతి యువకులే కావడం గమనార్హం. స్థానిక పోలీసులతోపాటు సైబర్ పోలీసులు ఈ దాడిలో పాల్గొన్నారు.

# వైసీపీ నేత భూమా కిషోర్ రెడ్డిపై కేసు

## టిడిపి నేత ఫిర్యాదుతో పోలీసులు చర్యలు

**నంద్యాల,మే22(సమయజ్యోతి):**

వైసీపీ నేత భూమా కిషోర్ రెడ్డిపై ఆళ్లగడ్డలో కేసు నమోదు అయింది. ఎర్రగుంట్లకు చెందిన నాగ ప్రసాద్ ఫిర్యాదు నేపథ్యంలో భూమా కిషోర్ రెడ్డిపై ఆళ్లగడ్డ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ కేసు నమోదు చేశారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ మాంసం దుకాణాల నుంచి కేజీ చికెన్‌పై రూ.25 అదనంగా వసూలు చేస్తున్నారంటూ వైసీపీ నేతలు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఆరోపణలపై ఇప్పటికే టీడీపీ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ ఖండించారు. అంతేకాదు మీడియా ముందుకు వచ్చి ఆమె వివరణ సైతం ఇచ్చారు. కానీ వైసీపీ మాత్రం ఈ ఆరోపణలను కొనసాగిస్తుంది.దీంతో టీడీపీ, వైసీపీ గ్రూప్‌ల మధ్య స్థానికంగా ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. దాంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకుంటుంది. అలాంటి పరిస్థితుల్లో ప్రజలను తప్పుదోవ పట్టించడం ద్వారా ఉద్రిక్త పరిస్థితులకు వైసీపీ వర్గీయులు కారణమవుతున్నారంటూ నాగ ప్రసాద్.. పోలీసుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక వైసీపీ నేత భూమా కిషోర్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే అతడి అనుచరులు అంబటి మహేశ్వర్ రెడ్డి ,శివ శంకర్ రెడ్డి, మల్లికార్జున్, రుద్ర శివ నాగిరెడ్డి, ప్రతాపరెడ్డి ,అంబటి చంద్రశేఖర్ రెడ్డిపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

# జూన్4న

# వెన్నుపోటు దినం: జగన్

**గుంటూరు,మే22(సమయజ్యోతి):**

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేదాకా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ నిరసన గళం వినిపిస్తూనే ఉంటుందని పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ క్రమంలో.. ఎన్నికల ఫలితాలు వెలువడిన తేదీ జూన్ 4వ తేదీని వెన్నుపోటు దినంగా నిర్వహిస్తామని ప్రకటించారు.. జూన్ 4వ తేదీన వెన్నుపోటు దినంగా నిర్వహిస్తాం. ఆరోజున ప్రజలతో కలిసి నిరసనలు చేపడతాం. కలెక్టర్లను కలిసి హమీల డిమాండ్ పత్రాలను సమర్పిస్తాం. చంద్రబాబు చేసిన మోసానికి నిరసనగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రజలంతా కలిసి రావాలని కోరారు.

సిఎం ఓఎస్డీ పేరుతో బెదిరింపులు

# మాజీ రంజీ క్రికెటర్ నాగరాజు అరెస్ట్

**హైదరాబాద్,మే22(సమయజ్యోతి):**

సీఎం రేవంత్‌రెడ్డి ఓఎస్డీ పేరుతో బెదిరింపులకు పాల్పడుతోన్న ఆంధ్రా మాజీ రంజీ క్రికెటర్ బుడుమూరు నాగరాజును హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాకుళం జిల్లా పొలాకి మండలం యవ్వారిపేటకు చెందిన నాగరాజు ర్యాపిడో, కంట్రీ డిలైట్ ఎండీలకు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేసినట్టు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. తాను సీఎం ఓఎస్డీ అని చెప్పుకొంటూ పలు రియల్ ఎస్టేట్ కంపెనీల ఛైర్మన్‌లకు వాట్సాప్ మెసేజ్‌లు పంపాడు. ఓఎస్డీ పేరుతో నాగరాజు ఫేక్ ఈ మెయిల్ క్రియేట్ చేసినట్టు పోలీసులు గుర్తించారు. శ్రీకాకుళంలో నాగరాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. గతంలో కోడెల శివరాంపై తప్పుడు కేసులు పెట్టి.. ఈ మధ్యే వాటిని వెనక్కి తీసుకున్నాడు. 2023లో శ్రీకాకుళంలో 22 కిలోల గంజాయి తరలిస్తుండగా పోలీసులు నాగరాజును అరెస్టు చేశారు.

# పెద్దిరెడ్డికి హైకోర్టులో దక్కని ఊరట

**అమరావతి,మే22(సమయజ్యోతి):**

బుగ్గ మఠం భూముల విషయంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి హైకోర్టులో ఊరట దక్కలేదు. దేవాదాయ శాఖ ఇచ్చిన నోటీసులపై ఏమైన అభ్యంతరాలు ఉంటే ఆ శాఖకు చెందిన అపిలేట్ ట్రిబ్యునల్‌కు వెళ్లాలని హైకోర్టు సూచించింది. కాగా, తిరుపతికి సమీపంలోని ఎంఆర్ పల్లిలో ఉన్న బుగ్గ మఠంకు చెందిన 3.88 ఎకరాల ప్రభుత్వ భూమిని వైసీపీ కీలక నేత పెద్దిరెడ్డి కబ్జా చేసినట్లు అధికారులు గుర్తించారు. అయితే, ఆ భూములను ఖాళీ చేయాలని పెద్దిరెడ్డికి దేవాదాయ శాఖ నోటీసులు ఇచ్చింది. అయితే, బుగ్గ మఠం భూముల విషయంలో దేవాదాయ శాఖ జోక్యం చేసుకోకుండా స్టే ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో పెద్ది రెడ్డి పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ పై విచారణ నిర్వహించిన హైకోర్టు.. దేవాదాయ శాఖ ఇచ్చిన నోటీసులపై అభ్యంతరాలు ఉంటే ఆ శాఖకు సంబంధించిన ట్రిబ్యునల్‌కు వెళ్లాలని సూచించింది.

# స్కామ్‌లకు పరాకాష్టగా అమరావతి

- సొంత ఆస్తులను పెంచుకునేలా అప్పులు
- గతంలో టెండర్ల పనులకూ..నేటికి పొంతన ఏదీ
- నాడు ఖరారైన టెండర్ల విలువ రూ.41, 107 కోట్లు మాత్రమే
- అప్పటికే 6వేల కోట్ల పనులు పూర్తి చేశారు
- ఇంతగా పెంచడం..ఏమైనా బంగారంతో కడుతున్నారా
- మీడియా సమావేశంలో వైఎస్ జగన్ విమర్శలు

**అమరావతి,మే22(సమయజ్యోతి):**



రాజధాని అమరావతి స్కాంలకు పరాకాష్టగా నిలిచిందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. అమరావతి పనుల కోసం 2018 లోనూ టెండర్లు పిలిచారు. నాడు ఖరారైన టెండర్ల విలువ రూ.41, 107 కోట్లు. దాదాపు 6 వేల కోట్లు పనులు చేశారు. మిగిలిన రూ. 35 వేల కోట్లతో పనులు చేయాల్సి ఉంది. కానీ, అప్పుడు ఖరారైన టెండర్లను ఇప్పుడు రద్దు చేశారు. మిగిలిన ఆ పనుల అంచనాలు అమాంతం పెంచేశారు. ఇప్పటికే కట్టిన అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు కాకుండా మళ్లీ కడతారట. అంటే అన్నీ గంగపాలు చేసినట్లే!. అమరాతి కోసం చంద్రబాబు అప్పల మీద అప్పులు చేస్తున్నారని మండిపడ్డారు. అక్రమాలకు అడ్డు కాకూడదని.. మా హయంలో తెచ్చిన జ్యూడీషియల్ ప్రివ్యూ తీసేశారు. రివర్స్ టెండరింగ్‌నూ రద్దు చేశారు. మొబలైజేషన్ అడ్వాన్స్‌లు లేవు. కానీ, స్కాంల కోసమే మొబలైజేషన్ అడ్వాన్స్‌లు తెచ్చారు. అడ్వాన్స్‌ల పేరిట 10 శాతం ఇచ్చి 8 శాతం తీసుకుంటున్నారు. 2018 ఐకానిక్ టవర్‌ల పేరిట టెండర్లకు పిలిచారు. మిగిలిన పనులను ఇప్పుడు నిర్మాణ వ్యయం 4,468 కోట్లు. 2018తో పోలిస్తే దాదాపు రూ.2,417 కోట్లు (105 శాతం) పైగా పెంచారు. చదరపు అడుగుకు రూ.8, 931. అంటే ఏమైనా బంగారంతో కడుతున్నారా? అని జగన్ ప్రశ్నించారు. అయ్యా చంద్రబాబూ.. సొంత లాభాలు, బినామీ ఆస్తులను పెంచుకునే పని పక్కన పెడితే.. ఇంతేసి అప్పులు చేయాల్సి ఉండదు కదా' అని వైఎస్ జగన్ సూచించారు. అభివృద్ధి మంత్రం తన చేతిలో ఉందని ఎన్నికల ముందు చంద్రబాబు చేసిన హామీలను గుర్తు చేసారు. మరింత సంక్షేమం చేస్తామని చెప్పారు. కానీ, 12 నెలలు పూర్తయ్యినా ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు కాలేదు అన్నారు. ఇక రాష్ట్ర వృద్ధి రేటు కేవలం 3.08 శాతమేనని, మరోవైపు, దేశ స్థాయిలో గ్రాస్ టాక్స్ రెవెన్యూ వృద్ధి రేటు 13.76 శాతం ఉందని అన్నారు. ఏపీ ఆదాయం మాత్రం చంద్రబాబు, ఆయన మంత్రుల జేబుల్లోకి వెళ్తోంది అని జగన్ అన్నారు. ఈ ఏడాది మాత్రమే రూ.81,597 కోట్ల అప్పులు చేశారు. గత ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం రూ.3,32,671 కోట్ల అప్పులు తీసుకుంది. ఇందులో సగం అప్పులు ఒక్క ఏడాదిలోనే చేసి పెట్టారు. రాష్ట్ర ఖజానాను ప్రైవేట్ వ్యక్తులకు తాకట్టు పెట్టడమంటే ఇదే కావచ్చని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే యాక్సిస్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తో రూ.11 వేల కోట్ల స్కాం జరిగిందని అన్నారు. మేము 2021లో సెకి సంస్థతో 2.49 రూపాయల ధరకు ఒప్పందం చేసాం. కానీ ఇప్పుడు అదే ఒప్పందాన్ని 2.11 రూపాయల ధరకు కుదిర్చారు. 25 ఏళ్ల కాలంలో ప్రజాధనంగా రూ.11 వేల కోట్లు ఆ సంస్థకు మళ్లిస్తున్నారన్నారు. ఒప్పందంపై తప్పు ఎక్కడుందో చూపిస్తే మాకే చెప్పండి. రామేశ్వర్ ప్రసాద్ గుప్తా అనే వ్యక్తి 2023లో సంస్థకు ఛైర్మన్ అయ్యారు. కానీ మీడియా వాళ్లు అసత్య ఆరోపణలు చేస్తూ మాపై దూషణలు చేస్తున్నారని మండిపడ్డారు. వాస్తవాలు నిరూపణలతో చెబుతున్నాం. కానీ ఎల్లో మీడియా అబద్ధాలతో మోసం చేస్తోంది. లోకేష్ స్నేహితుడికి 99 పైసలకు భూములు కట్టబెట్టారు. ఈ వ్యవహారాలు చూస్తుంటే ప్రజలను మోసం చేయడమే లక్ష్యంగా ఉన్నట్టు తెలుస్తోందని జగన్ తెలిపారు.అమరావతి ఓ సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ అని చెప్పిన చంద్రబాబు.. ఇప్పుడు ఆకాశాన్ని అంటేలా అప్పులు చేస్తున్నారు. 'అయ్యా చంద్రబాబూ.. సొంత లాభాలు, బినామీ ఆస్తులను పెంచుకునే పని పక్కన పెడితే.. ఇంతేసి అప్పులు చేయాల్సి ఉండదు కదా' వైఎస్ జగన్ సూచించారు.రాష్ట్రంలో జరుగుతున్న పాలనా పరిస్థితులు, అవినీతి ఆరోపణల నేపథ్యంలో జగన్ కౌంటర్లు హాట్ టాపిక్ గా మారాయి.

# చంద్రబాబు ప్రలోభాలకు లొంగిన విజయసాయి

## ఆయన ఇచ్చే ప్రకటనలకు విలువ ఉంటుందా

## లిక్కర్ వ్యవహారంలో చంద్రబాబు నిలువుదోపిడీ

## ఘాటు విమర్శలు చేసిన వైఎస్ జగన్

**అమరావతి,మే22(సమయజ్యోతి):**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాజాగా విజయసాయిరెడ్డిపై, అలాగే రాష్ట్రంలోని లిక్కర్ స్కాంలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తనతోపాటు నిన్నమొన్నటి వరకు ఉన్న విజయసాయిరెడ్డిపై వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. సీఎం చంద్రబాబు ప్రలోభాలకు విజయసాయిరెడ్డి లొంగిపోయారని అయన అన్నారు. ఇంకా మూడేళ్లకు పైగా రాజ్యసభ పదవీ కాలం ఉన్నా.. విజయసాయిరెడ్డి కేవలం కూటమికి ప్రయోజనం కలిగించేందుకే రాజీనామా చేశారని జగన్ ఆరోపించారు. అలాంటి వ్యక్తి ఇచ్చే ప్రకటనలకు ఏమి విలువ ఉంటుంది? అంటూ జగన్ విమర్శించారు. ప్రైవేట్ మాఫియా, డిస్టిలరీ ఆర్డర్లు, లిక్కర్ అమ్మకాలపై చంద్రబాబు హయాంలో జరిగిన అక్రమాలను తెలిపారు. జగన్ మాట్లాడుతూ.. ఏ లిక్కర్ కంపెనీ డిస్టలరీ మేలు చేయాలో ప్రైవేట్ షాపుల పేరుతో వీళ్ళ ప్రైవేట్ సైన్యం ఇండెంట్ ప్లేస్ చేస్తారన్నారు. మా హయాంలో ఎప్పుడైనా ఇలా చూసారా? గత ప్రభుత్వంలో ఒక్క రూపాయి కూడా అదనంగా వసూలు చేశామా? అని ప్రశ్నించారు. అలాగే, ఎంపిక చేసిన డిస్టిలరీలకు ఇండెంట్ పెట్టి లంచాలు తీసుకుంటేనే పారదర్శకత కాదని చెప్పారు. తాము మాత్రం క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా పారదర్శకంగా మద్యం అమ్మినట్లు గుర్తు చేశారు. జగన్ వెల్లడించిన విషయాల్లో, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (అఅఎ) తాము అమలు చేస్తున్న మద్యం విధానంపై పూర్తి స్థాయిలో సుదీర్ఘ విచారణ జరిపి, ప్రభుత్వ విధానం సహేతుకమని తీర్పు ఇచ్చిందని తెలిపారు. 'జడ్జిమెంట్ కాపీ కూడా మా వద్ద ఉందని పేర్కొన్నారు. ఇది ఇలా ఉండగా.. అలాగే వాసుదేవరెడ్డిని బెదిరించి వాంగ్మూలం తీసుకున్నారు. ఆయన వాంగ్మూలం ఇచ్చాకే సెంట్రల్ సర్వీస్‌కు పంపించారు. మిథున్ రెడ్డికి లిక్కర్ కేసుతో ఏమి సంబంధం? ఆయన తండ్రి ఎక్సైజ్ శాఖ మంత్రి కూడా కాదని జగన్ వివరణ ఇచ్చారు. ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, గోవిందప్పల అరెస్టులు రాజకీయ కక్షసాధింపు కోణంలో జరిగాయని అన్నారు. అలాగే పీఎస్ఆర్ ఆంజనేయులు, సునీల్, సంజయ్ వంటి ఐపీఎస్ అధికారులను తప్పుడు కేసుల్లో ఇరికిస్తున్నారు. 199 మంది పోలీసులకు పోస్టింగులు ఇవ్వకుండా వేధిస్తున్నారు అంటూ ప్రభుత్వయంత్రాంగం మీద మండిపడ్డారు. చంద్రబాబు హయాంలో లిక్కర్ షాపులకు లాటరీ పేరుతో రిగ్గింగ్ జరిగిందని జగన్ ఆరోపించారు. ఇక ప్రస్తుతం కొత్త బ్రాండ్లు తీసుకువచ్చారు. ఊరు పేరు లేని బ్రాండ్లు.. చీపెస్ట్ చిప్ లిక్కర్ పక్క రాష్ట్రాల్లో కంటే పదిరూపాయలు ఎక్కువ ధరకు అమ్ముతున్నారని.. గ్రామాల్లో ఎంఆర్పీ రేట్లకు మద్యం దొరకడం లేదని జగన్ మండిపడ్డారు. అలాగే, మద్యం వ్యాపారంలో తాము ఏ విధంగా పారదర్శకత పాటించామో వెల్లడించేందుకు సంబంధిత అన్ని డాక్యుమెంట్లు పబ్లిక్ డొమెయిన్‌లో పెడుతున్నాం అని తెలిపారు.

# జూన్‌లో స్మార్ట్ రేషన్ కార్డులు

## దరఖాస్తు స్వీకరించిన 21 రోజుల్లో పరిష్కరిస్తాం

## మార్పులు, చేర్పులకు దరఖాస్తు చేసుకునే అవకాశం

## ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి మంత్రి నాదెండ్ల వెల్లడి

**విజయవాడ,మే22(సమయజ్యోతి):**



రేషన్‌కార్డు కోసం కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. దరఖాస్తు స్వీకరించిన 21 రోజుల్లో దాన్ని పరిష్కరిస్తామని తెలిపారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మే 7 నుంచి రైస్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేపట్టామని.. ఇ-కెవైసీ తప్పనిసరి అని కేంద్రం స్పష్టం చేసినట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతి కార్డును ఇకెవైసి చేశామని.. దేశంలో 95 శాతం ఈకైవైసీ పూర్తి చేసుకున్న ఏకైక రాష్ట్రం ఏపీ అని వెల్లడించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 4,24,59,028 మందికి ఈకైవైసీ పూర్తి అయ్యిందని.. 22,59,498 మంది కి మాత్రమే ఈకేవైసీ పూర్తికాలేదని తెలిపారు. సర్వర్ ఆపేసిన తర్వాత అనేక మంది అప్లికేషన్లు ఇస్తున్నారని.. ఇప్పటి వరకు ఐదు లక్షలఅప్లికేషన్లు మాత్రమే తమకు వచ్చినట్లు చెప్పారు. అరవై వేల మంది కొత్త రైస్ కార్డులు కావాలని దరఖాస్తు చేశారని.. కుటుంబ విభజన కోసం 44వేల మంది దరఖాస్తు చేశారని చెప్పారు. ఛేంజ్ ఆఫ్ అడ్రెస్ కోసం 12,500 మంది దరఖాస్తులు పెట్టున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయానికి రైస్ కార్డుల డేటాను అనుసంధానం చేశామని వెల్లడించారు. సాంకేతిక పరమైన లోపాలతో వల్ల ఇబ్బంది కలిగినందుకు ప్రజలను క్షమాపణ కోరారు. ప్రజలకు వెసులుబాటు కల్పించేలా చర్యలు తీసుకోవాలని వీడియో కాన్ఫరెన్స్ పెట్టి మరీ అధికారులను ఆదేశించినట్లు వివరించారు. ఇది నిరంతరంగా జరిగే ప్రక్రియ.. ప్రజలు తొందరపడకండన్నారు. కార్డుదారుల సమాచారం డేటా బేస్ లో పెట్టి.. ప్రజలకు స్మార్ట్ రైస్ కార్డులు అందిస్తామని చెప్పారు. రేషన్ తీసుకున్నప్పుడే మీకు అప్ గ్రేడ్ అయిపోతుందని.. ప్రజలు ఎక్కడకీ వెళ్లకూడదని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మ్యారెజ్ సర్టిఫికేట్ అవసరం లేదని.. పెళ్లి సంబంధించి ఫొటో కూడా అక్కర్లేదని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది.. వాటితో సంబంధం లేకుండా దరఖాస్తులు తీసుకోవాలని ఆదేశించారు. కొన్ని ప్రాంతాలలో ఈ కారణాలతో దరఖాస్తులు వెనక్కి ఇస్తున్నట్లు తెలిసింది.. ఇక అలా చేయకండని చెప్పారు. కార్డులో కొత్తగా పేర్లు ఎక్కించాలన్నా కూడా పరిశీలించి వెంటనే ఎక్కించండని.. ఒక పేరు తొలగించాలంటే.. తప్పకుండా డాక్యుమెంట్ ప్రూఫ్ ఉండాలన్నారు. డిలీషన్ అనేది.. డెత్ కేసులకు మాత్రమే ప్రస్తుతం పరిమితం చేస్తున్నామని.. ఇతర రాష్ట్రాలలో, ఇతర దేశాలలో ఉంటే.. వారికి కూడా డిలీషన్ ఆప్షన్ ఇస్తున్నామని చెప్పారు. మహిళలు, స్త్రీలుతో పాటు, ట్రాన్స్ జండర్స్ కు కూడా అవకాశం కల్పించామని.. కుటుంబ సభ్యుల్లో హెడ్ ఆఫ్ ది ఫ్యామిలీ మార్పులు కూడా చేస్తున్నామన్నారు. 'క్షేత్రస్థాయిలో మాకు వస్తున్న ఫీడ్ బ్యాక్ ను బట్టి ఎప్పటికప్పుడు ప్రజలకు ఇబ్బంది లేకుండా మార్పులు చేస్తున్నాం. రైస్ కార్డు సరెండర్ చేయాలనుకుంటే.. కుటుంబం మొత్తం కలిపి చేయవచ్చు. కొంతమంది ఆకార్డులో వ్యక్తులను మాత్రమే తొలగించాలని చూస్తున్నారు.. అది ఇప్పుడే సాధ్యం కాదు. వారంరోజుల్లో దీనిపై ఒక నిర్ణయం తీసుకుంటాం. సర్వర్ సమస్యలతో చాలాసార్లు ఇబ్బందులు పడుతున్నారు. త్వరలోనే దీనిని సరి చేసి.. మెరుగైన సేవలు అందిస్తున్నాం. ఈకెవైసీ, ఆధార్ సీడింగ్ లో మార్పులు, రైస్ కార్డు సరెండర్ చేసుకునే అవకాశాలు వాట్సప్ ద్వారా చేసుకునేలా ఎనేబుల్ చేశాం. కొత్త రైస్ కార్డులు జారీలో ఎక్కడా ఎటువంటి జాప్యం లేదు.. దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లోపే కొత్త కార్డులు అందరికీ ఇస్తున్నాం.' అని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. కొత్త రేషన్‌కార్డుకు మ్యారేజ్ సర్టిఫికెట్ అవసరమంటూ జరుగుతున్న ప్రచారంపై ఆయన స్పందించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మ్యారేజ్ సర్టిఫికెట్, పెళ్లికార్డు, పెళ్లి ఫొటో అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో క్షేత్రస్థాయి సిబ్బంది ఎలాంటి పొరపాట్లు చేయొద్దని చెప్పారు. రేషన్‌కార్డుకు ఎవరు దరఖాస్తు చేసినా స్వీకరించాలన్నారు. ఏమైనా సందేహాలుంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని మంత్రి మనోహర్ సూచించారు. 4.24 కోట్ల మందికి జూన్‌లో ఉచితంగా రేషన్‌కార్డులు జారీ చేస్తామన్నారు. దీనికి సంబంధించిన పూర్తి సమాచారం తమ వద్ద ఉందని.. అందులో ఎక్కడా లోపం లేదన్నారు. ప్రభుత్వం సామాన్యుడికి అందుబాటులో ఉంటూ సాంకేతికతను ఉపయోగించుకుని ముందుకెళ్తోందని చెప్పారు. క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ రైస్‌కార్డు ఇస్తామని తెలిపారు. దీనికోసం క్షేత్రస్థాయిలో వివిధ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు. వయసుతో సంబంధం లేకుండా కుటుంబసభ్యులు ఎవరైనా రేషన్‌కార్డులో యాడ్ చేసుకోవచ్చని తెలిపారు. తొలగింపునకు మాత్రం మరణించిన వారి పేర్లనే ప్రస్తుతానికి పరిగణనలోకి తీసుకుంటున్నట్లు మంత్రి వివరించారు. కార్డులో 'హెడ్ ఆఫ్ ది ఫ్యామిలీ' మార్చేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. నమోదైన తప్పుడు వివరాలను సరిచేసేందుకు జాయింట్ కలెక్టర్ వరకు వెళ్లకుండా తహసీల్దార్ స్థాయిలోనే పరిష్కరించేందుకు వెసులుబాటు కల్పించామని నాదెండ్ల మనోహర్ తెలిపారు.



# ఆర్సీబీలోకి ఇంగ్లాండ్ ప్లేయర్ జకాబ్ బెతెల్

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అభిమానులకు అదిరే న్యూస్. 17పాయింట్లతో ఇప్పటికే ప్లేఆఫ్స్?కు అర్హత సాధించిన ఆర్సీబీ, ఈసారి ఛాంపియన్?గా నిలవడమే టార్గెట్?గా పెట్టుకుంది. ఈ నేపథ్యంలోనే జట్టులో కీలక మార్పు చేసింది. టీ 20 స్పెషలిస్ట్?ను రంగంలోకి దింపింది. దీంతో ఆర్సీబీ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీలో ఉన్నారు. ఇంతకీ ఆ ప్లేయర్ ఎవరంటే?ఐపీఎల్ పునః ప్రారంభమైన తర్వాత ఇంగ్లాండ్ ప్లేయర్ జకాబ్ బెతెల్ భారత్?కు వచ్చాడు. కానీ, అతడు ప్లేఆఫ్స్?కు అందుబాటులో ఉండడం లేదు. మే 29న ఇంగ్లాండ్- వెస్టిండీస్ వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్? నేపథ్యంలో బెతెల్ మళ్లీ తన స్వదేశం వెళ్లనున్నాడు. ఈ కారణంగా ఐపీఎల్ ప్లేఆఫ్స్?కు దూరం కానున్నాడు. దీంతో ఆర్సీబీ అతడి రిప్లేస్?మెంట్ ప్రకటించింది. బెతెల్ స్థానంలో న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్ టిమ్ సీఫెర్ట్?ను తీసుకున్నట్లు గురువారం వెల్లడించింది.ఆర్సీబీకి టిమ్ సీఫెర్ట్?తో? రూ.2 కోట్లకు అగ్రిమెంట్ కుదిరింది. అతడు మే 24 తర్వాత జట్టుతో చేరనున్నాడు. ఈ సీజన్?లో ఆర్సీబీ మే 23న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచే బెతెల్?కు ఆఖరిది. ఆ తర్వాత బెతెల్ స్థానంలో సీఫెర్ట్ రానున్నాడు. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో మే 27న ఆర్సీబీ లీగ్?లో తమ? చివరి మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్?లో సీఫెర్ట్ బరిలో దిగే ఛాన్స్ ఉంది.కాగా, ఇప్పటి దాకా 66 టీ20లు ఆడిన సీఫెర్ట్ 142.86 స్ట్రైక్ రేట్?తో 1540 పరుగులు చేశాడు. ఇందులో 80 సిక్స్?లు ఉండడం విశేషం. ఈ ఏడాది ఫుల్ స్వింగ్?లో ఉన్నాడు. 2025లో సీఫెర్ట్ 5 మ్యాచ్?లు ఆడగా 207.50 స్ట్రైక్? రేట్?తో 249 పరుగులు చేశాడు. ఇక సీఫెర్ట్ 2021లోనే ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. 2021- 22 రెండు సీజన్లలో కలిపి కోల్?కతా నైట్?రైడర్స్?, ఢిల్లీ క్యాపిటల్స్? తరపున మూడు మ్యాచ్?లు ఆడాడు.మే 23న బెంగళూరు చిన్నస్వామి వేదికగా ఆర్సీబీ- సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే ఈ మ్యాచ్‌కు వర్షం ముప్పు ఉంది. దీంతో ఈ మ్యాచ్‌ను లఖ్‌నవూ ఎకాన స్టేడియానికి తరలించారు.

## ముఖేష్ కుమార్‌కు మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా



ఐపీఎల్ 2025లో ముంబై ఇండియన్స్ బుధవారం ఢిల్లీ క్యాపిటల్స్ జట్టును ఓడించి ప్లేఆఫ్స్‌లో తన స్థానాన్నిఖరారు చేసుకుంది. ఓటమితో పాటు ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు ఢిల్లీ ఆటగాడికి భారీ జరిమానా విధించబడింది. ఢిల్లీ ఫాస్ట్ బౌలర్ ముఖేష్ కుమార్‌కు మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా విధించారు. మ్యాచ్ సమయంలో క్రికెట్ పరికరాలు లేదా దుస్తులు, గ్రౌండ్ పరికరాలు, ఫిట్టింగ్‌లను దుర్వినియోగం చేయడానికి సంబంధించిన ఆర్టికల్ 2.2 కింద లెవెల్ 1 ఉల్లంఘనకు ముఖేష్ కుమార్‌కు ఒక డీమెరిట్ పాయింట్ కూడా ఇవ్వబడింది. బుధవారం వాంఖడేలో ముంబై ఇండియన్స్ చేతిలో 59 పరుగుల తేడాతో ఓడిపోయిన ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేఆఫ్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ విజయంతో ముంబై ఇండియన్స్ ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించిన 4వ జట్టుగా నిలిచింది. గతంలో గుజరాత్ టైటాన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ జట్లు అర్హత సాధించాయి. “ముఖేష్ కుమార్ ఐపీఎల్ ఆర్టికల్ 2.2 లెవెల్ 1 ఉల్లంఘనను అంగీకరించారు.”అని ఐపీఎల్ ఓ ప్రకటనలో తెలిపింది. ప్రవర్తన నియమావళి మొదటి స్థాయి ఉల్లంఘనకు మ్యాచ్ రిఫరీ నిర్ణయం చెల్లుతుంది. బుధవారం ముఖేష్ కుమార్ తన 4 ఓవర్లలో 48 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. ముఖేష్ చివరి ఓవర్లో 3 సిక్సర్లు, రెండు ఫోర్లతో 27 పరుగులు వచ్చాయి.అంతకుముందు ఢిల్లీ ఓటమి తర్వాత ప్రధాన కోచ్ హేమాంగ్ బదానీ మాట్లాడుతూ.. సీజన్ అంతటా ఓపెనర్లను కనుగొనలేకపోవడం జట్టు వైఫల్యానికి ఒక కారణమని అన్నారు. ఢిల్లీ క్యాపిటల్స్ 13 మ్యాచ్‌ల్లో ఏడు ఓపెనింగ్ జంటలను ప్రయత్నించింది కానీ పెద్దగా విజయం సాధించలేదు. ఇప్పుడు ఆ జట్టు శనివారం తమ చివరి మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ జట్టుతో తలపడనుంది.



# రోహిత్ ప్రపోజల్‌కు బీసీసీఐ నో!

టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్?కు అకస్మాత్తుగా రిటైర్మెంట్ ప్రకటించడం వెనుక సంచలన కారణాలున్నాయని జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఎంఎస్ ధోనీ తరహాలో తన వీడ్కోలును ప్లాన్ చేసుకునేందుకు రోహిత్ చేసిన ప్రతిపాదనను బీసీసీఐ తిరస్కరించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే రోహిత్ టెస్ట్ క్రికెట్?కు గుడ్ బై చెప్పినట్లు తెలుస్తోంది.2014లో ఆసీస్ పర్యటనలో ఉన్నప్పుడు ఎంఎస్ ధోనీ సిరీస్ మధ్యలోనే టెస్ట్ క్రికెట్?కు రిటైర్మెంట్ ప్రకటించాడు. అదే తరహాలో, త్వరలో ప్రారంభం కానున్న ఇంగ్లాండ్ పర్యటనలో కొన్ని టెస్టు మ్యాచ్?లకు నాయకత్వం వహించి, ఆ తర్వాత సిరీస్ మధ్యలో టెస్టుల నుంచి వైదొలగాలని రోహిత్ భావించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు రోహిత్ బీసీసీఐ సెలక్టర్ల ముందు ఒక ప్రతిపాదన ఉంచినట్లు నివేదికలు పేర్కొన్నాయి. అయితే, హిట్?మ్యాన్ చేసిన ఈ ప్రతిపాదనకు బీసీసీఐ సుముఖత వ్యక్తం చేయలేదని తెలిపాయి.కీలకమైన ఇంగ్లాండ్ సిరీస్?లో జట్టు నాయకత్వంలో స్థిరత్వం ఉండాలని, సిరీస్ మధ్యలో కెప్టెన్ మారడం జట్టు ప్రదర్శనపై ప్రభావం చూపుతుందని సెలక్టర్లు భావించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో రోహిత్ ప్రపోజల్?ను సున్నితంగా తిరస్కరించారని, ఒకవేళ సిరీస్?కు అందుబాటులో ఉండాలనుకుంటే ఆటగాడిగా కొనసాగవచ్చునని చెప్పారట. అలాగే కెప్టెన్‌గా మాత్రం పూర్తి సిరీస్?కు ఒక్కరే ఉండాలనే అభిప్రాయాన్ని వెలిబుచ్చినట్లు సమాచారం. దీంతో ఇంగ్లాండ్?తో సిరీస్?కు ముందే రోహిత్ రిటైర్మెంట్ ప్రకటించినట్లు కథనాలు వెలువడుతున్నాయి.మరోవైపు, రోహిత్ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన కొద్ది రోజులకే విరాట్ కోహ్లీ కూడా ఆ ఫార్మాట్?కు గుడ్ బై చెప్పాడు. దీంతో భారత జట్టులో తీవ్ర నాయకత్వ లేమి ఏర్పడింది. ఈ క్రమంలో అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ తదుపరి టెస్టు కెప్టెన్ ఎంపిక కోసం కసరత్తు చేస్తోంది. హిట్ మ్యాన్ స్థానంలో తదుపరి టెస్ట్ కెప్టెన్‌ను ఎంపిక చేసే క్రమంలో ఇప్పటికే గిల్, రిషబ్ పంత్ ఇద్దరితోనూ బీసీసీఐ సెలక్షన్ కమిటీ అనధికారిక చర్చలు నిర్వహించినట్లు సమాచారం. బుమ్రా, గిల్ కెప్టెన్సీ రేసులో ముందంజలో ఉన్నారని కథనాలు వస్తున్నాయి. గిల్?కు కెప్టెన్సీ ఇవ్వడం గురించి బీసీసీఐలోని ఒక సెలక్టర్ అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. వైస్ కెప్టెన్?గా అయితే బాగా సరిపోతాడని ఆ సెలెక్టర్ అన్నట్లు టాక్.అయితే భారత్ తదుపరి టెస్టు కెప్టెన్ ఎవరనేదానిపై మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ ఇటీవలే కీలక వ్యాఖ్యలు చేశాడు. ఇంగ్లాండ్?తో జరిగే టెస్ట్ పర్యటనలో భారత జట్టుకు గిల్ నాయకత్వం వహించగలడని అభిప్రాయపడ్డాడు. రిషబ్ పంత్ వైస్ కెప్టెన్?గా ఉండే అవకాశం ఉందన్నాడు. ‘భవిష్యత్ కెప్టెన్లు మన సూపర్ కెప్టెన్ల (ధోని, రోహిత్, కోహ్లీ) స్థాయికి చేరుకోవడానికి రెండేళ్లు పట్టొచ్చు. వారందరూ కెప్టెన్సీకి భిన్నమైన విధానాన్ని తీసుకున్నారు“భారత కెప్టెన్సీకి ప్రధాన పోటీదారులుగా గిల్, పంత్, శ్రేయస్ అయ్యర్?ను చూసినప్పుడు ధోనీ, రోహిత్, విరాట్ వంటి ఆటగాళ్లను కలిసి చూసినట్లు అనిపిస్తుంది. గిల్ బహుశా ఎక్కువ పోటీతత్వం ఎదుర్కొంటాడు. ఏదైనా నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినప్పుడు వెంటనే అంపైర్?ను అడుగుతాడు. రిషబ్ పంత్ స్టంప్స్ వెనుక నుంచి మ్యాచ్?లో చాలా ఉత్సాహంగా ఉంటున్నాడు. శ్రేయస్ అయ్యర్ కూడా అద్భుతంగా రాణిస్తున్నాడు’ అని సన్నీ వ్యాఖ్యానించాడు.

## ఆటగాళ్ల పట్ల నీతా అంబానీ ప్రత్యేక శ్రద్ధ

### ఫిదా అవుతున్న నెటిజన్లు

దేశంలో కొవిడ్-19 కేసులు మళ్లీ కలకలం రేపుతున్నాయి. దీని ప్రభావం ఐపీఎల్? మీద కూడా పడింది! రీసెంట్?గా సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లేయర్ ట్రావిస్ హెడ్? కొవిడ్ బారిన పడ్డాడు. దీంతో ఓ మ్యాచ్?కు దూరమయ్యాడు. ఈ నేపథ్యంలో ముంబయి ఇండియన్స్ యజమాని నీతా అంబానీ తమ ఆటగాళ్ల పట్ల తీసుకున్న ప్రత్యేక శ్రద్ధకు నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. వాంఖడే వేదికగా బుధవారం ముంబయి ఇండియన్స్-? ఢిల్లీ క్యాపిటల్స్ తలపడ్డాయి. ఈ మ్యాచ్?లో ముంబయి 59 పరుగులు భారీ తేడాతో నెగ్గి ప్లేఆఫ్స్ బెర్త్ ఖరారు చేసుకుంది. అయితే మ్యాచ్ అనంతరం ఇరుజట్ల ఆటగాళ్లు షేక్ హ్యాండ్ ఇచ్చుకునే సమయంలో ముంబయి ఓనర్ నీతా అంబాని కొవిడ్ ప్రొటోకాల్ పాటించారు. తమ ఆటగాళ్లందరికీ శానిటైజర్ అందించి జాగ్రత్త వహించారు. ముంబయి ప్లేయర్లకే కాకుండా ఆల్?రౌండర్ దీపక్ చాహర్ ఢిల్లీ ఆటగాళ్లకు సైతం శానిటైజర్? అందించాడు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో ఆమెను నెటిజన్లు మెచ్చుకుంటున్నారు.ఒకవేళ కొవిడ్ మళ్లీ విజృంభించి, ఐపీఎల్?లో ఆడుతున్న ప్లేయర్లకు సోకితే టోర్నమెంట్?కు మళ్లీ బ్రేక్ పడే ప్రమాదం ఉంది. అందుకే ప్లేయర్లందరూ ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటే కొవిడ్ ప్రభావం ఐపీఎల్ మీద పడే ఛాన్స్ ఉండదు. దీంతో టోర్నీ సాఫీగా సాగిపోతుంది! ఈ టోర్నీలో ఇంకా 11 మ్యాచ్? (7 లీగ్, 4 ప్లేఆఫ్స్)లు జరగాల్సి ఉంది.మ్యాచ్? ముగిసిన అనంతరం డగౌట్?లో కూర్చున్న నీతా అంబానీ చేతితో ఆరు వేళ్లను చూపిస్తున్న ఫొటో కూడా వైరల్?గా మారింది. అంటే ముంబయి ఇండియన్స్?కు ఆరో ఐపీఎల్? టైటిల్ ‘ఆన్? ది వే’ అన్నట్లు ఆమె సింబాలిక్?గా చెప్పారు. కాగా, ముంబయి ఇప్పటివరకు ఐదు (2013, 2015, 2017, 2019, 2020)సార్లు ఛాంపియన్?గా నిలిచింది.



## ఆర్‌సీబీకి వ్యతిరేకంగా ఆడాలని మెసేజ్‌లు వస్తున్నాయి

### ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ బెన్ కట్టింగ్

ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ బెన్ కట్టింగ్ పేరును రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) అభిమానులు అస్సలు మరిచిపోరు. ఐపీఎల్ 2016 ఫైనల్‌ను ఆర్‌సీబీ అభిమానులకు ఈ ఆసీస్ ఆటగాడు పీడకలగా మిగిల్చాడు. ఆ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహించిన బెన్ కట్టింగ్.. బెంగళూరు వేదికగా ఆర్‌సీబీ జరిగిన ఫైనల్లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆరెంజ్ ఆర్మీకి టైటిల్ అందించాడు.చివర్లో బ్యాటింగ్ వచ్చి కేవలం 15 బంతుల్లోనే 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 39 పరుగులు చేసిన బెన్ కట్టింగ్.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు 208 పరుగుల భారీ లక్ష్యాన్ని అందించాడు. ఆ తర్వాత డేంజరస్ క్రిస్ గేల్‌తో పాటు కేఎల్ రాహుల్‌లను ఔట్ చేసి ఆర్‌సీబీ పతనాన్ని శాసించాడు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

### రూరల్ బ్యాక్ గ్రౌండ్ నేపథ్యంలో

# శరవేగంగా రామ్‌చరణ్ పెద్ది షూటింగ్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, ఉప్పెన ఫేమ్ దర్శకుడు బుచ్చిబాబు సానా డైరెక్షన్‌లో రూపొందు తున్న భారీ చిత్రం 'పెద్ది' సినిమా షూటింగ్ జోరందుకుంది. ఈ సినిమాలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పాన్-ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. 'పెద్ది' సినిమా కోసం హైదరాబాద్ శివారులోని శంకర్ పల్లిలో ఒక భారీ గ్రామీణ సెట్‌ను నిర్మించారు. ఈ సెట్‌లో ప్రస్తుతం కీలక షెడ్యూల్ షూటింగ్ జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో ఒక హై-ఆక్టేన్ యాక్షన్ సీన్‌తో పాటు కొంత టాకీ భాగం చిత్రీకరణ జరగనుందని సమాచారం. ఈ సెట్‌లో గ్రామీణ వాతావరణాన్ని అత్యంత సహజంగా రీక్రియేట్ చేసినట్లు తెలుస్తోంది, ఇది సినిమాకు ఒక ప్రత్యేకమైన ఆకర్షణను జోడిస్తుందని మేకర్స్ నమ్ముతున్నారు. తాజాగా, సినిమా టీం సెట్స్ నుంచి కొన్ని ఆసక్తికరమైన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ చిత్రాల్లో రామ్ చరణ్‌తో పాటు దర్శకుడు బుచ్చిబాబు సానా, బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ (మున్నాభాయ్ ఫేమ్) కలిసి కనిపించారు. దివ్యేందు శర్మ ఈ సినిమాతో తెలుగు సినిమాలోకి అడుగుపెడుతున్నారు, ఇది ఆయనకు తొలి తెలుగు చిత్రం కావడం గమనార్హం. 'పెద్ది' సినిమాలో రామ్ చరణ్, జాన్వీ కపూర్‌తో పాటు కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్, జగపతి బాబు వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు, ఇది సినిమాకు మరో పెద్ద ఆకర్షణగా నిలుస్తోంది. సినిమాటోగ్రఫీని ఆర్. రత్నవేలు, ఎడిటింగ్‌ను నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైన్‌ను అవినాశ్ కొల్లా నిర్వహిస్తున్నారు. 'పెద్ది' ఒక రస్టిక్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఈ సినిమా 1980ల నాటి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ నేపథ్యంలో సాగుతూ, క్రీడల ద్వారా సమాజాన్ని ఏకం చేసే ఒక యువకుడి కథను చెబుతుందని తెలుస్తోంది. రామ్ చరణ్ ఈ చిత్రంలో క్రికెటర్‌గా కనిపించనున్నారు, ఆయన రగ్గడ్ లుక్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమా కోసం రామ్ చరణ్ ఆస్ట్రేలియాలో ప్రత్యేక శిక్షణ కూడా తీసుకున్నట్లు సమాచారం.






## పూరి -విజయ్ సేతుపతి కాంబినేషన్


### వచ్చే నెలలో షూటింగ్ ప్రారంభం

డేరింగ్ అండ్ డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో ఓ భారీ ప్రాజెక్ట్ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. పాన్ ఇండియా స్థాయిలో మల్టిపుల్ లాంగ్వేజెస్‌లో రూపొందనున్న ఈ సినిమా పూరి కనెక్ట్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్ , చార్మీ కౌర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం హిందీ భాషల్లో విడుదల కానుంది. కాగా ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ జూన్ నుంచి ప్రారంభమవుతుంది. ఇందులో యాక్ట్ చేసే ప్రధాన నటీనటుల వివరాలను ప్రకటిస్తూ వస్తున్నాడు పూరి. ఇప్పటికే ఈ మూవీలో టబు కీలక పాత్ర పోషించనుండగా, విజయ్ కుమార్ కూడా నటిస్తున్నాడు. అయితే ఈ మూవీకి 'బెగ్గర్ ' అనే టైటిల్ వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. అయితే ..తాజాగా ఓ మూవీ ఈవెంట్‌లో పాల్గొన్న విజయ్ సుతుపతి దీనిపై కొంత క్లారిటీ ఇచ్చారు.. ' పూరి జగన్నాథ్ పనిని నేను గౌరవిస్తాను. ఆయన తెరకెక్కించిన ప్రతి ఒక్క సినిమా చూశా. స్క్రిప్టు వినడానికి రెండు, మూడు రోజులు పడుతుందేమో అనుకున్నా. గంటల వ్యవధిలోనే పూర్తి చేశారు. జూన్ లో షూటింగ్ ప్రారంభం అవుతుంది. ఆడియన్స్ కంటే నేనే ఎక్కువ ఆసక్తిగా ఎదురుచూస్తున్న.. ఇక టైటిల్ అంటారా ఇంకా సినిమాకి టైటిల్ పెట్టలేదు. బెగ్గర్ అని మీరే ఖరారు చేశారా?' అంటూ నవ్వుతూ సమాధానం ఇచ్చారు.




## శివాజీ మహారాజ్ బయోపిక్

బాలీవుడ్ నుంచి ఈ ఏడాది వచ్చిన 'ఛావా' చిత్రం ఎంత ఘనవిజయం సాధించిందో అందరికీ తెలిసిందే. మొదటి షోతోనే బ్లాక్ బస్టర్ హిట్ సొంతం చేసుకుని కనీవినీ ఎరుగని కలెక్షన్లు సాధిస్తూ ట్రేడ్ నిపుణులను సైతం ఆశ్చర్యపరిచింది. బాలీవుడ్ బాక్సాఫీస్ రికార్డులు బద్దలు కొట్టిన 'ఛావా' సినిమా భారతదేశంలోనే కాకుండా విదేశాల్లోనూ కలెక్షన్ల వర్షం కురిపించింది. ఇందులో విక్కీ కౌశల్ మరాఠా యోధుడి పాత్రలో నటించి అభిమానుల మెప్పు పొందగా. శంభాజీ భార్యగా నేషనల్ క్రష్ రష్మిక మందన్నా పాత్రకు ప్రశంసలు దక్కాయి. అయితే ఈ చిత్రం ఛత్రపతి శివాజీ మహారాజ్ వారసుడు శంభాజీ మహారాజ్ జీవిత చరిత్రపై తెరకెక్కిస్తే రికార్డు వసూళ్లు వచ్చాయి. మరి అలాంటిది శివాజీ మహారాజ్ పైనే తెరకెక్కిస్తే? దాని హైప్ ఇంకెలా ఉంటుందో ఒక్కసారి ఆలోచించండి. అవును బాలీవుడ్ నుంచి మరో బయోపిక్ అనౌన్స్ అయ్యింది. 'రాజ శివాజీ' అనే ఈ చిత్రాన్ని ప్రముఖ హీరో రితేష్ దేశ్ ముఖ్ దర్శకత్వం వహిస్తుండడం తో పాటుగా శివాజీ మహారాజ్ పాత్ర కూడా తానే పోషించనున్నాడు. ఇక తనతో పాటుగా సంజయ్ దత్ ఇంకా అభిషేక్ బచ్చన్ తదితరులు కూడా నటిస్తున్నారు. అలాగే అజయ్ ? అతుల్ లు సంగీతం అందిస్తుండగా, వచ్చే ఏడాది మే 1 మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా ఈ మూవీ విడుదలకు ఎ÷-లాన్ చేయనున్నారట.దీనికి సంబంధించిన పోస్టర్ వైరల్ అవుతుంది.




## పవన్ అభిమానులకు డబుల్ స్వీట్

### జూన్‌లో ఉస్తాద్ భగత్ సింగ్ షూటింగ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు శుభవార్త! ఆయన నటిస్తున్న భారీ చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' షూటింగ్ జూన్ నెల నుంచి జోరందుకోనుంది. గతంలో సూపర్ హిట్ చిత్రం 'గబ్బర్ సింగ్' కాంబోలో దర్శకుడు హరీష్ శంకర్‌తో పవన్ కళ్యాణ్ మరోసారి జతకట్టడంతో ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ చిత్రం పూర్తి స్థాయి మాస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనుందని సమాచారం, ఇది అభిమానుల ఉత్సాహాన్ని మరింత పెంచుతోంది. పవన్ కళ్యాణ్ ప్రస్తుతం రాజకీయ రంగంలో ఒక బలమైన ఇమేజ్‌ను సొంతం చేసుకున్నారు. ఆయన జనసేన పార్టీ అధ్యక్షుడిగా, డిప్యూటీ సీఎంగా ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలో, 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం ఆయన రాజకీయ ఇమేజ్‌కు ఎలాంటి భంగం కలిగించకుండా, అభిమానుల అంచనాలను అందుకునేలా రూపొందించే బాధ్యత దర్శకుడు హరీష్ శంకర్‌పై ఉంది. హరీష్ శంకర్, పవన్ కళ్యాణ్‌లతో గతంలో 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్‌బస్టర్ ఇచ్చిన నేపథ్యంలో, ఈ కాంబో మరోసారి మ్యాజిక్ సృష్టిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా సినిమా టీం ఒక స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో పవన్ కళ్యాణ్ ఒక వ్యక్తితో చేయి కలుపుతూ కనిపిస్తుండగా, ఆయన మెడలో ఆంజనేయ స్వామి లాకెట్ హైలైట్‌గా నిలిచింది. ఈ పోస్టర్ అభిమానుల్లో కొత్త ఉత్తేజాన్ని నింపింది. ఆంజనేయ స్వామి లాకెట్‌తో పవన్ కళ్యాణ్ లుక్, సినిమాలో ఆయన పాత్ర శక్తివంతంగా ఉంటుందని సూచనగా అనిపిస్తోంది.పవన్ కళ్యాణ్ సినిమా అంటేనే అభిమానుల్లో ఒక పండుగ వాతావరణం నెలకొంటుంది. 'ఉస్తాద్ భగత్ సింగ్' పోస్టర్‌తో ఆ ఉత్సాహం ఇప్పటికే మొదలైంది. సోషల్ మీడియాలో ఈ పోస్టర్ వైరల్‌గా మారింది, అభిమానులు తమ ఆనందాన్ని హ్యాష్‌ట్యాగ్‌లతో పంచుకుంటున్నారు. జూన్‌లో షూటింగ్ ప్రారంభం కానుండటంతో, సినిమా గురించి మరిన్ని అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది.



## కేన్స్‌లో అమ్మ జ్ఞాపకాలు పలకరించాయ్: జాన్వీ

వేదికగా కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ అట్టహాసంగా జరుగుతున్న విషయం తెలిసిందే. మే 13న ప్రారంభమైన ఈ ఈవెంట్ లో ఐశ్వర్య రాయ్, ఊర్వశి రౌతెలా, దిశా మదన్ తదితర భారతీయ ముద్దుగుమ్మలు తళుక్కుమన్నారు. రెడ్ కార్పెట్ పై నడిచి కెమెరాలకు పోజులిచ్చారు. ఈసారి తాజాగా బాలీవుడ్ అందాల తార జాన్వీ కపూర్ కూడా మొదటి సారిగా కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు హాజరైంది. ఈ సందదర్భంగా లేత గులాబీ పొడవాటి గౌన్‌ను ధరించిన ఆమె, రెడ్ కార్పెట్‌పై హొయలొలికించింది. తన స్టైలిష్ అండ్ ట్రెడిషనల్ లుక్ తో తన తల్లి శ్రీదేవిని గుర్తుచేసింది. అయితే కేన్స్ లో అడుగు పెట్టడం గురించి తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు తల్లిని గుర్తు చేసుకుని ఎమోషనల్ అయింది..జాన్వీ మాట్లాడుతూ.. 'హాలీడే ఎంజాయ్ చేయడానికి అమ్మ తరచూ మిమ్మల్ని ఇక్కడికి తీసుకువస్తుండేది. అమ్మకు కేన్స్ అంటే ఎంతో ఇష్టం. నాకు గుర్తున్నంతవరకు వరుసగా నాలుగు సంవత్సరాలపాటు వేసవి సెలవులకు ఇక్కడికే వచ్చాం. ఈరోజు నేను కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ లో తొలిసారి పాల్గొనడం నా కుటుంయిానికి ఎంతో ప్రత్యేకమైన విషయం. నటిగా అమ్మ ఎన్నో అవార్డులు, రివార్డులు సొంతం చేసుకుంది. ఆమెకు సంబంధించిన ప్రతి కార్యక్రమానికి నన్ను తీసుకువెళ్ళింది. ఆమె విజయాలను కుటుంబమంతా సెలబ్రేట్ చేసుకునే వాళ్లం. ఆ రోజులు మాకెప్పటికీ గుర్తుంటాయి. అలాంటిది ఈరోజు మేమంతా మళ్ళీ కేన్స్ లోకి అడుగు పెట్టాం.. నాతోపాటు నాన్న, చెల్లి కూడా వచ్చారు. అమ్మ లేకుండా ఇక్కడికి రావడం నాకెంతో బాధగా ఉంది. ఆమెను నేనెంతో మిస్ అవుతున్నాను' అని జాన్వీ కపూర్ తెలిపింది.

EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685